ఆంధ్ర సచిత్ర వారపత్రిక

2-9-83
150 పైసలు



విజయ్



అసోసియేటెడ్ మార్కెటింగ్ ఏజన్సీస్,
4-4-340/బి, బ్యాంక్ స్ట్రీట్. హైదరాబాదు-500 001.
ఫోన్: 58142/45895

28327

దేశ విఖ్యాతిగాంచిన విమల్ చీరల్లో సరికొత్త శ్రేణికై
విచ్చేయండి నేడే మంగళ్‌దీప్‌కి.



VIMAL®
A RELIANCE PRODUCT

మంగళ్‌దీప్

కోఠీ, హైదరాబాద్, ఫోన్ : 45786

ఆంధ్ర ప్రదేశ్‌లో అన్నిటికన్నా పెద్దదైన విమల్ షోరూం

మే న క

మేనక ముఖచిత్రం ముగ్ధ మోహనంగా వుంది. "జీవన మురళి"తో పరిచయం కావడం చాలా గమ్మత్తుగా వుంది. మా గుండె లోతుల్లో నిక్షిప్తమైపోయింది ఆ జంట. వాళ్ళిద్దరూ జతపడాలని ఆశిస్తున్నాను.

ఆర్. డేవిడ్ విల్సన్ (కావలి)

చూడాలనిపించే అందం

5–8–83 ఈ వారం ముఖచిత్రం చూశాక–"చూసేకొలది చూడాలనిపించే అందం, మనలను వెంటనే ఆకట్టుకునే ఆ కండ్లు కలిగినది పూనమ్ ధిల్లాన్ !"

ఎస్. కె. ఖాన్ అహమద్ (శ్రీహరికోట)

న్యూఢిల్లీ లేఖ

29–7–83 ఆంధ్ర సచిత్ర వారపత్రికలో డాక్టర్ జయ్‌దుబాషీగారు (న్యూఢిల్లీ లేఖ) "... అసలు సి. ఐ. ఏ. అంత పాతదా ?" అన్నారు. నిజమే, సి. ఐ. ఏ 1930 అంత పాతది కాదు. 1947లో సృష్టించబడింది. రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత ప్రెసిడెంట్ ట్రూమన్ అప్పటి గూఢచారి సంస్థ అయిన ఓ. ఎస్. ఎస్. (ఆఫీస్ ఆఫ్ ది స్ట్రాటెజిక్ సర్వీసెస్)ను రద్దు చేసారు. కాని 1947 ప్రాంతంలో కొరియాలో యుద్ధమేఘాలు అలుముకోవడంతో, అమెరికా రక్షణార్థం 'నేషనల్ సెక్యూరిటీ ఆక్ట్' కాంగ్రెస్ చేత పాస్ చేయించారు ప్రెసిడెంట్ ట్రూమన్. ఆ వెంటనే సి. ఐ. ఏ (సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ)ను స్థాపించారు. 1949లో 'సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆక్ట్' పాస్ అయింది. దీని ఫలితంగా సి. ఐ. ఏ. కు ప్రత్యేక అధికారాలు లభించాయి. అప్పటినుంచి సి. ఐ. ఏ. వ్యవహారాలని తనిఖీచేసే అధికారం కాంగ్రెస్‌కు లేకుండా పోయింది.

జాన్ ఫాస్టర్ డల్లెస్ అమెరికా విదేశాంగ మంత్రి అవ్వడంతో సి. ఐ. ఏ. వ్యవహారాలు వేగం పుంజుకున్నాయి. కేవలం అమెరికా



రక్షణార్థం సృష్టించబడిన ఈ గూఢచారి సంస్థ, ఇతర దేశాల ఆంతరంగిక వ్యవహారాల్లో తలదూర్చి ఆ యా ప్రభుత్వాలని పడగొట్టే సంస్థగా మారింది. మన 'ఖలిస్థాన్' అలజడిలో సి. ఐ. ఏ. హస్తం కొట్టవచ్చినట్లు కనిపిస్తోంది.

ఇక శాసనసభ్యుల 'విజ్ఞాన' విషయానికి వస్తే – అమెరికన్ సెనేటర్లకి మన వివరాలు తెలియకపోవచ్చు. కాని 'ఆంధ్రప్రదేశ్' అనే రాష్ట్రం దక్షిణ భారతంలో వుందని, దానికి రాజధాని హైదరాబాద్ అని ఎంతమంది మన 'లోక్‌సభ' సభ్యులకి తెలుసు ?

టి. వి. రావు (సికింద్రాబాద్)

* * *

న్యూఢిల్లీ లేఖ డా॥ జయ్‌దుబాషీ వ్రాసిన "యూరోపు వెళ్ళివచ్చి శ్రీమతి గాంధీ సాధించిన దేమిటి ?" నన్ను ఎంతగానో ఆకర్షించింది.

గిడుతూరి బేబిసుశీల (పెదనిండ్రకొలను)

సంతోషము

12–8–83 మేనక ముఖ చిత్రంతో వెలువడిన పత్రికలోని ఢిల్లీలేఖ డాక్టర్ జయదుబాషి వ్రాసిన వ్యాసం చదివి ఆటమిక్ ఎనర్జి డిపార్ట్‌మెంటు యొక్క తారాపూర్ అణువిద్యుత్ కేంద్రం గురించి చదివి సంతోషించాము. హైదరాబాద్‌లో అదే డిపార్ట్‌మెంటు యొక్క ఎన్. ఎఫ్. సి.లో పనిచేయుచున్న మేము డాక్టర్ దుబాషి లేఖ ద్వారా కొంతవరకు తెలుసుకున్నట్లయింది. చాలా సంతోషము.

పి. శేషవర్ధనరావు (హైదరాబాద్)

ప్రమాదవశాత్తా ?

కాల్పాక్కమ్ రియాక్టర్ పనిచెయ్యటం, బిర్లా చనిపోవటంకన్నా ప్రపంచ క్రికెట్‌లో భారత్ గెలవడం పెద్ద విశేషం కాదని డా. జయ్ దుబాషీ గారితో నిస్సంకోచంగ ఏకీభవించవలసి వుంది. కాని "ప్రమాదవశాత్తు విజయం సాధించటం" అన్న వ్యాఖ్య అంత సబబు కాదేమోనని అనిపిస్తుంది. ఎందుకంటే ఒక్క ఆటలోమాత్రం అలా జరిగివుంటే దుబాషీ గారన్నట్లు ప్రమాదవశాత్తు అనుకోవలసి వచ్చేదే కాని ఒకసారి వెస్ట్ ఇండియన్స్‌ని, తరువాత ఇంగ్లండువారిని ఓడించి అంచలంచలుగ పైకి వచ్చి, తుదకు, వెస్ట్ ఇండియన్స్‌ని ఫైనల్స్‌లో మరల ఓడించగలగడం ప్రమాదవశాత్తు కాదని తప్పక అనిపిస్తుంది. తీవ్రమైనకృషి అనంతరమే విజయలక్ష్మి భారత్‌ను వరించిందని నిస్సందేహంగ చెప్పవలసి వుంది. అయినా దుబాషీగారన్నట్లు ఈ విజయానికి అవసరమైన దానికన్న అధిక ప్రాముఖ్యతను మన పత్రిక ఇవ్వడంమాత్రం యదార్థం !

ఆవుల రమణారెడ్డి (జమ్మలమడుగు)

కథలు


అద్భుతమైన కథ "లాస్ట్ జడ్జిమెంట్" ప్రచురించి, ఆంధ్ర సచిత్ర వారపత్రిక అద్భుత మనిపించుకున్నారు. కండ్లుంటే చాలదు, కంటికి చూపుండాలన్నట్టు, కథలుంటే చాలదు, కథకు నీతి వుండాలని నిరూపించి, వెలిగేదీపానికి, జ్వాల తగ్గక, దీపం మరింత ప్రకాశముగ వెలుగొందే దానికి, దీపములోని ఒక చిన్నపుల్ల సహాయపడు నట్లు, మీరు నిమ్నజాతుల రిజర్వేషను విషయమై, వాటి కనుగుణముగ (సర్కారు చట్టాలకు) వుండాలని జాతికి నీతి నేర్పిన మీకు నా తరుపున, నా జనాంగము తరుపున కోరుకొనుచు ప్రణవీబ్రదర్స్‌కు ప్రత్యేక ప్రజల ప్రజాభినందనలు.

టి. ఎ. దామోదరన్ (మదరాసు)

సాహసమే మా వృత్తి

"సాహసమే మా వృత్తి" అను శీర్షిక క్రింద ఓ స్టంటు ఆర్టిస్టు తన స్వగతం చెప్పింది చదివితే నాకు చాల బాధ కలిగించింది. ఇలా యెంతమంది టెక్నీషియన్లు యెన్నో బాధలకు గురౌతున్నారుగదా మరి. అయితే మాటలు పాటలు రాసేవాళ్ళక్కూడా యెంతగానో యిస్తున్నట్లు లేదు శ్రీశ్రీగారి గురించి ఆంధ్రజ్యోతిలో వ్రాసినట్లు. మరయితే సినిమా వాళ్ళ రాబడి లక్షలకు లక్షలు యెవరు మింగేస్తున్నట్లు ? రాళ్ళు మోసి వంతెన కట్టిన కూలీకి యిరవై పైసలు "టీ" యేగా యిచ్చేది ! అందరూ నీతులు చెప్పేవాళ్ళే. న్యాయం ఎక్కడ ?

యం. జయభారతి (విజయనగరం) ★



ఆంధ్ర సచిత్ర వారపత్రిక

1983 దీపావళి కథల పోటీ

మొత్తం రు. 6000ల బహుమతులు

ఎప్పటిలాగే ఈసారి కూడా దీపావళికి కథానికల పోటీ పెడుతున్నాము..... పోయిన యేడాదిలాగే యీసారి కూడా సంపాదకుని ఎన్నికలో ఉత్తమంగా వచ్చిన ఆరు కథలను ఆంధ్ర సచిత్ర వారపత్రిక దీపావళి సంచికలో, ఆ తరువాతి సంచికలో వేస్తాము. ఆ తరువాత పాఠకుల బాలట్ నిర్వహిస్తాము.

ముగింపు తేదీ 31.8.83 → బుధవారం...

పోటీలో ఎన్నికైన ఆరు కథలకు ఒక్కొక్కదానికి రు. 600/-లు చొప్పున బహుమతుల ఇస్తాము. ఆ తరువాత బాలట్ లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో వచ్చిన మూడు కథలకు రు. 650/-, రు. 550/-, రు. 450/-ల వంతున అదనపు బహుమతుల యివ్వడమే గాక మిగిలిన మూడు కథలకు రు. 250/-ల చొప్పున మూడు కన్సొలేషన్ బహుమతుల అందజేస్తాము.

★ 'కథానిక' ఆంధ్ర సచిత్ర వారపత్రికలో నాలుగు పేజీలు మించకుండా వుండాలి. 12 అరటావులు దాటకుండా వ్రాస్తే చాలు. నిడివి ఎక్కువ అయిన కథలకు బహుమతి రాగల అవకాశాలు చాలా తక్కువ అని గమనించాలి.

★ కథావస్తువు తెలుగువారి సామాజిక జీవితానికి సంబంధించి వుండాలి.

★ అనువాదం, అనుసరణ, అనుకరణ, కాపీ కథలు పంపకూడదు. ప్రసారమైన, ప్రచురణ అయిన లేదా ఇతర పత్రికలకు పంపబడి పరిశీలనలో వున్న కథలు అసలే పంపకూడదు.

★ పై అంశాల మేరకు హామీ పత్రం ప్రతి కథతోపాటు విడిగా వుండితీరాలి. కలంపేరు వాడినా అసలు పేరు, యింటిపేరు సహా పూర్తిగా విడిగా స్పష్టంగా పూర్తి చిరునామాతోపాటు అందిన కథలనే పరిశీలించ వీలవుతుంది.

★ కథలతోపాటు రచయితల పేర్లు పడవు. బ్యాలట్ తరువాత వారి పరిచయంతోనే వేస్తాము.


★ రచనలపై కేసులు వస్తే రచయితలే బాధ్యత వహించవలసి వుంటుంది.

★ పోటీలో నెగ్గిన కథల రచయితలు తమ ఫోటో, జీవిత విశేషాలు మొదలైనవాటిని పంపి, వాటి ప్రచురణకు అంగీకరించాలి.

★ ముగింపు తేదీ దాటిన తరువాత అందిన కథలను మామూలు ప్రచురణకు వీలువెంబడి పరిశీలిస్తాము. పోటీకి పంపిన కథలను ఏ పరిస్థితులలోను త్రిప్పి పంపలేము.

— సం॥

లోకం పోకడ ✱ ఊమెన్



ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :

దేశోద్ధారక కాశీనాథుని

నాగేశ్వరరావు పంతులుగారు

స్థాపితం : 1908

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు :

[1938–1972]

శుక్రవారం : 2–9–'83

రుధిరోద్గారి నామ సం. శ్రావణ బ. దశమి

సంపుటము 75 సంచిక 53

సంపాదకుడు :

శివలెంక రాధాకృష్ణ

విడి ప్రతి వెల రు. 1-50

ఆరు మాసాల చందా రు. 42-90

పోస్ట్‌లో ఏడాది చందా రు. 85 80

ఆంధ్రపత్రిక కార్యాలయము,

గాంధీనగరం· విజయవాడ-520 003·

విషయానుక్రమణిక

ముఖచిత్రం :

'ఖైదీ' లో సుమలత

కథలు :

సీరియల్ నవలలు :

వ్యాసాలు, శీర్షికలు :

విభజించేవి తేడాలుకావు పోలికలే


అంగారక గ్రహం నుంచి ఒక వ్యక్తి హఠాత్తుగా దిగివచ్చాడనుకోండి. అతనే మనుకుంటాడు ? భూగోళం మీద నున్న మన ఈ ప్రపంచం త్వరలో అంతం అయిపోతుందనుకుంటాడు. ఎక్కడచూసినా మనుష్యుల మధ్య యుద్ధాలే. మగవాళ్ళమధ్య యుద్ధం చాలదన్నట్లు ఆడా, మగా మధ్య కూడా యుద్ధమే! బౌద్ధులు గభాలున పిచ్చెత్తిపోయి ఆడా, మగా, పిల్లలూ— అందరినీ హతమార్చటం మొదలుపెడితే ఏమనుకోవాలి ? ఇలాగ జరుగుతుందని ఎవరైనా అనుకున్నారా ? బౌద్ధులూ, హైందవులూ వేరే మతం వాళ్ళే కాని ఇంత ద్వేషమా ? మహమ్మదీయూలూ, క్రైస్తవులూ పోట్లాడుకున్నారంటేనే నేను ఆశ్చర్యపడను. అది వాళ్ళకి సహజంగా వచ్చేపనే. కసాయి వాడికి కత్తి వాడటం కొత్త ఏమిటి ? ఇరాన్ — ఇరాక్‌లు రెండూ మహమ్మదీయ దేశాలే. "మహమ్మదీయ దేశాలంటే ఏమిటి ?" అంటే నేను అర్థం చెప్పలేనేమో కాని జరుగుతున్నది ఇదీ అని మాత్రం చెప్పగలను. పాలస్తీనా విముక్తి సంస్థ మాత్రం ఒక మహమ్మదీయ సంస్థ కాదూ ? అందులోనూ పేచీలు లేవూ ? ఇక క్రైస్తవులంటారా — వాళ్ళు యుద్ధాలు చేసుకోనిదెప్పుడూ ? 18, 19 శతాబ్దాలలో యుద్ధాలు లేవా, చివరి రెండు ప్రపంచ యుద్ధాలలోనూ పెద్ద ఎత్తున చంపుకోలేవా, యూరోపులో వాళ్ళు ?

వాళ్ళు అంతే — కాని, శ్రీలంక బౌద్ధులు అక్కడి తమిళులతో ఎందుకు యుద్ధం వేయాలి? వాళ్ళు కలిసిలేరూ వందల ఏళ్ళగా ఆ ద్వీపంలో ? శ్రీలంక తమిళులంటారు : "మమ్మల్ని శ్రీలంక సింహళులు అణచివేస్తున్నారు, ఇలాగే మరికొంత కాలం జరిగితే మా గతేమి కావాలి ?" అని. భారతదేశంలోనూ ఇలాంటి భయాలు వెలిబుచ్చే వాళ్ళు ఉన్నారు. వాళ్ళలో కొందరు తమది వేరే "జాతి" అంటారు. వాళ్ళ పరిభాషలో "జాతి" అంటే "మతం" అనే అర్థం. [సిక్కు జాతి, మహమ్మదీయ జాతి ఉంటాయని వీరి వాదం.] తమని ఎవరో దుర్వినియోగానికి గురి చేస్తున్నారని ఫిర్యాదు. దుర్వినియోగానికి గురిచెయ్యటం అనేమాట మార్క్సిస్టులు బాగా వాడతూ ఉంటారు. మమ్మల్ని ఇతరులు దుర్వినియోగం చేస్తున్నారు కాబట్టి మాకు వేరే రాష్ట్రం కావాలి—అంటారు వీళ్ళు శ్రీలంకలోని తమిళుల లాగే. కొంచెం ఆలోచించి చూస్తే అనిపిస్తుంది, "ఈ ప్రపంచంలో తమకి వేరేరాష్ట్రం కావాలని అడగనిది ఒక్క హైందవులే. వాళ్ళు మాత్రం ఎందుకు అడగకూడదు ?" అని. అడగవలసిందేనేమో !

మానవుడి పరిసరాలని బట్టి అతను మారుతాడు, అని మార్క్సిస్టుల సిద్ధాంతం. మానవుడి చర్యలు, నమ్మకాలు — వీటిని అర్థం చేసుకోవాలంటే అతని చుట్టూ ఉన్న భౌతిక పరిసరాలనీ, పరిస్థితులనీ అనుశీలించాలని మార్క్స్ అంటాడు. పంజాబునే తీసుకుందాము. ఒక మతం వాళ్ళ భౌతిక పరిసరాలూ మరొక మతంవాళ్ళ భౌతిక పరిసరాలకన్నా వేరుగా ఉన్నాయా ? ఒక కర్మాగారంలో పనిచేసే హైందవ కార్మికుడి పనిముట్లు అతనితోబాటే పనిచేసే ఒక సిక్కు కార్మికుడు పనిముట్లకన్నా వేరుగా ఉంటాయా ? శ్రీలంకలో తమిళులకి కాలేజీలలో ఒక రకం భౌతికశాస్త్రాన్ని నేర్పి సింహళులకి ఇంకొకరకం భౌతికశాస్త్రం నేర్పుతారా ? పరమాణువు పాకిస్తాన్‌లో ఒక విధంగానూ కాల్పాక్కమ్‌లో మరొక విధంగానూ ప్రవర్తిస్తుందా ? ఈ వాస్తవిక, భౌతిక విశ్వంలో విజ్ఞానశాస్త్రాల సిద్ధాంతాలన్నీ అందరికీ ఒకటే అయితే, ఇక చివరికి పరిసరాలు ఎలాగ ఉండాలో నిర్ణయిస్తే — మానవులు చిన్న చిన్న విషయాలని గురించి ఇంతగా పోట్లాడుకుంటారు ఎందుకూ ?

మనకి ఈ భౌతికవాదం అతిగా తలకెక్కిందేమో అనుకుంటూ ఉంటాను. మన చుట్టూ జరిగేదంత ముఖ్యమే కాని మనలోపల జరిగేది ముఖ్యమే కదా! మనలోపల జరిగేది చాలా వరకు మన బయట జరిగే దానిమీద ఆధారపడదేమో ?

మనలోపల మిగిలే స్మృతి, విజ్ఞానం, అనుభూతి కొన్ని వేల ఏళ్ళగా సంక్రమించినవి. ఇవే మన స్వభావాన్ని — ఆదే మన సమాజం



యొక్క స్వభావాన్ని — మలిచేవి. అనుభూతి అన్నది ఒక తెగకి చెంది ఉంటుంది. అది ఒక తెగ యొక్క సంస్కృతిలోని అంశం. మన జీవనాధారం ఏదయినా కానివ్వండి, మనం వాడే పనిముట్లు ఏవయినా కానివ్వండి — ఈ తెగ యొక్క సంస్కృతి లేదా జాతీయ సంస్కృతి మనం చేసే పనులు ఎలాగ ఉంటాయో నిర్ణయిస్తుంది. మన పరిసరాల ప్రభావానికి మనం ఎలాగ స్పందిస్తామో నిర్ణయిస్తుంది.

శ్రీలంకలోని తమిళులూ, భారతదేశంలోని తెలుగువారూ తమకి వేరే రాష్ట్రం కావాలంటారు. (దేశం అంటేకూడా అంతేగామరి ?) శ్రీలంకలో ఉండే తమిళులు అనుకుంటున్నారు : "ఒక తెగ లేదా ఒక జాతిగా తమ ఉనికికి ముప్పు వచ్చిందని. అందుకనే తాము ఎదురు తిరిగి, యుద్ధంచేసి తమ స్వంత రాష్ట్రాన్ని ఏర్పాటు చేసుకోవాలి" అని. తమ సొంత రాష్ట్రంలో తప్ప వేరే చోట తమకి స్వాతంత్ర్యం ఉండదని వారి వాదం. సిక్కులకి ఇలాంటి ప్రమాదం ఏదయినా వచ్చిందా ? లేదనే నేను అనుకుంటున్నాను. తమకి ఏదో అన్యాయం జరిగిందని వాళ్ళు అరచే అరుపులు వట్టి బూటకాలు. కాని, భింద్రాన్‌వాలె వంటి వ్యక్తులు కొందరు తమకి అభివృద్ధి చెందే సిక్కు సమాజంలో స్థానం ఉండదని భయపడుతూ ఉండవచ్చు. నిజానికి అపాయం ఏదీ ఉండక్కరలేదు. అపాయం ఏదో ఉందని అనిపిస్తే చాలు. అదే ముఖ్యం అలాంటివాళ్ళకి.

ఇదంతా ఆసియాలో ఉండే జనానికి మాత్రమే వర్తిస్తుందని నేనటంలేదు. ప్రపంచం అంతా ఇంతే. ఉదాహరణకి 'బాస్క్' తెగ వాళ్ళని తీసుకోండి. వాళ్ళు స్పెయిన్, ఫ్రాన్సు దేశాల సరిహద్దు ప్రాంతంలో ఉంటారు. [వీరి భాషకీ దక్షిణ భారతదేశంలోని భాషలకీ సంబంధం ఉందని కొందరు భాషాశాస్త్రవేత్తల అనుమానం.] బాస్కులు ఇటు స్పెయిన్ వాళ్ళ అధికారాన్నిగాని, అటు ఫ్రాన్సు వాళ్ళ అధికారాన్నిగాని ఒప్పుకోరు. వారు ఇంకా తిరుగుబాటునీ, దౌర్జన్యాన్నీ వదులుకోలేదు. ఇంతకీ బాస్కుల సంఖ్య లక్షలలోనే ఉంటుంది కాని కోట్లలో ఉండదు. లక్షల మంది కల బాస్కులలో సాలుకి అరడజను హత్యలు జరుగుతూ ఉంటాయి. బ్రిటన్‌లో వేల్స్ అనే ప్రాంతం ఉంది. వెల్ష్ తెగ వాళ్ళు తామూ ఇంగ్లీషుజాతి వాళ్ళమని అనుకోరు. అక్కడ "వెల్ష్‌నేషనలిస్ట్ పార్టీ" ఒకటి ఉంది. దీనికి కొంత పలుకుబడి లేకపోలేదు. ఉత్తర ఐర్‌లాండ్‌లో బ్రిటిషు వాళ్ళకీ, ఐరిష్

న్యూఢిల్లీ లేఖ

వాళ్లకీ యుద్ధం నిరంతరంగా సాగుతూనే ఉంది. ఐరిష్‌జాతి వాళ్లలో కాథలిక్‌లు ఎక్కువ. బ్రిటిషు (ఇంగ్లీషు) వాళ్లలో ప్రొటెస్టెంట్‌లు ఎక్కువ. ఈ రెండు తెగలూ క్రైస్తవ తెగలేకాని వాళ్లు కలిసి ఒకే చర్చిలో ప్రార్థించరు.

జాతికీ మతానికీ సంబంధంలేదు. ఒకే మతానికి చెందిన మనుషులే వేరు వేరు జాతులకి చెందినట్లు నమ్ముతూ ఉండవచ్చు. [ఇక్కడ "జాతి" అంటే కులానికి సంబంధించినది కాదని గమనించాలి.] అలాగే ఒకే జాతికి చెందిన మనుషులు వేరు వేరు మతాలకి చెందామను కోవచ్చు. యూరోపు అంతా క్రైస్తవ మతం వాళ్లే అధికం. ఒక్కమాటలో చెప్పాలంటే "పాశ్చాత్య నాగరికత అభివృద్ధి" అంటే క్రైస్తవుల అభివృద్ధే. ఈ సంగతినే మాల్‌కమ్ మగ్గరిడ్జ్ (ఈయన ఒక సుప్రసిద్ధ పత్రికా రచయిత. 'పంచ్' అనే ఇంగ్లీషు హాస్య పత్రికకి సంపాదకుడుగా ఉండేవాడు. మదరాసు 'మెయిల్' పత్రికకీ పనిచేశాడు. 'న్యూస్టేట్స్ మెన్' వారపత్రికలో ఆయన వ్యాసాలు చాలా వచ్చాయి. ఆయనే అమెరికా జనానికి రాజులు, రాణులుమీద మోజుపోలేదు. అందుచేత అక్కడ రాజు లేదా రాణిని ఎన్నుకుంటే బాగా ఉంటుందని అనేవాడు.) ఇటీవలే సుప్రసిద్ధ రష్యా రచయిత సోల్జినిట్సిన్‌లో బి. బి. సి. రేడియో సంస్థ తరపున చేసిన ఇంటర్వ్యూలో వివరించాడు. యూరోపులో శతాబ్దాలుగా పరస్పర విరోధులుగా ఉంటున్నన్ని జాతులు భారత — ఉపఖండంలో లేవు. అమెరికా సంయుక్త రాష్ట్రాలలో తెల్ల తోలు కలవాళ్లు ఒక జాతి, నల్లతోలు కలవాళ్లు మరొక జాతి. నల్లజాతి మనుష్యుని తెల్లజాతి వాళ్లు బానిసలుగా వాడుకునేవాళ్లు. 1864లో అంతర్యుద్ధం వచ్చి బానిస పద్ధతి పోయినా జాతి వివక్షణ కొనసాగుతూనే వచ్చింది.

భారతదేశంలో మనల్ని విభజించేవి తేడాలు కావు, పోలికలే. హైందవులకీ, సిక్కులకీ పోలికలు చాలా ఎక్కువ. అందుకనే భింద్రన్‌వాలె వంటి వ్యక్తులకి సిక్కులు హైందవులలో కలిసి పోతారన్న భయం పట్టుకుంటుంది. [ఈ భయానికి ఆధారం లేదని మాత్రం అందరికీ తెలుసు.] అదే విధంగా శ్రీలంకలోని తమిళులకీ, సింహళులకీ మధ్య వ్యత్యాసాలకన్నా సామ్యాలే అధికం. భారతదేశంలో ఉండే తమిళులకీ, శ్రీలంకలోని తమిళులకీ మధ్య ఇన్ని పోలికలు ఉండవేమోకూడా. అయితే ఇది చాలా పాత సమస్య. చరిత్ర అంత పాత సమస్య. ఇది పరిష్కారం కావటానికి కాలమే తోడ్పడాలి. ఏమో ఎవరు చెప్పగలరు, కాలమే తేలిపోతుందేమో! ★

ఏ స్టోరీ ఫర్ ఎడల్ట్స్

సుస్మితా రమణ మూర్తి

"అమ్మా! ప్రక్కింటికెళ్ళి కేరంబోర్డు ఆడుకుంటామ," హరి భయం భయంగా తల్లి ముఖంలోకి చూస్తూ అడిగాడు.

"వెధవా! ఎప్పుడూ ఆటలేనా? నీ కంటే తమ్ముడు నయం! బడిలోకింకా వెళ్ళకపోయినా ఎంత బుద్ధిగా అక్షరాలు దిద్దుకుంటున్నాడో చూడు!?..."

గదిలో ఓ మూల పలకమీద రాసిన అక్షరాలను శ్రద్ధగా దిద్దుకుంటున్న చిన్నకొడుకు రాజుని చూపిస్తూ అంది నీరజ.

హరి బిక్కముఖం వేశాడు.

"స్కూల్సుకెలాగూ సెలవులిచ్చేశారు. ప్రయివేటుక్కూడా సెలవులేవా?" గట్టిగా అరుస్తూ అడిగింది నీరజ.

"ఇవాళ ప్రయివేటుకి రావద్దన్నారమ్మా! రేపట్నుంచి రమ్మన్నారు."

"ప్రయివేటులేదని వూరుమీద పడదామను కుంటున్నావా? అదేం కుదరదు. అయిన పాఠాలు మరోసారి చదువుకో."

"అన్నీ వచ్చేసాయమ్మా!"

"పుస్తకం తెరిస్తే అన్నీ వచ్చేసినట్లే వుంటాయ్! పుస్తకం మూసేస్తే మళ్ళీ అన్నీ కొత్తగానే వుంటాయ్! అందుకని పాఠాల వెనుకనున్న ప్రశ్నలన్నింటికీ జవాబులు చూడకుండా రాసి చూపించు. ఆ తర్వాత వెళ్ళి ఆడుకుందువుగాని."

చేసేదేమీలేక, "అలాగేనమ్మా!" అంటూ తన పుస్తకాల బల్లదగ్గరకు వెళ్ళిపోయాడు హరి.

"రాజా! తర్వాత దిద్దుకుందువుగాని ముందీపాలు తాగు!"

"హుఁ! నాకైతే కాఫీకూడా ఇవ్వదు. తమ్ముడికైతే రెండు పూటలా గ్లాసుడేసి పాలు! వాడు చదువుకోకపోయినా ఫర్లేదు. నేను మాత్రం ఎప్పుడూ చదువుకుంటూ వుండాలి. ఎక్కడికీ వెళ్ళకూడదు. ప్రక్కింట్లో కేరం బోర్డు ఆడుకోకూడదు. ఈపాటికి వాళ్ళంతా హాయిగా బోర్డాడుకుంటుంటారు. అలా ఆడుకుంటే వాళ్ళమ్మలు కొప్పడరూ?... అంతా ఈ 'అమ్మ'లా వుంటారేంటి?... ఉండరు!... వాళ్ళమ్మలు ఎంతో మంచోళ్ళు!... ఈ 'అమ్మే' చాలా చెడ్డది. ఆడుకుంటే అలసిపోతానట!... బట్టలు పాడైపోతాయట!... దెబ్బలు తగులుతాయట!... నీరసపడిపోతానట!... ఆటల్లో పడితే చదువు పాడైపోతుందట. మార్కులు తక్కువ వస్తాయిట. పరీక్షలన్నింటిలో మార్కులు నాకు బాగానే వస్తున్నాయే! మరలాంటప్పుడు ప్రతివిషయానికీ ఎందుక్కాదంటుంది!? ... బళ్ళో ఎంతమంది పిల్లలు ఇంటర్వల్లో ఆడుకోటంలేదు? అప్పుడు కూడా నేను ఆడుకోకూడదు. వీధిలో ఎంత మంది నాలాంటి వాళ్ళు ఆడుకోటంలేదు? వాళ్ళంతా బాగావున్నారే!? ... మరి నేనెందుకు వాళ్ళందరిలా ఆడుకోకూడదు? ... అమ్మీ మధ్య నా గురించి అసలు పట్టించుకోడఁవే మానేసింది. ఇదివరకు ఎంతబాగా చూసుకునేది!? రెండు పూటలా ఇప్పుడు తమ్ముడికిస్తున్నట్లు గ్లాసునిండా పాలిచ్చేది. గ్లూకోజు నీళ్ళిచ్చేది. ఇంకా మంచి మంచి పళ్ళిచ్చేది. ఎంతో ముద్దుగా చూసుకునేది. అప్పుడంతా అమ్మకు నా గురించి ధ్యాసే! ప్రయివేటుకి – స్కూలుకి తోడువచ్చేది. ఆడుకున్నా నవ్వుతూ కొప్పడేదేగాని ఇప్పట్లా కొట్టడం, తిట్టడం విసుక్కోడం చేసేదికాదు. అప్పుడెంతో హాయిగా వుండేది. అమ్మ ఎంతో మంచిదని మురిసిపోయేవాణ్ణి! అలాంటి అమ్మిప్పుడెందుకిలా మారిపోయింది? ప్రతిసారీ ఎందుకు కొడుతూంది? 'తమ్ముడికేనా పాలు? మరి నాకో?' – అంటే – "వాడు చిన్నోడురా! వాడిక్కాక నీకా పాలు? ఆకలిగా వుంటే కాసేపుండు అన్నం తిందువుగాని" అంటుంది గాని ఈ మధ్య పాలివ్వడఁవే మానేసింది. నాన్నగారే అప్పుడప్పుడు పాలిస్తారు. అమ్మకి నాన్నంటే భయం! ఎందుకుండదూ భయం? నాన్నకి ఇంతింత మీసాలుంటాయి కదా? అందుకే కాబోలు అమ్మకి భయం! మరి నాన్నంటే నాకు భయం లేదే!? ... భయం వేయదే!? ... ఎంచేతో!? ... ఆఁ! తెల్సింది. నాన్నెప్పుడూ పిల్లలతో నవ్వుతూ మాట్లాడుతారు. మంచి మంచి కథలు చెబుతారు. అమ్మలా విసుక్కోరు. కసురుకోరు. కొట్టనే కొట్టరు. నిజంగా





ఎ స్టోరీ ఫర్ ఎడల్ట్స్

నాన్నగారు చాలా మంచివారు. తనెప్పుడూ ఇంటి దగ్గరే వుండిపోతే ఎంత బావుణ్ణు ? అమ్మచేత తిట్లు — చీవాట్లు — దెబ్బలు తప్పేవి. నాన్న గారింటి దగ్గరుండిపోతే డబ్బులెలా వస్తాయ్?...'' పుస్తకాల ముందు కూర్చున్న హరి ఆలోచనలు అలా సాగిపోతున్నాయ్.

''హరీ ! ఏం చేస్తున్నావ్ ? చూడకుండా జవాబులు రాస్తున్నావా ? అలా బొమ్మలా కూర్చున్నావేం ?'' అటువేపు ఏదో పనిమీద వచ్చిన నీరజ అలా అనేసరికి హరి వులిక్కిపడి—

''ఆఁ, రాస్తున్నానమ్మా ! చూడకుండానే రాస్తున్నాను'' అంటూ సర్దుక్కూర్చున్నాడు బుద్ధిగా. పది నిముషాలు వంచిన తలెత్తకుండా ప్రశ్నలకు జవాబులు చూడకుండా రాసిన హరి పెన్ను ఆగిపోయింది. పెన్నులో సిరా అయిపోయిందేవోనని ఓసారి గట్టిగా దులిపి మళ్ళీ రాయడంలో లీనమైపోయాడు. ఓ నాలుగు వాక్యాలు రాసిం. తర్వాత మళ్ళీ పెన్ను రాయడం మానేసింది. మరోసారి దులిపి రాయడానికి ప్రయత్నించినా లాభం లేకపోయింది. పెన్నులో సిరా పూర్తిగా అయిపోయింది. సిరా పోసుకుందావని బీరువా పైనున్న సిరాబుడ్డిని తీయబోయిన హరి చేతిలోంచి పొరపాటున అది క్రిందపడి ముక్కలు ముక్కలైపోయింది. శబ్దం విన్న నీరజ ప్రక్క గదిలోంచి ఆత్రంగా వచ్చింది.

''ఏవిట్రా! మళ్ళీ ఏవిటి తగలెట్టేశావ్?'' అంటూ.

హరి బిక్కముఖం వేశాడు. భయంతో బిగిసిపోయాడు.

సిరా పడ్డంవల్ల ప్రక్కనున్న బట్టలు — పుస్తకాలు పాడవడం చూసిన నీరజ, ''వెధవా ! నీకెన్నిసార్లు చెప్పాల్రా ? నీకేదైనా కావాల్సొస్తే నన్నడగమని ? ఇప్పుడు నీకా ఇంకుబుడ్డి అవసరం యేవొచ్చింది ?'' అంటూ రెండు చెంపల్నీ ఎడాపెడా వాయించేసింది.

హరి చెంపలమీద నీరజ చేతివ్రేళ్ళు అచ్చు గుద్దినట్లు కన్పిస్తున్నాయ్. రెండు చెంపలూ బాగా కందిపోయి ఎర్రబారాయ్.

'కొట్టకమ్మా ! ఇంకెప్పుడూ తీయనమ్మా!' అంటూ వెక్కిళ్ళు పడసాగేడు హరి.

''అసలిప్పుడీ ఇంకుబుడ్డి అవసరమేవొచ్చింది నీకు ?'' కళ్ళెర్రజేస్తూ అడిగింది నీరజ.

''మరేవో పెన్నులో ఇంకయిపోయింది. అందుకని...'' ఏడుస్తూ మధ్య మధ్య విషయాన్ని చెప్పాడు తను.

''వెధవా ! ఇంకు పోతేపోయింది. పుస్తకాలు చీరలు పాడయ్యాయ్. ఈసారి మళ్ళీ ఎప్పుడైనా ఇంకుబుడ్డి జోలికి వెళ్ళావో జాగ్రత్త ! నీపు విమానంమోత మ్రోగించేస్తాను.'' అంటూ బట్టల్ని నీట్లో ముంచటానికి అక్కడ్నుంచి వెళ్ళిపోయింది తను.

మంటపెడుతున్న చెంపల్ని తడుముకుంటూ కుమిలి కుమిలి యేడ్వసాగేడు హరి — ''ఈ అమ్మెప్పుడూ ఇంతే ! ఎప్పుడూ ఇలాగే కొడుతుంది. ఈ అమ్మ చాలా చెడ్డది !'' అనుకుంటూ. అమ్మ చాలా చెడ్డది! అమ్మ చాలా చెడ్డది !!... హరి ఆలోచనలనిండా అమ్మ నిండిపోయింది. ఈమధ్య ప్రతీ చిన్న విషయం గురించి విసుక్కుంటోంది అమ్మ ! ఎక్కువసేపు పడుకోకూడదు. ఆడుకోకూడదు. అందరు పిల్లలతో స్నేహం చేయకూడదు. 'ఐస్‌ఫ్రూట్లు— జీళ్ళు కొనుక్కోకూడదు. ఇంటర్‌వల్‌లో అంతా ఎన్నో కొనుక్కుని తింటుంటారు. వాళ్ళు తింటూ వుంటే తినాలనుంటుంది. డబ్బులుండవు. అమ్మనడిగితే, 'వెధవా ! కావాల్సిందేదో ఇంట్లో తినుగానీ— చిరుతిళ్ళు ఆరోగ్యానికి మంచివి కాదంటుంది. మరి వాళ్ళంతా తింటున్నారే !?... వారి ఆరోగ్యం పాడవటం లేదే !? అవేవీకాదు. అమ్మకి నేనంటే ఇష్టంలేకే అలా అంటూంది. తమ్ముడంటేనే అమ్మకి ప్రేమ ! నామీదసలు ప్రేమ లేనేలేదు. అమ్మ ఎక్కడికి వెళ్ళినా తముణ్ణే తీసుకువెళ్తుంది నన్నసలు తీసుకెళ్ళడమే మానేసింది. సినిమాక్కూడా ఎప్పుడోగాని తీసుకువెళ్ళదు. అదైనా నాన్నగారుంటారు కాబట్టి తీసుకెళ్తుంది. తను వెళ్ళినప్పుడల్లా తమ్ముణ్ణి తీసుకెళ్తుంది. 'తమ్ముడికి టిక్కెట్టు అడగరు. నీకైతే అడుగుతార్రా !' అంటుంది. 'ఒకోసారి ఆ సినిమాలు నీలాంటి చిన్నోళ్ళు చూడకూడదురా !' అంటుంది. మరి తమ్ముడు నాకంటే చిన్నోడు కాదా !?... నేమా వస్తానని గొడవచేస్తే చెంపలు వాయించేస్తుంది. బుర్ర వుండు పడేలా మొట్టికాయలు మొడుతుంది. ఎంచేతనో అమ్మకి రోజు రోజుకీ నామీద ప్రేమ లేకుండా పోతోంది.

నాన్నగారితోనైనా చెప్పుకుందావంటే నిద్రపోయింతర్వాతెప్పుడో వొస్తారు. ఎప్పుడు చూచినా ఓవర్‌టైము అంటారు. ఇదివరలో ఎన్నిసార్లు— 'నాన్నా ! అమ్మ కొట్టింది' అని నే చెప్పుకోలేదు ? నాన్నగారు మాత్రం ఏంచేస్తారు? ఓసారి గట్టిగా కేకలేస్తారు. ఓ రెండ్రోజుల్దాకా అమ్మయేవీ అనదు. ఆ తర్వాత మళ్లీ మామూలే! ఈ మధ్య రాజమండ్రి పెదనాన్న రావడమే మానేశారు. తనొచ్చినా బావుణ్ణు ! తనొస్తే ఎంచక్కా ఓ నెల్రోజుల్దాకా వుంటారు. ఆ నెల్రోజులూ ఎంతో హాయిగా వుంటుంది. నన్నెంతో ప్రేమగాచూసుకుంటారు. చాక్‌లెట్లు— ఐస్‌ఫ్రూట్లు — స్వీట్లు కొనిపెడతారు. సినిమాలకి—బీచ్‌కి తీసుకెళతారు. అర్థంకాని పాఠాల్ని— లెక్కల్ని చెబుతారు. ఈ అమ్మ నాన్నలకంటే తనకి నేనెంతో ఇష్టం ! అమ్మకి నా మీద ఇష్టంలేనప్పుడు పెదనాన్నతో నన్నెందుకు పంపించదో !?... పాపం పెదనాన్నకి పిల్లలు లేరట ! నన్నెన్నోసార్లు పెంచుకుంటానని అడిగారు. నాన్న ఎటూ తేల్చకుండా నవ్వుతుంటే అమ్మ మాత్రం ''మాకు మాత్రం ఎందరున్నారండీ ? ఇద్దరేకదా ? ఊహ తెల్సిన పదేళ్ళ కుర్రాడు మీ దగ్గరేం వుంటాడండీ ?'' అంటుంది.

అమ్మ కాదన్నా — నాన్న యేవీ అనకపోయినా ఇంకా అప్పుడప్పుడు నా గురించి అడుగుతూనే వున్నారు పెదనాన్న. పెదనాన్న ఇల్లు ఎంతో బావుంటుంది. అక్కడైతే కేరంబోర్డు

వుంది. ఎంచక్కా ఆడుకోవచ్చు. ఎక్కడికీ వెళ్ళనవసరంలేదు. ఇంట్లోనే చక్కగా కావాల్సినంతసేపు ఆడుకోవచ్చు. పెదనాన్నతో ఆడుకోడానికి చుట్టుపక్కల పిల్లలంతా వస్తారు. అక్కడెంతో హాయిగా వుంటుంది. సందడిగా వుంటుంది. పెద్దమ్మకూడా ఎంతో మంచిది. కిందటేడు వాళ్ళింటికి వెళ్ళినప్పుడు నన్ను చూసి ఎంతో పొంగిపోయింది. ఎంతో ముద్దుగా చూసుకుంది. పొద్దున్న — సాయంత్రం హార్లిక్సు కలిపిన పాలిచ్చేది. యాపిల్ పళ్ళిచ్చేది. ఇంకా యేవేవో తినమనేది. ఈ అమ్మ అడిగినా ఏవీ పెట్టదు. ఆ అమ్మ అడక్కుండానే అన్నీ పెడుతుంది. ఈసారి పెదనాన్న వస్తే తనతో వెళ్ళిపోతానని చెప్పేసెయ్యాలి. తను ఎప్పుడొస్తాడో?... పోనీ నేనే పెదనాన్నింటికి వెళ్ళిపోతే.. అమ్మో! ఒక్కణ్ణి వెళ్ళగలనా? ఎందుకెళ్ళలేను? ... బస్సుస్టాండుకి వెళ్తే బస్సొస్తుంది. ఇక్కడ బస్సెక్కి అక్కడ దిగిపోవచ్చు. అక్కడికెళ్ళి అమ్మ గురించి పెద్దమ్మతో చెబితే — ఇక్కడికి పంపించకుండా అక్కడే వుంచేసుకుంటుంది నన్ను. మరి బస్సు టిక్కెట్టుకి డబ్బులో? అల్మారాలో ఎప్పుడూ డబ్బులుంటాయికదా ? ... అందులోంచి తీసుకుంటే సరి !

... ...

... ...

... ...

ఆ చిన్నారి బుర్రలో అలా ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయ్. తప్పకుండా తను పెదనాన్న దగ్గరకు వెళ్ళిపోవాలన్న నిర్ణయం క్షణక్షణానికి ధృవపడుతోంది తన మస్తిష్కంలో.


* * *


"హరీ! రేయ్ హరీ!" మొదట నెమ్మదిగా— తర్వాత కాస్త గట్టిగా పిల్చినా హరికి తండ్రి పిలుపు విన్పించలేదు.

కారణం — ఏదో రాస్తూ రాస్తూ టేబులు మీద బుర్రపెట్టి నిద్రలోకి జారిపోయాడు హరి.

'వీడికీ మధ్య చదువుమీద శ్రద్ధ బాగా పెరిగింది. మంచి మార్కులు తెచ్చుకుంటున్నాడు. తనుకూడా కాస్త కోచింగిస్తే ఇంకా మంచి మార్కులు వచ్చేవి !...ఇంతకీ రాస్తున్నది నోట్సా ? లేక లెక్కలు చేస్తున్నాడా ? ... చదువుకుంటూ నిద్రపోయినట్లున్నాడే ? ...' స్వగతంలా అనుకుంటూ ఆ పుస్తకాన్ని అందుకుని చూడసాగేడు హరి తండ్రి రంగనాథం. అది హరి రోజూ రాసుకునే డైరీ ! రంగనాథంకున్న మంచి అలవాట్లలో 'డైరీ' రాయడం ఒకటి. ఆ మంచి అలవాటు హరికి కూడా అలవడేట్లు చేశాడు తను.

"అమ్మకి నేనంటే అసహ్యం ! ఎప్పుడూ కొడ్తుంది. తిడుతుంది. నాన్నగారుంటే మాత్రం కొట్టదు. నాన్నగారెప్పుడో తప్ప ఇంటి దగ్గర వుండరు ...





తమ్ముణ్ణే బాగా చూస్తోంది. వాడేం జేసినా పట్టించుకోదు. నేనేం జేసినా కొడ్తోంది. అమ్మని చూస్తుంటేనే భయంగా వుంటోంది.

పక్కింటి పిల్లలతో ఆడుకుంటే కోప్పడు తుంది. పెన్సిలు పారేసుకున్నా— పెన్ను పాలీ పొరపాటున క్రిందపడి పాడైపోయినా గట్టిగా బాదేస్తుంది. ఈ అమ్మకి తనమీద అసలు ప్రేమ వుంటేకదా ? నన్ను బాగా చూడ్డానికి ?

అమ్మకి నిజంగా తనమీద ప్రేమ లేనేలేదు. తమ్ముడంటేనే ప్రేమ. పాలు— పళ్ళూ ఎప్పుడూ వాడికే ఇస్తుంది. సినిమాలకి వాణ్ణే తీసు కెళ్తుంది. మంచి మంచి బట్టలు వాడికే కొని పెడ్తోంది. ఇదివర్లో నన్ను కూడా బాగా చూసేది. ఈ మధ్య నేనంటే అమ్మకి గిట్టడం లేదు... ...

అమ్మకి నేనంటే నిజంగా పగే! ఎందుకో అర్థం కావటంలేదు. ప్రతి చిన్న పనికీ కొట్టే స్తోంది. ఇంకుబుడ్డి చేయి జారిందని గట్టిగా కొట్టేసింది..నాన్నతో చెబుదాఁవన్నా తనేరాత్రికో గాని రారు...

పెదనాన్నకి, పెద్దమ్మకి నేనంటే ఎంతో ముద్దు, ప్రేమ. పాపం వాళ్ళకి పిల్లలు లేరట. నన్ను పెంచుకుంటానని ఎన్నోసార్లు అడిగారు. అమ్మ కిష్టంలేదు. ఎందుకిష్టం వుంటుంది? నే వెళ్ళిపోతే తిట్టడానికి— కొట్టడానికి ఎవరూ వుండరు కదా ?... అందుకనే నన్ను పంపటం లేదు .. ...'

అమ్మ తిట్లు— దెబ్బలు తప్పించుకోవా లంటే వెంటనే పెదనాన్న దగ్గరకు వెళ్ళిపోవాలి. రేపు మధ్యాన్నం అమ్మ సినిమాకు వెళ్తుందట. అప్పుడు అల్మారాలోని డబ్బులు తీసుకుని బస్సెకి— రాజమండ్రి వెళ్ళిపోతాను. అప్పుడీ అమ్మగొడవ వుండదు... ''

డైరీలో ఏ పేజీ చూసినా అమ్మకి తనంటే ఇష్టం లేదన్న విషయం— తను పెదనాన్న దగ్గరకు వెళ్ళిపోవాలన్న విషయం హరి మనస్సులో గాఢంగా ముద్రపడిన సంగతి గమనించిన రంగనాథం కొన్ని నిముషాలు కలవరం చెందాడు.

ఎ స్టోరీ ఫర్ ఎడల్ట్స

బాధ పడ్డాడు.

అనుకోకుండా వీడి డైరీ చూడబట్టి విషయం తెల్సిందిగాని — లేకుంటే అనుకున్నట్టు వీడు చేసేవాడే !!......

అదృష్టం బాగాలేకుంటే — ఎదురుచూడని దేఁవైనా జరిగితేనో ! ?... ఇదంతా నీరజవల్లే జరిగింది. — అనుకుంటూ రంగనాథం బాధతో విలవిల్లాడిపోయాడు. వెంటనే విసురుగా నీరజ దగ్గరకు వెళ్ళాడు తను.

నీరజ ఏదో వారపత్రిక తిరగవేస్తోంది.

''నీరజా ! మన పెద్దాడి ప్రవర్తన ఈమధ్య ఎలా వుందంటావ్ ? బుద్ధిగా వుంటున్నాడా ?'' తను చెప్పబోయేదానికి వుపోద్ఘాతంగా అడిగాడు.

''ఎలా వుంటుందని అడుగుతున్నారా ? రాను రాను మరీ రణపెంకి అయిపోతున్నాడు. చిన్నాడికి పాలిస్తే — వాడూ కావాలంటున్నాడు. గొడవ గొడవ చేస్తున్నాడు. ప్రతి విషయంలోనూ చిన్నాడితో పోల్చి చూసుకుంటున్నాడు. కోపం వచ్చి కొడితే ఏడుస్తాడుగాని మన పరిస్థితి అర్థం చేసుకోడు. ఇదివర్లో పెద్దాణ్ణే మాత్రం మనం ముద్దుగా చూసుకోలేదటండీ ? ఇప్పుడు కూడా వాడికి — పాలు — పళ్ళు వగైరాలన్నీ చిన్నాడితోబాటే ఇవ్వాలంటే మీకొస్తున్న జీతం ఎలా సరిపోతుందండీ ? మరీ ఇలా ప్రతిదానికీ మొండికేస్తుంటే ఎలా చెప్పండి ?''

''ఒక విధంగా అందుకు బాధ్యులం మనఁవే అనుకుంటాను. ఒక్కొక్కప్పుడు వాళ్ళు అలా తయారవడానికి కారణం మన ప్రవర్తనే అవొచ్చు. పిల్లల్ని మంచి పద్ధతిలో వుంచేందుకు మనం అవలంబించే పద్ధతుల్లోనే అప్పుడప్పుడు లోపాలు వుండొచ్చు. ప్రశాంతఁవైన వాతావర ణంలో అనురాగం ఆత్మీయతల మధ్య పెరిగే పిల్లలు భవిష్యత్తులో మంచి పౌరులుగా అవడానికి ఎంతో అవకాశఁవుంది.''

భర్త చెబుతున్నదేఁవిటో అర్థంగాక తెల్లముఖంవేస్తూ రెప్పలార్పకుండా తన ముఖం లోకి తదేకంగా చూడసాగిందామె.

''మన దృష్టిలో ఒకడు పెద్ద— మరొకడు చిన్న అయినప్పటికీ నిజానికి ఇద్దరూ చిన్నవాళ్ళే కదా ? మనం ఏంజేసినా వారి బాగుకోసఁవే అయినా — మనం చేస్తున్నదేఁవిటో ? తద్వారా ఆ పసిహృదయాలెలా పీలవుతున్నాయో ?— అన్న విషయం గ్రహించాల్సిన అవసరం బాధ్యత మనమీదుంది. ఇకమీదట్నుంచి బట్టల విషయంలో గాని — తిండి విషయంలోగాని... ఒక్కటేఁవిటి అన్ని విషయాల్లోనూ ఇద్దరినీ ఒకేలా చూడ్డం ఎంతో అవసరం. చాలా మంచిదికూడా. పదిసార్లు పిల్లల్ని కోపగించుకుని — కొట్టి — తిట్టి మన మార్గంలోకి మళ్ళించుకోడంకంటే — ఒక్క ఆప్యాయతతోకూడిన పిలుపుతో వాళ్ళను మనవేపు మరల్చుకోగలగడం చాలా గొప్ప విషయం !''

నీరజ ఏదో చెప్పబోయింది.

అందుకు అవకాశఁవీయకుండా రంగనాథం మళ్ళీ చెప్పసాగేడు.

''పిల్లల మనస్సు గాయపడకుండా మంచి మాటలతో, ప్రేమతో మనకు కావల్సిన విధంగా తీర్చిదిద్దుకోడం అంత కష్టఁవేఁవీ కాదు. ఇద్దరూ చిన్నవాళ్ళే ! ఇద్దరినీ ఒకేలా చూడ్డం చాలా అవసరం. ఈ పసివయస్సులో వారి మనస్సులు గాయపడ్డం అంత మంచిదికాదు. ఆర్థిక ఇబ్బందులు గురించి నీ వాట్టే పట్టించు కోకు. అవన్నీ నే చూసుకుంటాను. ఇక మీద ట్నుంచైనా మన పద్ధతుల్ని మార్చుకోడం చాలా అవసరం. నే చెప్పిందేఁవిటో — చెప్పదలచుకుం దేఁవిటో... ఈ డైరీ చూస్తే పూర్తిగా నీకే అర్థం అవుతుంది.'' అంటూ హరి డైరీ నీరజకు అందించాడు తను.

డైరీలోని విషయాలద్వారా హరి పరిస్థితిని బాధని పూర్తిగా అర్థం చేసుకున్న నీరజ కొన్ని క్షణాలు తెల్లబోయింది. భర్త చెప్పిన మాట ల్లోని నిజాన్ని — అంతరార్థాన్ని అద్దంలాంటి హరి పసిహృదయాన్ని డైరీద్వారా పూర్తిగా తెల్సుకోగలిగింది, చూడగలిగింది. ★



డాక్టర్ సలహాలు

డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

ఎ. బి. - రాజమండ్రి

నా వయస్సు 19 సంవత్సరములు. నాకు రెండు సంవత్సరములుగా విపరీతంగా తలనెప్పి వస్తున్నది. డాక్టరుకి చూపించి కళ్ళజోడు వేయించుకున్నాను. అయినా తలనెప్పి ఏమాత్రం తగ్గలేదు. దీనికి ఏమి చెయ్యాలి ?

★ తలనెప్పి తరచూ వస్తూ ఉన్నవారు ఇ. ఎన్. టి. వైద్యులవద్ద, న్యూరాలజిస్టుల వద్ద కూడా పరీక్ష చేయించుకోవలసి ఉంటుంది.

చాలామటుకు తలనెప్పి రావటం అనేది పరిస్థితుల ప్రభావంమీద ఆధారపడి ఉంటుంది కాబట్టి ఆ కారణాలను పోగొట్టటానికి తగిన చర్యలు తీసుకోవటం అవసరం. స్థలమార్పు, మొదలయిన వాటివల్ల ఫలితం ఉంటుంది.

యస్. వి. ఎమ్. – గుంటూరు

మా బాబుకి రెండవ సంవత్సరమువచ్చినది. ఇప్పుడే నడుస్తున్నాడు. కాని నడిచేటప్పుడు కాళ్ళు కొంచము వంకరగా కనిపిస్తున్నాయి. ఈ లేత వయస్సులోనే అవి సరిగ్గా రావటానికి వీలున్నదా?

★ ఆర్థోపేడిక్ వైద్యుల వద్ద బాబుని చూపించి, వారు ఎముకలు వంకరగా ఉన్నాయని నిర్ధారణ చేస్తే వారి సలహామేరకు ప్రత్యేకమైన బూట్లు వాడటం మంచిది.

వి. టి. ఎస్. – కర్నూలు

నా వయస్సు 20 సంవత్సరములు. నాకు 4 సంవత్సరముల నుండి కళ్ళ నుండి నీళ్లు కారుతున్నవి. రెండుమార్లు కళ్ల అద్దములు మార్చినాను. కాని ప్రయోజనం కనిపించలేదు. దీనికి కారణము ఏమిటి ?

★ డాక్రోసిస్టైటిస్ అనే రోగం వల్ల ఇలా నీరు కారే అవకాశం ఉంటుంది. దీనికిగాను నేత్రవైద్యుల వద్ద పరీక్ష చేయించుకోవలసి ఉంటుంది. రోగ నిర్ధారణ జరిగిన తర్వాత చికిత్స విధానం తీర్మానించ వలసి ఉంటుంది.

కె. యస్. – వమిడి

నా వయస్సు 20 సంవత్సరములు. నాకు 1½ సంవత్సరముల నుండి వీపు పైభాగమున మెడ దగ్గరగా కంతి మాదిరిగా అయినది. ఇది కొద్దిగా లావు అయినట్లు వున్నది. ఇది ఇంకా పెద్దదవుతుందేమోనని భయముగా వున్నది. దీనికి ప్రారంభములోనే ఆపరేషన్ చేయించుకుంటే మంచిదా ?

★ ఆపరేషన్ చేయగలిగిందీ లేనిదీ ఆ కంతిని పరీక్షచేసి రోగ నిర్ధారణమీద ఆధారపడి ఉంటుంది. లైపోమా, సెబేషియస్‌సిస్ట్ మొదలయిన వాటిని తేలికగా శస్త్రచికిత్స మూలంగా తీసివేయవచ్చును.

ఆర్. ఆర్. – వూడి

తొడల సందుల్లో పొలుసుల క్రిందకట్టి దురదపుట్టి, గోకినచో ఎర్రగా పుండువలె మారి చాలా బాధ కలుగుచున్నది. దీనికి ఏమి చెయ్యాలి ?

★ టీనియా క్రూరిస్ అనే ఈ రోగం ఫంగస్‌వల్ల వస్తుంది. దీనికి ఫల్విన్—ఎం. అనే మాత్రలను పూటకి రెండు వంతున, రోజుకి మూడు పూటలు వరుసగా 20 రోజులపాటు వాడవలసి ఉంటుంది. పైపూతగా మిల్లీకార్టెన్ వయోఫాం ఆయింట్‌మెంట్ వాడవలసి ఉంటుంది. స్నానం చేయటానికి సబ్బు బదులుగా పెసరపిండిగాని సీకాయగాని వాడటం మంచిది.

కె. వి. ఎల్. - మార్టేరు

నా వయస్సు 15 సంవత్సరములు. నాకు 11వ సంవత్సరము నుండి గొంతు బొంగురుగా వచ్చినది. ఇది మందులవల్ల తగ్గుతుందా ?


★ మీరు ముందు ఇ. ఎన్. టి. వైద్యుల దగ్గర పరీక్ష చేయించుకోవలసి ఉంటుంది. గొంతులోని "ఓకల్ కార్డ్స" అనే వాటిలో ఏర్పడగల మార్పువల్ల గొంతు బొంగురు పోతుంది. మందులవల్ల తగ్గేదీ లేనిదీ ఆ మార్పు తాత్కాలికమా, నిరంతరమా అనే దానిపైన ఆధారపడి ఉంటుంది.


ఆ ఓకల్ కార్డ్సలలో కురుపు లాంటివి ఉన్నప్పుడు శస్త్ర చికిత్స ద్వారా తీసివేయవచ్చును.

కె. ఎస్. ఎమ్. - మాజవీడు

నా ఫ్రండు రోజుకి కనీసం 15 వక్కపొడి పొట్లాలు నములుతాడు. వాడు కాస్త కారం తినే సరికి చాలా బాధపడిపోతాడు. కళ్ళనుండి, ముక్కు నుండి నీళ్ళు వస్తాయి. నోరంతా చెక్కుకుపోయి వున్నది. కాని అలవాటు మానలేకపోతున్నాడు. దీనికి ఏమి చెయ్యాలి ?

★ ఇలా అలవాటు మానలేనివారిని సైకియాట్రిస్టులకి చూపించవలసి ఉంటుంది. వారి సలహామేరకు ఈ అలవాటు మార్చవచ్చును. ★





సీరియల్



జీవన మురళి

కొండముది శ్రీరామచంద్రమూర్తి

మళ్ళీ నా రొటీన్‌వర్క్ నాది. ఫస్టు పీరియడ్ అయింది. పిల్లలు కాస్త గాలి పీల్చుకుని మళ్ళీ సర్దుకుని కూచున్నారు. మాష్టర్లు గదులు మారారు. సెకండ్ పీరియడ్ పాఠాలు మొదలైనాయి.

నేనేదో తలవంచుకుని డెస్క్‌వర్క్ చేసుకుంటున్నాను. బిలబిలమంటూ అయిదారుగురు నా గదిలోకి సందడి చేసుకుంటూ వచ్చారు. అందరూ ఒకే రకంగా డ్రెస్ చేసుకున్నారు. కొందరు సిగరెట్లూ, మరికొందరు సిగార్లూ, ఒకతను పైపూ కాలుస్తూ గుప్పుగుప్పున పొగ వదుల్తున్నారు. పైపు కాలుస్తున్న అతని చేతిలో హంటరుంది.

నిజం చెప్పొద్దూ నాకు వాళ్ళ వేషాల్నీ, ఆ పొగ తాగడాన్నీ చూస్తే చిరాకు వేసేసింది.

''ముందు ఆ సిగరెట్లూ, సిగార్లూ, పైపూ తీసేయండి నోట్లోనుంచి'' అన్నాను విసుగ్గా.

వాళ్ళు నా మాటల్ని ఖాతరు చెయ్యలేదు. ఆ పైపు కాలుస్తున్న తనన్నాడు.

''మీరేనా హెడ్మాష్టరు ?''

''కాబట్టే చెబుతున్నాను ఇక్కడ పొగ తాగడం నిషిద్ధమని !''

''ఎందుకనీ ?''

(గత సంచిక తరువాయి)

''మనం చేసే పనుల్ని చూసి పిల్లలు మన్ని ఇమిటేట్ చేస్తారు. నా స్టూడెంట్స్ చెడు అలవాట్లు నేర్చుకోడం నేను సహించలేను.''

''ఓ. కే. అంత మంచి పిల్లలా వీళ్ళు !'' అతను ఎగతాళిగా అన్నాడు.

''అయితే పదండి చూద్దాం, వాళ్ళ మంచితనం ఎంతో, ఆ మంచితనానికి తగిన తెలివితేటలెన్నో ?''

''వాళ్ళను చెక్ చేయడానికి ముందు మీరెవరో చెప్పండి !''

''ఐయామ్ జమీందార్ ఇంద్రసేన్ ! ఈ స్కూలును మా డాడీ కట్టించారు. ఐయామ్ నౌ ది ప్రెసిడెంట్ ఆఫ్ ది మేనేజిమెంట్ ఆఫ్ దిస్ స్కూల్ !''

''అట్లాగా, నాకు తెలీదు సుమాండీ ! కూచోండి, కూచోండి. ముందుగా మీరొస్తున్నట్టు కబురుచేసి వుంటే బావుండేది కదా ?'' అన్నాను ఎంతో నొచ్చుకుంటూ.

గుప్పున రింగు రింగులుగా పొగ వదిలాడు. విలాసంగా నవ్వాడు.

''ఏ పనీ ముందుగా అనుకుని చేయడం మా కలవాటు లేదు. స్పాంటేనియస్‌గా రియాక్ట్ అవుతాం !''

గదంతా వాళ్ళు తాగుతున్న పొగ వెగటు వాసనతో వ్యాపిస్తోంది. నా వెనకాల గోడమీద ఎత్తుగా జాతిపిత గాంధీజీ బ్లాక్ అండ్ వైట్ ఫొటో వుంది. ఆ ఫొటో మీదకు పాకుతోంది ఆ పొగ. జాతిపితకు అటూ యిటూ జీసస్, బుద్ధుడూ, శంకరాచార్య, మక్కాలోని పవిత్రమైన మసీదూనూ ! ఆ పొగ వాళ్ళను కూడా కమ్ముకోడానికి ప్రయత్నం చేస్తోంది. ఇంత వరకూ ఇటువంటి అపవిత్రత నా స్కూల్లో జరగలేదు.

''ఆ పొగ తాగడం ఆపండంటే ఆపరేం?'' కసిరినట్టుగా అరిచాను.

సిగరెట్లు కిందపడిపోయాయి. చుట్టలారిపోయాయి. పైపు మాత్రం వెలుగుతోంది. నేను లేచి ఇంద్రసేన్ దగ్గరకు నడిచి మెల్లగా అతని నోట్లోంచి ఆ పైపును తీసేసి, ''ముత్యాలూ దీన్ని అవతల పెట్టు'' అన్నాను అతని చేతికిస్తూ.

నా హఠాత్ చర్యకు వాళ్ళు తెల్లబోయారనుకుంటాను. జాగృదావస్థలోకి వచ్చేసరికి కాగల కార్యం ఆవనే అయింది. ఇంద్రసేన్ తల పంకించి, ''ఓ. కే! క్లాసులోకి పోదాం పదండి !'' అన్నాడు ఏదో నిర్ణయానికి వచ్చినట్లు.

''ఈ పీరియడ్ కానీండి మధ్యలో డిస్టర్బ్ చేయడం బావుండదు వాళ్ళను. ఆ తర్వాత లాంగ్ బెల్ కొట్టిస్తాను. అసెంబ్లీ పెట్టిస్తాను. మీకో రిసెప్షన్ ఏర్పాటు చేయిస్తాను. అందరికీ మీరెవరో తెలుస్తుంది. ఆ తర్వాత రేపో, ఎల్లుండో, మీ ఇష్టం ఎప్పుడైతే అప్పుడు రండి, అది గౌరవంగా వుంటుంది !'' అన్నాను.

''చెకింగ్‌ను పోస్టుపోన్ చెయ్యడం నా కిష్టంలేదు. ఇపుడే చేస్తాను !'' అన్నాడు మొరటుగా.

''ఎందుకిష్టం లేదూ ?''

''పోస్ట్‌పోన్‌మెంట్ కావాలంటే ఎక్కడో లొసుగులున్నాయన్నమాట ! వాటిని కనుక్కోడమే నా లక్ష్యం !''

నాకు అతని మాటలు విపరీతమైన కోపం

జరిగిన కథ — 4 : మురళీకృష్ణ, ఇంద్రసేన్, పాటల మాలచ్చి ఒకే రైల్లో ప్రయాణం చేసి దిగవలసిన స్టేషన్లో దిగుతారు. ఆ స్టేషన్‌లో తప్పించుకొని పారిపోయిన తన కూతురుని వెతుకుతూ ఒక పిల్ల తండ్రి, అతని అల్లుడు మురళీకృష్ణకు తటస్థపడతారు. తన తండ్రిని, బామ్మను తలచుకుంటూ ఆనందపురం పోవడానికై స్టేషన్ బయటికి వస్తాడు మురళీకృష్ణ. ఆనందపురం వెళ్లే దారిలో దొంగతనంగా ఒక లారీలో ఎక్కుతాడు మురళీకృష్ణ. అదే లారీలో దొంగతనంగా ప్రయాణం చేస్తున్న పెళ్లి కూతురు వేషంలో ఉన్న జీవనను చూస్తాడు. చంద్రన్నగర్‌కు పొలిమేరల్లో ఆగిన లారీనుంచి బయటపడ్తారు మురళీ, జీవన. జీవన, మురళీకృష్ణ జీవన మేనమామ ఇల్లు చేరుకుంటారు. అక్కడ జీవనకు సరైన రక్షణ లభించదని తెలుసుకున్న మురళీకృష్ణ ఆమెను తన ఇంటికే తీసుకెళతాడు. జీవన మురళీకృష్ణ తండ్రి, బామ్మల ఆదరాభిమానాలను పొందుతుంది. జీవనను తీసుకొని బట్టలకొట్టు కెళతాడు మురళీకృష్ణ. అక్కడ ఆమె ఇంద్రసేన్ బహూకరించిన ఖరీదయిన చీరని తిరస్కరిస్తుంది. పురాతన శిథిలాలు చూసి ఇల్లు చేరుతారు. ఇంద్రసేన్ పరమేశ్వరంగారిని సర్వీసునుంచి సస్పెండు చేస్తాడు. ఆయన స్కూలులో జరిగిన విషయాలనీ కుటుంబ సభ్యులతో చెపుతారు.

తెప్పించాయి. అయినా నిగ్రహించుకున్నాను. "బొక్కలుంటే తప్పకుండా కనుక్కోండి, చెప్పండి, దిద్దుకుంటాను. బట్ మై ఎడ్మినిస్ట్రేషన్ ఈజ్ ఫాల్ట్‌లెస్!"

"అట్లా అనుకొనేవాళ్ళు అహంభావులు!" అతను నోరు జారాడు.

"ఏమండీ! మీరు ఫలానా అని అధికార పూర్వకంగా ఇంతవరకూ నాకు తెలీదు. ఇది నా గది. ఇది నా స్కూలు. ఈ గదిలో, ఈ స్కూల్లో నా ఇష్టమే, నా అధికారమే చెల్లాలి, చెల్లుతుంది. అట్లా వుంటేనే నా పదవికీ నాకూ గౌరవం. ఇవ్వాళ మీరు వచ్చి ఈ విధంగా నా పదవినీ, నన్నూ తృణీకరించడం నేను సహించను గాక సహించను" అన్నాను.

"ఐ డోన్ట్ కేర్!" అన్నాడు ఇంద్రసేన్.

"ఉయ్ టూ డోన్ట్ కేర్" అన్నారు అతనితో వచ్చినవాళ్ళు.

వాళ్ళలో ఒకడు మరో మెట్టు పైకి వెళ్ళాడు. అతగాడి నోట్లోంచి గుప్పున ఏదో గబులు వాసన కొట్టింది. "బతకలేని బడి పంతులు పదవి కూడా ఓ పదవేటయ్యా? నువ్వేం గవర్నరువా, ఛీఫ్ మినిస్టరువా?"

"అంతకన్నా ఎక్కువేనయ్యా — ఆ గవర్నర్లూ, ఛీఫ్ మినిష్టర్లూ మా బడిపంతుళ్ళ నాలుగక్షరాలు దిద్దబెడితేనే ఇంత వాళ్ళయ్యారయ్యా! మేం ఉన్నప్పుడు కాదు, ఈ పాఠశాలలు పనిచేస్తున్నప్పుడు కాదు, మేం లేనప్పుడు, ఈ పాఠశాలలు మూతపడినప్పుడు వాటి గొప్పదనం, మా అవుసరం మీకు అర్థమౌతుంది!"

"టైం వేస్టవుతోంది గురూ!" అన్నాడు మరొకడు. "చెకింగ్ పూర్తిచేసుకుంటే హంటింగ్ కెళ్దాం ... ఇక్కడ ఈ న్యూసెన్సేవిటి?"

"షటప్!" ఇంద్రసేన్ గద్దించాడు. వాడు నోరుమూసుకున్నాడు.

"ఇన్‌స్పెక్షన్ చేస్తాను, పదండి హెచ్. యం. గారూ!"

"అది పద్ధతి కాదంటున్నాను, అవునంటున్నారు తమరు. ముందు మీరు పదండి. తర్వాత కాయితాలూ అవీ సర్దేసి నేను మిమ్మల్ని కలుసుకుంటాను!"

వాళ్ళు ఓ క్లాసులోకి వెళ్ళారట. లోపలకు వెళ్ళబోతుంటే అక్కడున్న టీచరు వాళ్ళను లోపలకు రానీయలేదట. స్టూడెంట్సెవరూ లేచి నిలబడలేదట. నేను వెళ్ళి వాళ్ళను కలుసుకునే సరికి అగ్గిమీద గుగ్గిలంలా వాళ్ళు మండిపడిపోతున్నారు. సరే, నన్ను చూసేసరికి టీచరు రండి రండన్నాడు. విద్యార్థులు లేచి నిలబడి ముక్తకంఠంతో 'నమస్కారం సార్' అన్నారు. నేను ఫలానా అని ఇంద్రసేన్‌ని పరిచయం చేశాను. వెనకనుంచి ఓ కుర్రవాడు "మాకేం తెలుసు మాష్టారూ, ఎవరో పిట్టలదొర అనుకున్నాం" అన్నాడు. క్లాసంతా ఘొల్లుమంది. ఇంద్రసేన్ మొహం నల్లగా మాడిపోయింది. ఆ తర్వాత బలవంతంమీద మర్యాదల తతంగం ముగిసింది. 'అడగండి ఏం అడుగుతారో' అన్నట్టుగా మేమందరం ఓ ప్రక్కన నిలబడ్డాము. విద్యార్థులు ఆసక్తిగా ఆగంతుకలవేపు చూస్తున్నారు.

ఇంద్రసేన్ హుందాగా అడుగులు వేసుకుంటూ వెళ్ళి, క్లాసుటీచరు కాళీచేసిన కుర్చీలో కూచున్నాడు. టేబిలుమీద హంటర్ పెట్టాడు.

"ఊఁ! టెల్ మీ, హూ ఈజ్ గాంధీ?" అని అడిగాడు.

"జాతిపిత సార్!" క్లాసంతా ఒకసారి ఒకే కంఠంతో జవాబు చెప్పింది.

"రాంగ్!" ఇంద్రసేన్ వెకిలిగా నవ్వాడు.

"రాంగా?" ఆ అమాయక విద్యార్థులు తెల్లమొగాలు వేశారు.

"గాంధీ కాంగ్రెస్ (ఐ) పార్టీ సెక్రటరీ!"

కొంచెం చొరవవున్న విద్యార్థి తన క్లాసు పుస్తకం తీసుకొచ్చి ఇంద్రసేన్ ముందుంచాడు. అందులో మోహన్‌దాస్ కరంచంద్ గాంధీని గురించిన పాఠం వుంది.

ఖస్సుమన్నాడు ఇంద్రసేన్. "ఇట్లాగే అఘోరిస్తున్నాయి మన పాఠాలు! ఎప్పుడో చచ్చిన ఆ గాంధీని గురించిన పాఠం ఎందుకూ? ఇందిరాగాంధీని గురించి చెప్పండి, రాజీవ్‌గాంధీని గురించి చెప్పండి, అర్థముంది!" అతను, నావేపు తిరిగాడు. అభియోగం మోపుతున్నట్టుగా





ఇటీవల విజయవాడలో జరిగిన 'బంభరాలు' గ్రంథావిష్కరణ సందర్భంగా వేదికపై ఆవిష్కర్త డా. సి. నారాయణరెడ్డి, శ్రీ మండలి వెంకటకృష్ణారావు, శ్రీ గుత్తికొండ సుబ్బారావు, గ్రంధకర్త శ్రీ కంచనపల్లి రాంప్రసాద్‌గార్లని చిత్రంలో చూడవచ్చు.

అన్నాడు. "ఏం మాష్టారూ, మీ స్టూడెంట్స్‌కు రాజీవ్‌గాంధీ కూడా తెలీకపోతే ఇహ మీరు ఏం పాఠాలు చెబుతున్నట్టూ ?"

నేనేం జవాబు చెప్పలేదు.

ఇంద్రసేన్ ఓ విద్యార్థిని లేచి నిలబడమన్నాడు. "మీ అమ్మ పేరేవిటి ?"అని అడిగాడు. అదేం ప్రశ్న అనుకుని మేమందరం నవ్వుకున్నాము లోలోపల.

ఆ కుర్రవాడు ఫలానా అని చెప్పాడు.

"మీ నాన్న పేరు ?"

ఆ కుర్రవాడు అణుకువగా తన తండ్రి పేరు చెప్పాడు.

"ఆయనే నీ తండ్రి అని నీకెట్లా తెలుసూ ?"

కుర్రవాడికి ఆ ప్రశ్న సరిగా బోధపడలేదు. "నాకు తెలుసు" అన్నాడు.

"ఎట్లా ?"

"మా అమ్మ చెప్పిందిగా !"

"అది నిజమేనని ఎట్లా నమ్మకం?"ఇంద్రసేన్ స్నేహితులు ఘొల్లున నవ్వారు. ఆ ప్రశ్న ఛెళ్లున కొరడాలా ఆ కుర్రవాడికి దెబ్బతగిలింది. ఆ అవమానానికి అతను తట్టుకోలేకపోయాడు. పక్కన కిటికీలో వున్న వో గులకరాయి తీసుకున్నాడు. గురిచేసి, దాన్ని ఇంద్రసేన్ మొహం మీద తగిలేట్టు విసిరేశాడు. 'అబ్బా !' అంటూ ఇంద్రసేన్ నుదురు పట్టుకున్నాడు. నలుగురూ అతని చుట్టూ మూగారు. అతని నుదుటినుండి రక్తపు చుక్కలు కిందకు జారాయి. ఆ కుర్రవాడు క్లాసులో నుండి పారిపోలేదు.

క్లాసంతా నిశ్శబ్దంగా, గంభీరంగా వుంది, ఏం జరుగుతుందోనని.

ఇంద్రసేన్ కర్చీఫ్‌తో గాయాన్ని అదిమిపెట్టి, "నిన్ను డిస్మిస్ చేస్తున్నాను — పో !"

అన్నాడు ఆ కుర్రవాడితో. ఆ స్టూడెంటు ఒక్క క్షణం నుదురు చిట్లించాడు.

"మీరు కాదు డిస్మిస్ చేసేది, హెడ్మాష్టరు గారు !" అన్నాడు, పెదిమలు బిగించాడు.

"ఓ. కే ! వాణ్ని డిస్మిస్ చేసెయ్యండి హెచ్. యమ్. గారూ !" అన్నాడు ఇంద్రసేన్.

నేను అందుకు సిద్ధంగాలేను. ఇంద్రసేన్ ఆ ప్రశ్న అడగడం తప్పు. అందరూ కలిసి అనవసరంగా ఆ కుర్రవాడి పసిమనసును గాయపర్చడం తప్పు. ఇంద్రసేన్ వో రకమైన శాడిస్ట్ అని అర్థమైపోయింది నాకు. ఆ శాడిస్ట్‌ని సంతృప్తి పర్చడం కోసం, బంగారంలాంటి కుర్రవాడి భవిష్యత్తును పాడుచేయటానికి నాకు మనస్కరించలేదు. ఆ విషయంమీద నా గదిలో మరింత ఘర్షణ పడ్డాం. ఫలితంగా నా చేతిలోకి ఈ కాగితం వచ్చింది. ఇదీ జరిగింది.

* * *

తన తండ్రికి జరిగిన అవమానం విన్న మురళీకృష్ణకు వల్లమాలిన కోపం వచ్చింది.

"ఆ దగుల్బాజీ వెధవ దగ్గరకు నే వెళ్ళి కనుక్కొస్తా — ఆ సస్పెన్షను ఆర్డరు ఎట్లా విత్‌డ్రా చేసుకోడో నేను చూస్తా !"

"ఏవిటో నాయనా ! రాక రాక ఇంటికి వచ్చావు. బిడ్డొచ్చాడు కదా అన్న సంబరం పది క్షణాలు నిలవలేదు. బిడ్డొచ్చిన వేళా, గొడ్డొచ్చిన వేళా అన్నారు." అంటూ జీవన వేపు చూసింది. "ఎవరి కాలు ఎటువంటిదో నాయనా, చెప్పలేం ! ఇంతకాలం ఈ ఇల్లు ఇష్టారాజ్యంగా కలకలలాడిపోయిందా, ఇహముందేమవుతుందో — ఏవిటో !" అనుకుంటూ, కళ్ళు తుడుచుకుంటూ వర్ధనమ్మ దొడ్లోకి పోయింది.

ఆ మాటల అర్థం గ్రహించిన జీవన బేలగా మురళీకృష్ణవేపు చూసింది. తన రాకమూలంగానే ఈ ఇంటికి ఈ దురదృష్టం పట్టిందా ? ఆమె మనసు వికలమైంది. భారంగా అడుగులు వేస్తూ గదిలోకి వెళ్ళింది.

బయట మధ్యాహ్నం ఎండ తగ్గి సాయంకాలం నీడలు ముసురుకొంటున్నాయి. ఆకాశమంతా మబ్బులు మబ్బులుగా వుంది. మురళీకృష్ణ డ్రెస్ వేసుకుని బయటికి వెళ్ళబోతున్నాడు.

"ఇప్పుడా ?" అన్నాడు పరమేశ్వరం.

"ఇప్పుడే !" అన్నాడు మురళీకృష్ణ మొండిగా, కసిగా.

7

మురళీకృష్ణ వెళ్లేసరికి, ఇంద్రభవనంలో కంట్రీ కాబెరా జరుగుతోంది. పాటల మాలచ్మి నాజూకైన లోపావడా వేసుకుని దానిమీద టూనాట్‌టూ నంబరు జపాను సెరిలిను ట్రాన్స్‌పరెంట్ చీరను వల్లెవాటుగా ధరించింది. బొడ్డు కిందకు పావడా ముడి జార్చి, మెయిడన్ ఫారమ్ బ్రాసియర్సు ధరించి వాటిమీద జలతారు జాకెట్టును జారుముడి వేసుకుంది. ఎత్తు మడమల స్లిప్పర్లను వేసుకుని, వాటిని టకటకలాడిస్తూ గిరగిరాలు తిరుగుతోంది. టేప్‌రికార్డరు లోంచి ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్ ఫాస్ట్‌గా వినిపిస్తోంది.

మురళీకృష్ణను గేటు దగ్గర గూర్ఖా అటకాయించాడు. "కౌన్ హో తుమ్ !"

"తెరా బాప్" వాణ్ని ఒక్కతోపు తోశాడు. వాడు వెళ్ళి ఆమడదూరంలో పడ్డాడు. మురళీకృష్ణ పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ ఇంద్రభవనం మెట్లవైపుగా కదిలాడు.

"పక్‌డో, పక్‌డో" గూర్ఖా అతని వెంట బడ్డాడు.

మెయిన్‌గేటు లోపలే ఎంతో విశాలంగా వుంది ఆ స్థలం. అంతటా పచ్చిక మొలిచి కాలి కింద తివాచీలా మెత్తగా వుంది. నీరెండలో ఇంద్రభవన్ గర్వంగా మెరుస్తూ తన వైభవాన్ని ప్రదర్శిస్తోంది. పాలరాతి ముఖద్వారం. లతలూ పూలూ చెక్కిన ఎత్తైన టేకు తలుపులు. జైపూర్ ఎర్రరాళ్ళను మెట్లుగా అతికారు. ఒకదానిపైన ఒకటిగా పద్దెనిమిది మెట్లు. మెట్లకూ, ప్రధాన ద్వారానికీ మధ్యన వరండాలో పద్దెనిమిది పాలరాతి స్తంభాలు. స్థంభాలమీద సాలభంజికలు.

మెట్లన్నీ గబగబా ఎక్కి మురళీకృష్ణ వరండాలోకి వచ్చాడు. తలుపు దగ్గరగా స్టూలు మీదున్న కూచున్న కన్నదాసు, "ఎవురయ్యా నువ్వు ? ఎవరు కావాలి ?" అన్నాడు నొసలు చిట్లించి.

కన్నదాసు పక్కన గుర్రప్పిల్లా వున్న ఆల్సేషియన్ కన్నార్పకుండా, ముక్కుపుటాలు కదిలిస్తూ, అతన్నే గమనిస్తోంది.

"హెడ్‌మాష్టర్ పరమేశ్వంగారి అబ్బాయిని. ఇంద్రసేన్ కావాలి !"

"ఆయన అరజెంటు పన్లో వుండారు. ఇప్పుడు దొరకరు !"

"నేనొచ్చానని చెప్పు ! దొరుకుతారు."

"నేనంటే ... ?"

"మురళీకృష్ణ అని చెప్పు !"

"అది చాలా ... ?"

"జీవన అనే అమ్మాయి పంపిందని చెప్పు!"

"ఓహో ! అట్టా సెప్పు. అమ్మాయి కబురా ..." వాడు లోపలకు వెళ్ళాడు వాడితో పాటే ఆల్సేషియనుకూడా లోపలకు వెళ్ళింది.

గూర్ఖా అక్కడిదాకా వచ్చి, కన్నదాసు లోపలకు వెళ్ళడం చూసి, తిరిగి గేటు దగ్గరకు వెళ్ళిపోయాడు. వరండాలో పద్దెనిదడుగుల ఎత్తున వున్నాడు మురళీకృష్ణ. అసలే ఇంద్రభవన్ ఓ గుట్టమీద వుంది. దానికి తోడు ఈ ఎత్తు వొకటి. వూరంతా ఎంతో కిందవున్నట్లనిపిస్తోంది. అంత ఎత్తునుండి చూస్తుంటే, అందరిస్థాయీ ఎంతో తక్కువ అని అనిపిస్తోంది. గొప్పవాళ్ళు బీదవాళ్ళని తక్కువ చేసి చూడ

డానికి ఈ రకమైన ఎత్తే ఒక కారణమా ? క దాసు బయటకు వచ్చాడు. "క న్నారు" అ...షు. వరండాలో వరుసాగ్గా పె... పేము కుర్చీలను చూపించాడు.

సూర్యుడు పడమటికి పడిపోతున్నాడు. పచ్చిక మైదానంలో ఓ మూలగా వున్న కడిమి చెట్టు ఎర్రని పువ్వులతో గాయాలుతిన్నమనిషిలా కనిపిస్తోంది. మురళీకృష్ణ కూచున్న చోటుకు ఎదురుగా వో కిటికీ వుంది. రంగుటద్దాల కిటికీ. కిటికీ అవతల గాలికి అలనల్లన కదిలే పల్చటి తెర తెరకు ఆవల కదిలే నీడలు. ఇంద్రభవనంలో పగలే దీపాలు వెలుగుతున్నాయి. దీపాల క్రింద పావడా కదులుతోంది. గాజులు కదులుతున్నాయి. వెండి పట్టాలు కదులుతున్నాయి. 'ప్రా'కు కుట్టిన చిరు గజ్జెలు కదులుతున్నాయి.

లోపలనుంచీ సనసన్నగా పాట వినిపిస్తోంది.

పాపం ఏవిటి ? పుణ్యం ఏవిటి ?
పాపం, పుణ్యం మనసుకు పెట్టిన
కళ్ళజోడురా !
మంచేవిటి ? మరి చెడుగేవిటి ?
మంచీ, చెడూ అవి మనుషుల నెత్తిన
గొడుగులురా !
తీసేయ్, తీసేయ్ నీ కళ్ళజోడుమా
ముడిచేయ్, ముడిచేయ్ నీ నెత్తి
గొడుగుమా
కనిపిస్తుందది ఆకాశం !
ఇచ్చేస్తుందది
తరతమ మెరుగని అవకాశం !

"నిజమేనమ్మా !" అనుకున్నాడు మురళీ కృష్ణ. "కళ్ళజోడు తీసేసి, నెత్తినున్న గొడుగు ముడిచేస్తే ఇహ కనిపించేది ఆకాశమే, ఆకాశం గగనం శూన్యం ! ఆ శూన్యంలో విలువలూ వుండవు, ధర్మం వుండదు, క్రమశిక్షణా అక్కర్లేదు. ఎపుడేం అనిపిస్తే అప్పుడాపనిచెయ్యవచ్చు.

పాట క్రమక్రమంగా ఆగిపోయింది. గజ్జెల చప్పుళ్ళు సర్దుకున్నాయి. పెద్దగా బజర్ మోగింది. "ఎళ్ళండి బాబూ, అయ్యగారు రమ్మంటుండారు." కన్నదాసు చెప్పాడు. మురళీ కృష్ణ లోపలకు నడిచాడు.

లోపల నేలమీద కాశ్మీరు తివాచీ పరిచారు. బొంబాయినుండి తెప్పించిన గాజుబుడ్లు పై నుండి కిందకు వేలాడుతున్నాయి. మూలమూలల కళాత్మకమైన వస్తువులు కన్నులకింపుగా కనిపిస్తున్నాయి. కొన్ని కొయ్యవి, మరి కొన్ని దంతంతో చేసినవి, గోడలకు రవివర్మ బొమ్మలు, తివాచీమీద ఖరీదైన సోఫాసెట్లు. వాటి మధ్యగా టీపాయ్‌లు, టీపాయ్‌ల మీద పెద్ద సైజుల్లో ఫ్లవర్‌వేజులు. వాటిల్లో మరుగుజ్జు చెట్లు, ఆ చెట్లకు మరుగుజ్జు పూలూ, కాయలూ !

ఇంద్రసేన్ సింహాసనంలాంటి వో సోఫాలో కాలుమీద కాలువేసుకుని కూచున్నాడు. అతని ముందు టీపాయ్‌మీద వైన్‌గ్లాసులో చిక్కని ద్రవం వుంది. అతని చేతిలో ట్రిబుల్ ఫైవ్ సిగరెట్టు ఎర్రగా కాల్తోంది. అతని 'చెంచాలు' అటూ యిటూ కూచున్నారు. వాళ్ళ దగ్గరా గ్లాసులున్నాయి.

"కమిన్ మై ఫ్రెండ్..." మురళీకృష్ణను సాదరంగా ఆహ్వానించాడు ఇంద్రసేన్.

"సారీ ఫర్ కీపింగ్ యు వెయిటింగ్... ! కొంచెం అర్జంటు వర్క్‌లో వుండిపోయాం, మధ్యలో డిస్‌కంటిన్యూ చేయటానికి వీల్లేకపోయింది !"

ఆ 'అర్జంట్ వర్క్' ఏమిటో బయటి నుండి చక్షుః శ్రవణపేయంగా తెలుసుకుని విన్న మురళీకృష్ణ, "యూ బాస్టర్డ్ !"అన్నుకున్నాడు లోపల. పైకి ఏం అనలేక మౌనంగా వూరుకున్నాడు.

"ఎట్లావుంది మా ప్యాలెస్ ?... ఇదేనను కుంటా మీరు మొదటిసారి రావడం ?"

"కాదు. మీ నాన్నగారు బతికున్నరోజుల్లో మా నాన్నగారూ, నేనూ చాలాసార్లు వచ్చేం. మా నాన్నగారు లోపల మాట్లాడుతూ వుంటే, బయట నేను ఆడుకుంటూ వుండేవాణ్ని, పచ్చిక బయలులో, చెట్ల కొమ్మలమీద, ఇంట్లో బొమ్మలదగ్గర !"

"అబ్బో ! అది ఎన్నాళ్ళకిందటి ముచ్చటో– రోజులు మారిపోలేదూ... ?"

"అవునవును. చాలా మారిపోయాయి !" అన్నారు వంతపాటగాళ్ళు పక్కనుండి.

ఇంతలో వో సర్వెంట్, తలా, కొమ్ములూ, చర్మం వున్న వో స్టఫ్‌డ్ దుప్పిని పట్టుకొచ్చాడు. "ఇది మీకు ప్రెజంటేషన్‌ట సార్ !"

"ఎవరు పంపించారు ?"

"యస్. ఐ. సైదులుసార్ ! నిన్న మీరు వేటలో కొట్టిన దుప్పిని తనట్టే పెట్టేసుకుని, మీ దగ్గరుంచమని దీన్ని పంపించారు సార్ !"

"గుడ్... ఆ మూలుంచు !"

సర్వెంట్ దాన్ని అవతలకు పట్టుకుపోయాడు. అతనికి ఎదురైనాడు మేనేజరు నాగలింగం. "చూసుకు నడవయ్యా ఆకొమ్ములు నాకు గుచ్చుకునేవి, కాస్తుంటే !" అన్నాడు కోపంగా. అతని రెండు చేతుల్లోనూ రెండు ప్యాకెట్లున్నాయి.

"దుప్పి కొమ్ములే కదుటయ్యా, అవేమన్నా తుపాకిగుళ్ళా ?" ఇంద్రసేన్ కూచున్న చోటి నుంచే మందలింపుగా అన్నాడు.

"ఇవ్వాళ మధ్యాహ్నం ఏం చెప్పాను మీకు?"

"జ్ఞాపకం వుందయ్య !"

"ఏం చేశారు ?"

"పూర్తి చేశానండి !"

"ఇటు రండి, ఇటు కూచోండి!" మేనేజర్ని తన పక్కకొచ్చి కూచోమన్నాడు.


"వద్దులెండయ్య, నుంచుంటాను !"


"ఓ. కే మీ స్వామి భక్తిని నేనెందుకు కాదనాలి ? నుంచునే వుండండి. సిక్స్‌టీన్‌వైన్ ఏదేదీ ?"

నాగలింగం సిక్స్‌టీన్‌వైన్ సీసా తీసి టీపాయ్ మీద పెట్టాడు.

"ఆమ్‌స్టెల్ బీర్ ...?"

"ఆమ్‌స్టెల్ బీర్, స్కాచ్ విస్కీ, ఇటలీ బ్రాందీ, అమెరికన్ రమ్, ఆస్ట్రేలియన్ జిన్, అన్నీ తెచ్చానండీ, ఇవిగో ...!" అతను సంచీలో





జీ వ న ము ర ళి

నుండి తీసి దేనికది విడివిడిగా పర్ది వివరంగా చూపించాడు.

"చాలా కష్టపడ్డారు నాగలింగం గారూ! మీకు రెండింక్రిమెంట్లు మంజూర్ చేశాము!"

"తండ్రిగారి గుణాలే వచ్చాయి, దయా హృదయులు!"

"ఆ పెద్ద జమీందారుగారి గుణాలు ఇవ్వ డెందుకు తలుస్తారు?" అన్నాడు మురళీకృష్ణ వెటకారంగా.

"మా మేనేజరుగారు మీకు తెలుసా?"

"పాత మేనేజరుగారు తెలుసు, కొత్త మేనేజరుగారు తెలీదు!"

"నేను పాతవాణ్నే మురళీకృష్ణ!" అన్నాడు నాగలింగం.

"మనిషి పాతే! అలవాట్లు కొత్తవిగా వున్నాయి."

అర్థమైన నాగలింగం అర్థం కానట్టు మొహం పెట్టాడు.

"యజమానులకు ఇష్టమైనట్టు వుండడంలోనే కదు బాబూ, మన సుఖం వున్నది?"

"భలేగా చెప్పావయ్యా!" ఇంద్రసేన్ చప్పట్లు కొట్టాడు. మిగిలినవాళ్లూ కొట్టారు. హాలంతా చప్పట్లతో మారుమోగింది. కన్నదాము లోపలకు ఒక్కసారి తొంగిచూసి మళ్ళీ బిగుసుకు పోయాడు. ఆల్సేషియన్ పడుకొన్నది ఒకసారి లేచి మంచివి మళ్ళీ పడుకొంది. ఇంద్రసేన్ గ్లాసులో వున్నదంతా ఒకసారి గటగటా తాగేసి, మరో పెగ్గు వొంచుకున్నాడు. "స్టేషముకు రావద్దన్నాను, రాలేదు. ఇవ్వాల్టి మంచీ నేనే చూస్తాన్ ఎకౌంట్స్ అన్నాను, చూడండి సార్ అన్నావు. ఇంట్లోనే గానా బజానా అన్నాను, ఏర్పాటు చేస్తానన్నావ్. హంటింగ్ అంటే ఇష్టం అన్నాన్, ఎరేంజ్ చేశావ్. ఐ లైక్‌యూ ఐ లైక్ యూ మిస్టర్ నాగలింగం, ఐ లైక్ యూ వెరీమచ్... అన్నట్టు మిస్టర్ కృష్ణ! ఓ పెగ్గేసుకోరాదూ మీరు, జస్ట్ ఎ పెగ్..."

"వద్దు వద్దు. ఐ యామ్ ఎ టీ టోటలర్!"

"టీ టోటలర్స్‌కు ఇక్కడ ప్లేస్ లేదే! ఓ. కే... వచ్చిన పనేమిటో చెప్పండి, చెప్పేసి తొందరగా వెళ్ళిపోండి."

"మా నాన్నగార్ని మీ రెందుకు సస్పెండ్ చేశారు?"

"మేనేజరుగారూ ..." ఇంద్రసేన్ పిలుపుతో ప్రకృతంలోకివచ్చి "ఇదిగోనండయ్యా కవరు" అంటూ నాగలింగం ఆయనకో కవరం దించాడు.

"ఏం చేశామో చెప్పండి!"

"బాబూ, మీ నాన్నగార్ని సస్పెండ్ మాత్రమే గాదు, డిస్మిస్ కూడా చేశారు. రావల్సిన డబ్బులన్నీ సయాపైసల్తో సహా లెక్క కట్టి ఇదిగో చెక్కురాసి మీకిస్తున్నారు. కారణ లంటారా?... వాటి జోలికి వెళ్ళక పోవడం మీకూ మాకూ మంచిది. వెళ్ళిరండి."

"ఉయ్ వాంట్ నాట్ మనీ, బట్ రీజన్స్!" మురళీకృష్ణ రెట్టించాడు.

"రీజన్సా? లక్షాతొంభై! ఇన్‌సబార్డినేషన్, ఇన్‌డిసిప్లిన్, ఇనెఫిషియన్సీ...!"

ఇంద్రసేన్ నింపాదిగా అన్నాడు.

"ఇవన్నీ మీరు ప్రూవ్ చెయ్యాలిగా?"

"మేనేజ్‌మెంట్ ప్రూవ్ చెయ్యదు, యాక్ట్ చేస్తుంది. తాను పరమ విధేయుణ్ననీ, క్రమశిక్షణా పరుణ్ణనీ నిరూపించుకోవలసింది మీ నాన్నగారే!" నాగలింగం హితబోధగా అన్నాడు.

"లోకానికంతా తెలుసు— మా నాన్నగా రెటువంటివారో, ఆయన పాలకవర్గానికి ఎప్పుడూ వ్యతిరేకి కాడు."

"నా నోట్లో వున్న పైపును పదిమంది లోనూ లాగేయడం పరమ విధేయత. ఓ కుర్ర వెధవచేత నుదురు పగలగొట్టించడం క్రమ శిక్షణాయుతమైన చర్య. మీరెవ్వరో మాకు తెలియనే తెలియదు కదా, మీరెట్లా చెకింగ్ చేస్తారూ అని ప్రశ్నించడం ఆయన సమర్థత."

ఇంద్రసేన్ ప్రతి ఆరోపణకూ మురళీ

భయంకర ప్రపంచం!

పశ్చిమజర్మనీ రాజధాని ఒక నగరంలో ఇటీవల బాలల చిత్రకళాప్రదర్శనజరిగింది. సాధారణంగా బాలలుగీచే చిత్రాలు ఆహ్లాద కరంగా ఉంటాయి. కానీ ఈప్రదర్శనలో పాల్గొన్న బాల బాలికలలో అనేక మంది యుద్ధంపట్ల, స్కూలుసుగురించి ఆందోళన వ్యక్తంచేసే చిత్రాలు గీచారు. ఈ చిత్రాలు పెద్దవాళ్ళకళ్ళు తెరిపించినా తెరిపించక పోయినా, బాలల మనస్సులలోని భయాందోళనలకే అద్దం పట్టేనట్లు న్నాయి. 15 సంవత్సరాలు వయసుగల ఒక వియత్నాం బాలుడు యుద్ధ చిత్రాన్ని గీచాడు. మరో బాలుడు స్కూలు జీవితం పట్ల ఆందోళన వ్యక్తంచేసే చిత్రాన్ని గీచాడు. ఈ చిత్రంలో ఒక బాలుడు డెస్క్‌పై తలపెట్టి పండుకుని ఉన్నాడు. పైన నల్లటి మేఘాల మధ్య తెల్లటి మెరుపులు పరిస్థితి తీవ్రతను సూచిస్తున్నాయి. ఈ ప్రదర్శన చూస్తుంటే, "ఎంత భయంకరమో ఈ ప్రపంచం!" అని బాలలు అనుకుంటున్నట్లు అనిపిస్తున్నది.

కృష్ణ తగిన సమాధానం చెప్పాడు. మాటకు మాట పెరిగింది.

"సరేనయ్యా మీ నాయన విధేయుడే, సమర్థుడే, ఆయన చేసిందే రైటు. రేపట్నించీ దొరవారు కొన్ని క్రొత్త పద్ధతుల్ని ప్రవేశపెట్ట బోతున్నారు, అందుకాయన ఒప్పుకుంటే నిక్షేపంగా ఉద్యోగం చేసుకోవచ్చు. ఒప్పుకుంటారా ?" అడిగాడు నాగలింగం.

"ఏమిటా పద్ధతులు... ?"

"వాళ్ళ జీతాల్లోంచి ఫైవ్ పర్సంట్ చొప్పున టీచర్లందరూ ప్రతి నెలా జమీందారు గారికి బహూమతిగా పంపించాలి !"

"ఇంపాసిబుల్..."

"అట్లా పంపించని వాళ్ళ ఉద్యోగా లూడుతాయి !"

"రెండో షరతేమిటి ?"

"దొరవారు ఏ ఎన్నికలో పోటీ చేస్తే ఆ ఎన్నికకు టీచర్లందరూ దొరవారి తరఫున ప్రచారం నిర్వహించాలి."

"అన్యాయం !"

"అట్లా చెయ్యని వాళ్ళ ఉద్యోగా లూడతాయి !"

"మూడో షరతేమిటి ?"

"దొరవారి బంగ్లాలో పెద్దపనికీ చిన్నపనికీ టీచర్లందరూ పెద్దా చిన్నా అనే బేధం లేకుండా నడుం బిగించి కార్యరంగంలోకి దూకాలి."

"అక్రమం !"

"అట్లా దూకని వాళ్ళ ఉద్యోగా లూడతాయి."

"నాలుగో షరతేమిటి ?"

"సంఖ్య సంగతి వద్దుగానీ, చెప్పింది విను. పొద్దున్నే ఎసెంబ్లీలో దొరవారి గుణగణాలే గానం చెయ్యాలి, పండగ పబ్బం వస్తే ముందుగా దొరవారికి కనుపించి ఆశీస్సులు తీసుకుని వెళ్ళాలి. దొరవారి పుట్టినరోజు పండగను మహోఘనంగా జరుపుకోవాలి !"

"వీటికి మా నాన్న సుతరామూ అంగీక రించరు !"


"అవును బాబూ ! ఆయన గాంధీ తరానికి చెందినవాడు. దొరవారు సంజయ్‌గాంధీ తరానికి చెందినవాడు. అంచేత మీ నాన్న సర్వీసుకు పనికి రాడు, చెక్కు తీసుకుని వెళ్ళిరా !" అన్నాడు నాగలింగం న్రమతగా.

"పనికి రాడనుకుంటే మా నాన్న రిజైన్ చేస్తాడు, ముందు మీ ఆర్డరు విత్‌డ్రా చేసుకోండి !"

"రిజైన్ చేస్తే మీ నాన్న ప్రిస్టీజ్ పెరుగుతుంది. ఆయన్ని డిస్మిస్ చేశామంటే మా కంట్రోల్ పెరుగుతూంది..."

"యూ బ్లడీ...!" మురళీకృష్ణ ఆవేశంతో లేవబోయాడు.

అతణ్ని లేవకుండా కన్నదాసు, మరికొందరూ



అదిమిపెట్టారు. అతని పెడరెక్కలు విరిచి కట్టారు. అతని జేబులో చెక్కును కుక్కారు.

"గో ఎవే మై ఫ్రెండ్ ! నాతో ఢీకొట్టకు. తల పగిలిపోగలదు." అన్నాడు ఇంద్రసేన్ కర్కశంగా నవ్వుతూ. అతణ్ని బయటిదాకా తీసుకువచ్చి మెట్లమీదినుండి కిందకు తోశారు. దొర్లుకుంటూ కింద పడ్డాడు మురళీకృష్ణ. మొహమంతా దెబ్బలు తగిలాయి. కాళ్ళూ చేతులూ గీసుకుపోయాయి. కిందపడ్డ మురళీకృష్ణను తోసుకుంటూ గేటుదాకా తీసుకువచ్చి బయటకు ఒక్క నెట్టు నెట్టాడు గూర్కా. ఇనపగేటు అతనికి వెనకనుండి మూసుకుపోయింది. భగభగమంటున్న హృదయంతో తన ఇంటివైపుగా నడుస్తున్నాడు మురళీకృష్ణ.

(ఇంకా వుంది)

వ్యక్తిగతం



జోగిందర్‌సింగ్ బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్‌లో డిప్యూటీ ఇన్ స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా ఉండే వారు. ఈయన ఇటీవలే మరణించారు. ఆయన మరణం వెనుక ఏదో రహస్యం ఉందని పరిశోధకుల అనుమానం. ఈయన సోదరుడు మేనకాగాంధి తండ్రి. మేనకాగాంధి తండ్రీ, భర్తా, పినతండ్రీ కూడా సహజంగా చనిపోలేదు ...



ఎ.కె. సుబ్బయ్యని కర్నాటక భా.జ.పా. నుంచి బహిష్కరించారు. ఎందుకంటే ఈయన తరచు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘాన్ని విమర్శిస్తూ ప్రకటనలు చేస్తూ వచ్చారు. కొంతకాలంపాటు ఆయన అటల్ బిహారీ వాజపేయీ సంరక్షణతో తప్పించుకోగలిగాడుగాని ఇక మితిమీరిపోయారని వ్యాఖ్యాతలు అంటున్నారు. ఎ. కె. సుబ్బయ్య సొంత పార్టీ పెట్టుకుంటున్నారు ...



భారతదేశంలో అంకికి కోటి రూపాయల వయిగా వస్తే అమెరికాలో (నికోలస్)జోరిక్‌కి 88 లక్షల డాలరుల జాక్‌పాట్ వచ్చింది లాటరీలో. ఒక డాలరు పది రూపాయలదాకా ఉంటుందనుకోవచ్చు ...

వారఫలం

2-9-1983 శుక్రవారం మొదలు 8-9-1983 గురువారం వరకు

♈ **మేషం:** వ్యాపారంలో, అసాధారణమైన శ్రద్ధ చూపుతారు. ధనార్జనకై పడరాని తంటాలు పడుతారు. అప్పులు వసూలు కాక పోవటంలో చికాకు కనిపిస్తుంది. ధనాదాయ నిమిత్తం చేసిన ఒకటి రెండు ప్రయత్నాలు విఫలమవు తవి. స్త్రీలకు: ఆశించిన కార్యంలో ఆశా భంగం, అపనిందలకు గురి కావలసి రావటం జరుగుతుంది.

♉ **వృషభం:** విద్యా విషయంలో, రచనా వ్యాసంగంలో, నూతన వ్యాపారం చేపట్టాలని తాపత్రయ పడటంతోవారం గడచి పోతుంది, అనుకొన్న విధంగా ఏదీ కలిసి రాక పోవటం గమనించ గలరు. ఇతరులకు తప్పనిసరిగా సాయపడవలసిన పరిస్థితి ఉంటుంది. చాలమంది పొరుగూరికి వెళ్ల వలసి రావచ్చు. స్త్రీలకు: వృత్తిలో వికాసం, ఆదాయం గల వారం.

♊ **మిథునం:** గృహ విస్తరణ కార్యక్రమ నిమిత్తమో, వ్యాపారాన్ని బాగా పెంచాలని చేసే ప్రయత్నమో ఫలింపనున్నది. వస్త్ర వాహనాల సేకరణతో కాలం వ్యయింప నున్నారు. అనవసరంగా యితరుల నుండి మాట తినవలసిన పరిస్థితు లుంటాయి. స్త్రీలకు: ఉద్యోగంలో హాయి, ప్రశాంతత చిక్కుతుంది. ప్రజా బాహుళ్యంలో కీర్తి ప్రతిష్ఠలు పెరుగుతాయి.

♋ **కర్కాటకం:** అధికారం పెంపొందు తుంది. మిత్ర వర్గం మూలాన మేలేదో జరుగ మన్నది. నూతన వాంశాలు తెలిసి కొంటారు, నూతన మిత్రులను కలిసి కొంటారు. కోర్టు వ్యవహారాలు ఏమైనా ఉంటే అనుకూలం కావని నిశ్చయించు కోవాలి. వారమంతా శ్రమకరమే. స్త్రీలకు: విలువ గల వస్త్ర సేకరణ, వస్తు సేకరణకు అవకాశ మున్నది.

♌ **సింహం:** సాధారణంగామీకు ఓటమి లేదను కొంటారు, కాని, ఈవారం, ఒకానొక విషయం మీకు యిబ్బంది కరంగా పరిణమిస్తుంది. ఉపకారం చేసిన వారే అపకారానికి తలపడుతారు. అనవసరపు ప్రయాణా లుంటాయి. స్త్రీలకు: బంధువుల రాకపోకలు, ఉద్యోగ మందు పెంపు, నూతనోద్యోగానుకూలతకు అవకాశం.

♍ **కన్య:** చాలకాలంగా చేతికి రాక నిలచిన ధనం, అందటం, అవసరాలు తీరటం గమనిస్తారు. ఉద్యోగ నిమిత్తమో, వ్యాపార నిమిత్తమో దూర ప్రాంతాలకు, కొందరు ప్రయాణించ నున్నారు. స్త్రీలకు: తలంచిన పనులు నెరవేర టం, శుభ కార్య సూచనలు,

♎ **తుల:** ఏదైనా విలువగల వస్తువులు కొనుగోలు చేయుటకు అవకాశమున్నది. ఆదాయం కూడా, వ్యాపార మూలంగానో, మరో విధంగానో అభివృద్ధి చెంద నున్నది. సాహితీ పరంగా సదవకాశాలు లభించే మార్గమున్నది. స్త్రీలకు: అభివృద్ధి ముఖ్యంగా కళారంగాన చెప్పవీలున్నది.

♏ **వృశ్చికం:** పదిమందిలో మీ ప్రతిష్ఠ అతిశయించు టకు, వస్త్ర వాహనాలు సమకూర్చుకొనుటకు, ఉద్యోగంలో, పై యంతస్థుకు పోవుటకు, సర్వవిధాలా వీ లున్నది. అనవసరంగా గొడవలలో చిక్కుకొని బాధ పడే అవకాశం కూడా లేకపోలేదు, స్త్రీలకు: ఆదాయం చాల కాలంగా కాక నిలచిన ఒకానొక గృహ సంబంధ వ్యవహారం సానుకూలం కావటం గమనిస్తారు.

♐ **ధనుస్సు:** స్తోత్ర ప్రియులు చుట్టూ చేరే అవకాశమున్నది. విలాస వస్తువులు సేకరించుకోగల సమయం. నూతన వాంశాలు తెలిసికో గలరు. మిత్రుల రాకపోకలకు అవకాశమున్నది. స్త్రీలకు: అవకాశాలు ముఖ్యంగా కళారంగంలో సాధ్యమని గ్రహించండి. పాత బాకీల వసూలు కై ప్రాకులాడండి.

♑ **మకరం:** వృథా ప్రయాణాలు, లేనిపోని తగాదాలు, పెద్దలతో కాని పోని మాటలు, అధికారులతో పేచీలురావటానికిఅవకాశమున్నది. చాల కాలంగా జరుగని పనులుఅలాగే ఉంటాయి. ఉత్తరాలు రావటం, అదీ ధన విషయం కావటం, స్థిరచరాస్థుల విషయంలో తగాదాలు రావటం సహజంగా కనిపిస్తుంది. స్త్రీలకు: అన్ని విధాలా యిబ్బందులే.

♒ **కుంభం:** న్యాయంగా జరుగ వలసిన పనులుకూడా కాక పోవటంతో ఆందోళన విసుగుతో సతమతం కావటం కూడా జరుగుతుంది. పదిమందిలో పేరు తెచ్చుకొనే అవకాశా లుంటాయి. స్త్రీలకు: దూర ప్రాంతాల నుండి శుభ వర్తమానం రాగలదు. సంతాన శుభ కార్య నిమిత్తం ప్రయాణించ గలరు.

♓ **మీనం:** అధికారుల వలన జరుగ వలసిన పనులు సుకరంగా నెరవేర టం, ఆదాయంలో అభివృద్ధి కనిపిస్తుంది. కళారంగంలో సదవకాశాలు లభిస్తాయి. సుఖ సంతోషాలు, వృత్తియందు దభి వృద్ధి నూతన విషయాలు తెలిసికోవటం కూడా జరుగుతుంది. స్త్రీలకు: సంగీతంలో నేర్పరులకు, నృత్యాభిమానం గలవారికి సదవకాశాలుంటాయి, గ్రహించాలి.

— విద్వాన్ కోట సత్యరంగయ్య శాస్త్రి ★

కొత్త పెళ్ళికూతురు తన అనుభవాన్ని చెబుతోంది. యవ్వనంలో ముఖంపై వచ్చే మొటిమలెలా పోతాయో చెబుతోంది.

"యవ్వనంలో మొటిమలు రావడం సహజం
వాటిని శుభ్రంచేసి అదుపులో పెట్టడానికే ఎప్పుడూ క్లియరసిల్ వాడటం."



"నాకు 18 ఏళ్లొచ్చేసరికి మొటిమలు రావడం మొదలెట్టాయి...

అయితే నేనంతగా పట్టించుకోలేదు. ఇంకొంచెం ఎదిగిన తర్వాత ఒక రోజున ఒక అబ్బాయి చూడటానికి వచ్చారు నన్ను.


మరి అతను చూసీ చూడటంతోనే నచ్చలేదన్నాడు

నేనైతే కలలో గూడా అనుకోలేదు మొటిమలు యింత పనిచేస్తాయని, యిలా దారిలో అడ్డుకుంటాయని. నా స్నేహితురాలు జయతో చెప్పానిది...

ఇక అప్పుడు జయ నాకు క్లియరసిల్‌తో ఒకదారి చూపించింది

నేను క్లియరసిల్ రోజుకు రెండుసార్లు రాసుకోవడం మొదలెట్టా. క్రమం తప్పకుండా వాడుతూ వచ్చాను. మరి తర్వాత ఒక రోజున ఏమైందంటే, నా స్నేహితురాలి యింట్లో అదే అబ్బాయి కలిసాడు, యిక అలాగే కన్ను ఆర్పకుండా చూస్తూ వుండిపోయాడు!"

క్లియరసిల్ వేనిషింగ్ మెడికేషన్ మరియు క్లియరసిల్ స్కిన్ కలర్డ్ మెడికేషన్—యీ రెండూ తమ విశిష్టమైన త్రివిధ చర్యతో పనిచేస్తాయి



1. మొటిమలను తెరుస్తాయి	2. మొటిమలను శుభ్రం చేస్తాయి	3. మొటిమలను ఆరబెడతాయి

క్లియరసిల్‌కి ఇప్పుడొక తోడు!

ఒకవైతే మీకెరిగిన క్లియరసిల్ స్కిన్ కలర్డ్ మెడికేషన్ మొటిమల్ని కనిపించకుండా చేస్తూ, తన ప్రభావాన్ని చూపిస్తుంది. మరొకవైతే, కొత్త క్లియరసిల్ వేనిషింగ్ మెడికేషన్ చర్మంలో కలిసిపోతుంది, రాసుకున్నట్టే కనిపించకుండాను, మరి తన ప్రభావాన్ని చూపిస్తుంది. అలంకరణతో సౌందర్యం, ముందుకి మందూను.

క్లియరసిల్ ప్రతి రోజూ రెండుసార్లు రాసుకోండి

మొదట మీ ముఖాన్ని కడుక్కోండి. ముఖం అంతటిపైనా క్లియరసిల్ రాసుకోండి; మొటిమలున్నచోట మరి కొంచెం ఎక్కువగా. మొటిమలు పోయిన తర్వాత గూడా క్లియరసిల్ రాసుకుంటూనే ఉండండి. ఎందుకంటే క్లియరసిల్, చర్మంలో ఎక్కువగా గల నూనెని లాగేస్తుంది. తద్వారా మొటిమల్ని రాకుండా అదుపులో పెడుతుంది.



కొత్త వేనిషింగ్ మెడికేషన్

స్కిన్ కలర్డ్ మెడికేషన్

క్లియరసిల్ – ప్రపంచంలోని నం. 1 మొటిమల క్రీమ్

OBM-8625-R TEL

నీతిలేని కథ

నందం రామారావు

(గత సంచిక తరువాయి)

"దొంగతనం సెయ్యడం నీకిదే మొదలను కుంటాను."

"అవును! ఇదే మొదటిసారి."

ఇంకెప్పుడూ చెయ్యను కూడా!

వాళ్ళు కొట్టిన దెబ్బలతో శరీరం పుండయింది.

ఆకలితో చావనన్నా చావాలిగానీ దొంగతనం మాత్రం చెయ్యకూడదు !

"ఎంకటేశూ ! పెతి ఇద్దెలోనూ కొన్ని మెలకువలుంటాయి. అవి తెలుసుకోవాలి ముందు"

వెంకటేశుకి గురువులు చెప్తున్నది అర్థం కావడంలేదు. గురువులు అదేం పట్టించుకోడం లేదు.

"దొంగతనం సెయ్యడంలో కూడా కొన్ని మెలకువలున్నాయి. నువ్వాటిని తెలుసుకుంటే, ఇక సచ్చినా నిన్ను పట్టుకోలేరు. ఆ ఇద్దెలన్నీ నీకు నేర్పిత్తా..."

వెంకటేశు తడబడుతూ—

"అబ్బే ! నే నింకెప్పుడూ దొంగతనం సెయ్యను" అన్నాడు.

గురువులు ఫెళ్లున నవ్వాడు.

"ఓరి సిట్టితండ్రీ ! అందరూ మొదట ఇట్టానే సెబుత్తార్రా. బన్నూ, టీ తీసుకున్నావ్. ఇక ఇప్పుడు సెయ్యవ్. ఇవి అరిగిపోగానే మళ్ళీ ఆకలేస్తుంది. అప్పుడు ఈ నీతులు ఎగిరిపోతాయి. మళ్ళీ సెయ్యి అడ్డాలమీదికి పోతుంది."

వెంకటేశు బిక్కమొగం వేశాడు.

గురువులు వెంకటేశు భుజంమీద ఆప్యాయంగా చెయ్యివేసి—

"ఎంకటేశూ ! నువ్వేం బాధపడి పోనక్కర్లేదు. ఈ పెపంచకంలో దొంగకానివోడు ఎవుడూలేడు. మడిసిని మరో మడిసి దోచుకుంటేనే గొప్పోడయ్యేది. గొప్పోళ్ళు కంటికగ్గని పించకుండా దోచుకుంటారు. నువ్వు చేసేది పైకి కనిపిత్తది. అంతేతేడా ! కానీ, గొప్పోడి కంటే నువ్వేనయంరా. ఆడు మేడలు కట్టుకోడానికీ, ఇనప్పెట్టెలు నింపడానికీ దోచుకుంటున్నాడు. నువ్వు నీకడుపు నింపుకోడానికే ఆ గొప్పోడిదగ్గర దోసుకుంటున్నావ్. ఈ పెపంచకంలో న్యాయం సెల్లుబాటు కాదురా."

వెంకటేశు మాట్లాడలేదు.

"ఎంకటేశూ ! నీకు డబ్బు అక్కర్లేదా?"

'కావాలి !'

ఐనా, వెంకటేశు మాట్లాడలేదు.

"ఆకలితోమాడి సత్తానంటావా ? సెప్పు ? "

'అమ్మో ! సావను,' వణకిపోయాడు.

"ఎంకటేశూ ! నీకేం బయ్యంలేదూ. నేను అన్నీ నేర్పిత్తా. కడుపునిండా తినొచ్చు. సక్కటిగుడ్డ లేసోకోవచ్చు. సినిమాలుకూడా సూడొచ్చు... ఏటి సినిమాలు సూడవా ?"

వెంకటేశులో ఆశ చిగురుస్తోంది.

"కానీ, ఒక్క ఇసయం. నేను ఇద్దె నేర్పిందానికి నువ్వు, నీకొచ్చినదాన్లో నాకు వాటా ఇవ్వాలి. ఎక్కువ ఇవ్వొద్దులే. సెప్తావద."

"ఎక్కడికి ?"

"మన కార్కానాకి. అక్కడ నీ లాంటోళ్ళు ఇంకా శానామందున్నారు. సూద్దువుగాని రా."

గురువులు రెండు మూడు సందులు తిరిగి ఒక పెంకుటింటి ముందు ఆగి —

"ఇదే మనిల్లు" అంటూ లోపలికి నడిచాడు.

లోపల పెద్దహాలు. హాలునిండా రకరకాల పిల్లలున్నారు. దాదాపు పాతికమందివుంటారు. వెంకటేశు వాళ్ళవేపు ఆశ్చర్యంగా చూశాడు.

"ఎంకటేశూ ! ఈ పిల్లలంతా నీలాటోళ్ళే" అని వాళ్ళవేపు తిరిగి – "మీకో కొత్త నేస్తం వచ్చాడురా" అన్నాడు గురువులు.

వాళ్ళందరూ గురువులు దగ్గరకొచ్చి చుట్టూ మూగారు.

"ఒరేయ్ ! ఇయ్యాల ఎవరికి ఏఏటి దొరికాయ్ ?" అడిగాడు గురువులు.

అందరూ తాము తెచ్చినవి చూపించసాగారు.

వాళ్ళు తెచ్చినవాటిల్లో కొంత తను తీసుకుని మిగిలింది వాళ్ళకిచ్చేసి —

"తిండి తిన్నార్రా" అన్నాడు.

కొందరు తిన్నామంటే, మరికొందరు లేదన్నారు.

"సరే. ఇంకపొండి."

వెంకటేశుకిదంతా అద్భుతంగా వుంది.

"ఎంకటేశూ ! ఈరోజుకిది వుంచుకో," అంటూ జేబులోంచి ఐదురూపాయల నోటు తీసి వెంకటేశు చేతిలోపెట్టాడు. వెంకటేశు మొదట తీసుకోవడానికి సంశయించాడు. కానీ, ఇంటి దగ్గర జ్వరంతో మూలుగుతూ పడుకున్న తండ్రి, ఆకలితో సొమ్మసిల్లిపోయిన పిల్లలూ జ్ఞాపకం రాగానే ఆ నోటు అందుకున్నాడు.

"రేపు పొద్దున్నే ఈడకిరా" అన్నాడు గురువులు.

"అలాగే" అని తలూపాడు వెంకటేశు.

గురువులు వెంకటేశు భుజంమీద చెయ్యివేసి —

"ఎంకటేశూ ! నన్ను నమ్ముకో నీకంతా మంచి జరుగుద్ది" అన్నాడు ఆప్యాయంగా.

అతని అభిమానానికి చలించిపోయాడు.

'అయ్య కూడా ఎప్పుడూ ఇంత బాగా మాట్లాడలేదు' అనుకున్నాడు.

"రేప్పొద్దున్న తప్పకుండా వొత్తా !" అన్నాడు. అంతకు మించి తన కృతజ్ఞత ఎలా చెప్పుకోవాలో తెలియలేదు.

గురువులు నవ్వాడు.

వెంకటేశు బయటకు వచ్చి ఇంటిదారి పట్టాడు. ఇంటికి వచ్చాక అనిపించింది —

'తను దొంగతనాలు సేస్తున్నాడని అయ్యకీ, అమ్మకీ తెలుత్తుందేమో ?- ఎలా ?

మర్నాడు వెంకటేశు వెళ్ళగానే అదే ప్రశ్న గురువుల్ని అడిగాడు.

ఆ మాటకి గురువులు పెద్దగా నవ్వాడు. నవ్వి — "మీ అయ్యకి తెలిసినా ఏమనడు రా. అమ్మయినా అయ్యయినా అందరికీ డబ్బు కావాలి. ఆకలి ముందు నీతులూ, నీమాలూ, పేమలూ అన్నీ బలాదూర్ తమ్ముడూ. నువ్వు డబ్బులివ్వు. మీ అయ్య మాటెడితే అప్పుడడుగు" అన్నాడు.

వెంకటేశు మాట్లాకుండా గురువుల్ని చూస్తుండిపోయాడు.

"సూడు ఎంకటేశూ ! నీకేం బయ్యం లేదు. నేనున్నాను. ముందు అట్టానే వుంటుంది. పోనుపోను దీన్లోవున్న మజా నీకే తెలుత్తుంది."

గురువులు అట్లా చెప్తుంటే వెంకటేశు మారు మాట్లాడలేకపోయాడు. అదీగాక, ఇప్పుడు మళ్ళీ ఆకలేస్తోంది. నిన్న గురువులిచ్చిన ఐదు రూపాయలు ఐదు క్షణాల్లో అయిపోయాయి !

తండ్రికి జ్వరం తగ్గలేదు.

ఇప్పుడు మళ్ళీ డబ్బులు కావాలి.

అంటే, గురువులు చెప్పిన మార్గం తప్ప ఇంకోదారి లేదు !

వెంకటేశు చిన్న మనస్సు అన్నీ ఆలోచిస్తోంది.

మౌనంగా నిలబడ్డ వెంకటేశుని చూసి గురువులు నవ్వుతూ —

"రా." అంటూ తన గదిలోకి తీసుకెళ్లాడు.

* * *

అప్పుడే వీధిదీపాలు వెలిగాయి.

కాలువగట్టునవున్న గుడిసెల్లోని మానె దీపాలు మినుకు మినుకుమంటున్నాయి.

వెంకటేశు కాలువగట్టున నడుస్తున్నాడు.

గురువులుతో పరిచయం రెండు నెలలవుతోంది. ఈ రెండు నెలల్లోనే వెంకటేశులో చాలా మార్పు వచ్చింది.

కళ్లల్లో కాంతి, శరీరంలో నిగారింపు వచ్చాయి. ఎర్ర చొక్కా, నీలం లాగూ వేసుకున్నాడు. రెండు చేతుల్నీ జేబులో పెట్టుకుని తీవిగా నడుస్తున్నాడు. జేబులో కొత్త ఇరవై రూపాయలనోట్లు రెండు గర గరలాడుతున్నాయి.

'ఈ రోజు యాభై రూపాయలు సంపాదించాడు, గురువులు వాటా పది రూపాయలు పోను నలభై రూపాయలు మిగిలాయి. ఈ మధ్య డబ్బులు బాగా దొరుకుతున్నాయి. గురువులు నేర్పిన పద్ధతులు చాలా బాగున్నాయి. డబ్బు సంపాదించడం ఇంత తేలికా అనిపిస్తోంది. నిజంగా గురువులు దేవుడు. ఆకలితో చావకుండా తనని రక్షించాడు. అంతేకాదు, తను కోరింది తింటున్నాడు. సినిమాలు చూస్తున్నాడు. ఇంట్లో బియ్యానికీ, కూరలకీ, తండ్రి తాగుడికీ డబ్బునిస్తున్నాడు. ఇలా సంపాదించి కొన్నాళ్ళకి తనో పెద్ద ఇల్లు కొంటాడు. అమ్మకీ, తమ్ముళ్ళకీ, చెల్లెళ్ళకీ ఖరీదైన బట్టలు కొంటాడు. తమ్ముళ్ళని బాగా చదివిస్తాడు. అక్కకి పెళ్ళి చేస్తాడు.' ఆలోచించుకుంటూ ఇంటికొచ్చాడు వెంకటేశు.

వీరయ్య గుడిసెముందు నులకమంచంమీద పడుకుని పాటలు పాడుతున్నాడు !

'అయ్య బాగా తాగొచ్చినట్టున్నాడు' అనుకొంటూ తడిక తీసుకుని లోపలికెళ్ళాడు.

ఎల్లమ్మ అప్పుడే స్నానం చేసి కొడుకుకొన్న కొత్తచీర కట్టుకుని, తల దువ్వుకుని పూలు పెట్టుకుంది.

వెంకటేశు చుట్టూ చూసి పిల్లలెవరూ కనపడకపోవడంతో—

"అమ్మా! ఈళ్ళంతా ఏరే?" అనడిగాడు.

"నీలి సినిమాకు తీస్కపోయింది. కూసేపట్లో వత్తారుగానీ నువ్వురా అన్నంఎడ్తా"

"వొద్దే అమ్మా. ఇప్పుడే చపాతీ తిన్నా."

"పర్లేదు. నీకిట్టవని చేపల పులుసొండా. రెండు ముద్దలు తిందువుగానిరా" బ్రతిమలాడింది ఎల్లమ్మ.

చేపల పులుసనగానే వెంకటేశుకి నోరూరింది, కాదనలేకపోయాడు.

ఎల్లమ్మ అన్నం వడ్డిస్తే తిని, చెయ్యి కడుక్కుని తన జేబులోంచి నలభై రూపాయలు తీసి తల్లికిచ్చేడు వెంకటేశు.

ఆ డబ్బు చూడగానే ఎల్లమ్మ ముఖం వికసించింది. "రేపు నీలికి వోణీ కొంటారా అబ్బీ" అంది.


"వూ. నీ ఇట్టం" అని వెంకటేశు నులకమంచం తీసుకుని దొడ్లో వేపచెట్టు కింద వేసుకుని పడుకున్నాడు.


రెండు నెలల క్రితం మొదటి సారిగా గురువులు సహాయంతో వెంకటేశు పదిరూపాయలు సంపాదించి తల్లి చేతిలో పుంచినప్పుడు—


"ఎక్కడివిరా ?" అనడిగింది ఎంతో ఆశ్చర్యంతో.

"సంపాయిచ్చానే."

"ఏం పని సేసావు ?







ఆ ప్రశ్నకి వెంకటేశు విసుక్కుంటూ— "ఏదో పనిలే" అన్నాడు.

ఎల్లమ్మ ఇక తర్కించలేదు. ఆక్షణంలో ఆ పదిరూపాయలు పెద్ద నిధిలా అన్పించింది ఎల్లమ్మకు. ఆ డబ్బుతో ఇంట్లోకి నూకలూ, వీరయ్యకి మందులూ తెప్పించింది.

ఆ తర్వాత కూడా వెంకటేశు రోజూ పది, ఇరవై ఒక్కోరోజు యాభై కూడా తీసుకొచ్చి తల్లికిచ్చేవాడు!

ఓరోజు ఎల్లమ్మ, వీరయ్యతో—

"ఎంకటేశు రోజూ ఎంతెంత డబ్బు తెత్తున్నాడో సూశావా? ఏం పనంటే చెప్పడంలేదు" అంది.

"ఆ ఏదో పనిలేవే. ఆ ఇవరాలన్నీ నీ కెందుకు? ఆడుతెత్తున్నాడు. మనం హాయిగా తింటున్నాం. పిచ్చిదానా! ఈ పెపంచకంలో డబ్బుముక్కెవే. అవ్వెట్టొచ్చినా పర్లేదు. మన ఎంకటేశు బంగారమే. మనందర్నీ కూసోపెట్టి పోసిస్తున్నాడు." అన్నాడు ఆనందంగా వీరయ్య.

కొడుకు డబ్బు తీసుకొచ్చియిస్తూవుండడం ఎల్లమ్మక్కూడా సంతోషంగానే వుంది!

"ఇదిగో, నువ్వు వాడిని పెస్నలేసి ఇసిగించమాకు. ఆడికి కోపమొత్తే డబ్బులియ్యడు"

భర్త చెప్పింది నిజమేననిపించింది.

వీరయ్య ఇప్పుడు రిక్షాతొక్కడం మానేశాడు. వెంకటేశు రోజూ రూపాయో, రెండో చేతిలో పెడుతున్నాడు. దాన్తో పీకలదాకా సారా తాగడం, అన్నంతినడం, హాయిగా పడుకోవడం.'

అప్పుడప్పుడూ అనుకుంటాడు—

'ఇన్నాళ్ళూ ఆ పాడురిచ్చా లాగిలాగి పానాలు పోతుండేవి. ఎండలో చెమటలు కక్కుకుంటూ తొక్కేవాణ్ణి. ఇప్పుడా బాధలేదు. హాయిగావుంది. ఆ పాడురిచ్చాముఖం ఇక ఈ జన్మలో సూడను!' అని.

* * *

ఆరు నెలలు గడిచాయి.

ఓ రోజు —.

నీ తి లే ని క థ

సాయంత్రం ఆరు గంటలవేళ— వీరయ్యా, ఎల్లమ్మా మ్యాట్నీ సినిమా చూసి నడుస్తూ వస్తున్నారు.

ఇద్దరి మనస్సుల్లోనూ వెంకటేశు మెదల్తున్నాడు.

'ఇయ్యాల ఎంకటేశు మంచి సుట్ట కొని తెత్తానన్నాడు. ఇంటికెల్లగానే కూడు తిని, బయట నులకమంచంమీద పడుకుని సుట్ట తాగుతుంటే నా సామిరంగా సొరగమే కనిపిత్తుంది.' అనుకుంటూ ఆనందపడుతున్నాడు వీరయ్య.

'ఎంకటేశు ఇయ్యాల మిఠాయి తెచ్చిత్తానన్నాడు. తొరగా ఇంటికెల్లాలి.' అని అనుకుంటోంది ఎల్లమ్మ.

ఇద్దరూ హుషారుగా నడుస్తున్నారు. సందుదాటి బజారురోడ్డు మీదికి రాగానే అక్కడ పెద్ద గుంపు కనపడింది.

'ఏందబ్బా!' అనుకుంటూ కుతూహలంగా ఇద్దరూ ఆ గుంపులో చొరబడ్డారు.

ఆ గుంపు మధ్య వెంకటేశు తలొంచుకుని నిలబడి వున్నాడు!

ఒక పోలీసు వెంకటేశు చేతులకు బేడీలు వేస్తున్నాడు. చుట్టూవున్న జనం వెంకటేశుని తిట్టిపోస్తున్నారు. అది చూసిన వీరయ్య చటుక్కున ఎల్లమ్మ చేతిని పట్టుకుని ఆ గుంపు లోంచి బయటపడి పక్క సందులోకి వెళ్ళిపోయాడు.

"ఏందయ్యా ఇట్టా లాక్కొచ్చావ్?" అంది ఎల్లమ్మ తన చేతిని విడిపించుకుంటూ.

"ఏందేవిటే? ఇంకూస్సేపు మనం అక్కడుంటే ఎంత పెమాదం జరిగేదో తెలుసా?"

"పెమాదమా? ఏంటయ్యా?"

"ఎంకటేశుని పోలీసోళ్ళు పట్టికెడుతున్నారు సూశావా?"

"అవును ఎందుకు బేడీలేశారు?" ఆత్రంగా అడిగింది.

"ఎందుకేవిటే ఎర్రిమొహమా? ఆడు జేబు దొంగతనం సేసాడు. జనం తిట్టడంలా?"

ఎల్లమ్మ ముఖం తెల్లగా అయింది.

కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి!

"ఆడిని ఇడిపించవయ్యా."

"ఇంకా నయంలే. మనం సెప్తే ఇడిసిపెడ్తారా? శిచ్చ పూర్తయ్యాల ఇడిసిపెట్టాల. మనం ఆడి అమ్మా, అయ్యా అని తెలిత్తే మనల్ని కూడా ఆ పోలీసోళ్ళు పట్టుకుపోతారు."

ఆ మాట వినడంతోనే ఎల్లమ్మకి దుఃఖంతో పాటుగా భయం కూడా కలిగింది!

"నిజంగానా!"

"అవునే. అందుకే, తొందరగా ఇంటికి నడు." అన్నాడు వీరయ్య.

ఇద్దరూ ఇంటి కొచ్చారు.

అప్పటికే పిల్లలు అన్నం తిని పడుకున్నారు.

వీరయ్య కూడా అన్నం తిని బయట నులక మంచం వేసుకుని కూర్చున్నాడు.

చేతులు లేని డ్రైవర్లకు కార్లు!

కాళ్ళు, పాదాలు, భుజాలు ఉపయోగించి నడపగల కార్లను జపానులో తయారు చేశారు. థాలిడేమైడ్ వలన వికలాంగులైన వారికోసం, ఇతర వికలాంగుల కోసం ఇవి తయారుచేశారు. ఈ కార్ల తలుపులకు బయటి నుండి లోపల నుండి పాదాలతో తెరవ వచ్చు. స్టీరింగ్‌ను ఎడమ పాదంతో నిర్వహిస్తారు. ఎక్కువభాగం స్విచ్‌లు తలుపుకు లోపలవైపు అమర్చబడినాయి. వీటిని భుజాలతో ఉపయోగించవచ్చు. ఇంతవరకు ఒక కాలు, లేక ఒక చేయి లేని వారు, చక్రాల కుర్చీ ఉపయోగించే వారు మాత్రమే నడుపగల కార్లు వచ్చాయి. ఈ కొత్త కార్లను ఇటీవలే మార్కెట్లో విడుదల చేశారు.

తిరుపతిని తెలుగువారు వదులుకుంటారా ?

అనాది కాలం నుంచీ తెలుగువారికి తిరుపతి వేంకటేశ్వర స్వామి ఆరాధ్య దైవం. శ్రీవెంకటేశ్వరుని గుడికి వెళ్లే కాలిబాట వేయించినది ఆది శంకరాచార్యులని కొందరి అభిప్రాయం. భాషాభేషజాలు మనుషుల మనస్సులను మలినం చేసేవరకూ వేంకటేశ్వర స్వామి దేవాలయం వున్న తిరుమల — తిరుపతి ఏ భాషా ప్రాంతానికి చెందినదన్న రాజకీయ మీమాంసరాలేదు. ఆ క్షేత్రంలోని పూజారులు స్మార్తులు. ఒకరిద్దరు శుద్ధగై వెలనాటి వైదికులుకూడా వున్నారు. ఇప్పుడు ప్రస్తావన ఎందుకు చేయవలసినదంటే తిరుత్తణికి ఏర్పడిన ప్రమాదమే తిరుమల — తిరుపతికి కూడా యేర్పడే సూచనలు విజ్ఞులకి కనిపించు తున్నాయి.

(1) దేవస్థానం ఉద్యోగులలో ఎక్కువ మంది తెలుగువారే అయినా తమిళం మాట్లాడడం యీ విలేఖరి ఇటీవల గమనించాడు.

(2) యాత్రికుల సౌకర్యానికి అటనట వ్రాయించిన సూచనలు తమిళంలో వున్నాయి. తెలుగును సంపూర్తిగా నిర్లక్ష్యం ఇంతవరకూ చేయలేదు.

(3) ఇక కళ్యాణం. పూజా విధానాలలో తమిళ పద్ధతే వ్యక్తమవుతున్నది. సంకల్పం చేయించేటప్పుడు, మంగళసూత్రధారణ జరిగే వరకూ భూదేవి, శ్రీదేవిలనుస్వామి వారికి కుడి ప్రక్కన ఉంచుతున్నారు. ఇది స్మార్త విధానమా ? తమిళ వివాహ తంతులో ఇదొకటి కాదా ?

(4) ఆ తర్వాత అలివేలు మంగ, నాంచారమ్మ అనే దేవతలకు బదులు భూదేవి, శ్రీదేవి అని ఎలా వచ్చారు ? ఏ పురాణంలో ఈ పేరులున్నాయి. శ్రీ వేంకటేశ్వరుని పేరు శ్రీనివాసుడుగా ఎలా మారిందీ ? శాస్త్రం సంగతి అలా వుంచినా కొన్ని శతాబ్దాలుగా తెలుగువారి ఇలవేల్పుగా విలసిల్లుతూ వచ్చిన శ్రీ వేంకటేశ్వరస్వామిని తమిళ సోదరులకు ధారాదత్తం చేసే ఎత్తులో ఇప్పుడు ఆ క్షేత్రంలో కనిపించేవన్నీ ఒక భాగమా అని సందేహించడం తప్పవుతుందా ?

చిత్తూరు జిల్లా ద్విభాషా ప్రాంతమే కాదు కన్నడిగులు కూడా వున్నారు. ఆ జిల్లాలో తమిళ రాజకీయకులు కుండబద్దలు కొట్టినట్లు ఒక ప్రకటన అలవోకగా చేసి తమ అనుచరులను పరోక్షంగా ప్రోత్సహించి తిరుపతిలో తమిళభాషా ప్రాబల్యాన్ని అధికం చేస్తూండగా, కన్నడిగులు చూస్తూ వూరు కోవడం లేదు, వారు కూడా మరొక వైపు నుంచి కొన్ని ఎత్తులు వేస్తున్న సూచనలున్నాయి.

అన్ని విధాలా, ఎప్పుడూ నష్టపడ్డమే తెలుగువారి ప్రత్యేకత కాబోలు. ఆఖరుకు ధర్మసత్రంలో ఒక గది కావాలన్నా తమిళంలో మాట్లాడితే సులభంగా లభించుతుంది. బస్సులలో కండక్టర్‌లలో ఎక్కువ మంది తమిళం మాట్లాడుతున్నారు. దేవుడి పూజా విధానం పూర్తిగా తమిళ పద్ధతిలోకి మారింది. రాజకీయవాదుల కళ్ళు తిరుపతి వెంకన్న మీద ఎందుకు పడినయ్యో వేరే చెప్పడం అవసరమా ?

— వి. ఎస్. అవధాని

ఎల్లమ్మ వచ్చి మంచం దగ్గరగా క్రింద కూర్చుని — "ఆడిని ఎప్పటికి ఇడుత్తారో" అంది దిగులుగా.

వీరయ్య మాట్లాడలేదు.

వీరయ్య రోజూ ఈ పాటికి రెండు మూడు గ్లాసుల సారా తాగేవాడు. కానీ, ఈ రోజు ఇంకా తాగలేదు. దానిక్కారణం జేబులో డబ్బులు లేక పోవడమే. వెంకటేశు సాయంత్రం అయ్యేసరికి మూడు నాలుగు రూపాయలు చేతిలో పెట్టేవాడు.

ఈ రోజు డబ్బుల్లేవు.

సారా లేదు.

చాలా చిరాగ్గా వుంది.

ఎల్లమ్మ ఆవలిస్తూ లేచి —

"ఇక రేపట్నుంచీ నువ్వు రిచ్చాలాగాలయ్యో. నేకపోతే మళ్ళీ మనకు కూడుండదు." అని లోపల కెళ్ళిపోయింది.

భార్య మాటలు వీరయ్యకి మనసులో గునపాలు దింపినట్లయింది !

తను మళ్లా రిచ్చా లాగాలా ?

తనవల్లకాదు. ఎండలో రిచ్చా లాగుతుంటే తన పానాలు పోతాయి. అదీగాక, తనిక రిచ్చా తొక్కనని అందరితో సెప్పాడు. ఇప్పుడు రిచ్చా తొక్కితే తనకెంత సిన్నతనం ? సిన్నతనమేమరి ? మరయితే తిండెలా ? సారా ఎలా ? రేపటికి తిండి సంగతి దేవుడెరుగు. ముందు తనకిప్పుడు సారా కావాలి. నాలుక చిమచిమలాడుతోంది. నరాలు తిమ్మిర్లెక్కిపోతున్నాయి ! సారా చుక్క గొంతులో పడకపోతే పానాలు నిలిచేట్టులేవు. ఇప్పుడేం సెయ్యాలి ?

వీరయ్య కూర్చోలేకపోయాడు. లేచి తడిక తోసుకుని లోపలకొచ్చాడు. ఒక మూలగా గుడ్డి దీపం వెలుగుతోంది. అందరూ చాపమీద పడుకుని నిద్రపోతున్నారు.

ఇప్పుడు తక్షణం సారా త్రాగడానికి డబ్బులు కావాలి ! ఇంట్లో అమ్మే వస్తువు ఏదైనా వుంటుందేమోనని చుట్టూ చూశాడు. ఏమీ కనబడలేదు.

ఇంతలో, అతని చూపులు ఒకచోట నిలిచి పోయాయి. అక్కడ ఒక మూలగా పదహారేళ్ళ నీలి నిద్రపోతోంది.

గుడ్డిదీపపు కాంతిలో నీలి — అప్పుడే వికసిస్తున్న పువ్వులా, పక్వానికొస్తున్న పండులా లేతగా, అందంగా కనిపిస్తోంది.

అతని మనస్సులో ఏవేవో ఆలోచనలు.

నీలినే పరీక్షగా చూస్తున్న వీరయ్యకి ఆ పిల్ల తన రక్తాన్ని పంచుకుపుట్టిన కూతురిలా అనిపించడంలేదు.

తన సారాకి, తన తిండికీ డబ్బు సంపాదించే బొమ్మలా కనిపించింది.

'తనిక రిచ్చా ఎయ్యనక్కర్లేదు. తిండికీ, సారాకీ కొదవుండదు. కష్టపడకుండా సొరగ సుఖాలు అనుభవించొచ్చు' అని అనుకున్నాడు.

చప్పుడు కాకుండా తడిక దగ్గరకు లాగి ఆనందంగా బయటకొచ్చాడు వీరయ్య

బయట చలిగా వుంది.

దాంతోపాటుగా గాలి విపరీతంగా వీస్తోంది.

ఆ గాలికి ఎదురుగా వున్న నేరేడుచెట్టు ఏ క్షణంలోనైనా విరిగిపోవడానికి సిద్ధంగా వున్నట్టుగా వుంది !

ఆకాశంలో నక్షత్రాలు ఎప్పుడో కునుకు తీశాయి. ఒక నల్లని మేఘం చంద్రుడ్ని కప్పేయడంవల్ల అంతా చీకటిగా వుంది !

ఆ చీకటిలోనే వీరయ్య వడివడిగా నడుస్తున్నాడు— డబ్బుగల బాబులకు కూతురు 'నీలి'ని అమ్మడానికి !

ఎక్కడో దూరాన పిడుగుపడిన ఘర్జనవల్ల నిద్రపోతున్న నీలి వులిక్కిపడి తల్లిని గట్టిగా కౌగలించుకుని మరీ పడుకుంది.

ఆ చీకటిలో వీరయ్య ఇంకా నడుస్తూనే వున్నాడు ! ★

సీరియల్

మూగ ముత్యాలు

యలమంచిలి ఝాన్సీలక్ష్మి

(గత సంచిక తరువాయి)

ఆ రాత్రి సారధి అక్కడే వుండిపోయాడు.

తెల్లవారుఝామున సోమయాజులుగారి పిలుపుతో మెలకువ వచ్చింది.

ఆయన వణికిపోతున్నారు. కళ్ళెర్రబడి పోయాయి.

సారధి నుదుటిపైన చేయిపెట్టి చూశాడు! జ్వరం మండిపోతోందని గమనించాడు.

''బాబూ! విజయకి కబురుచేయి!'' అతి కష్టంమీద మాట్లాడగలిగారాయన.

''కంగారుపడకండి తాతయ్యా! ఈ జ్వరం మిమ్మల్నేమీ చేయదు! నేను డాక్టర్ని పిలుచుకువస్తాను!''

అతడు పనిమనిషిని తీసుకుని వెళ్ళి డాక్టర్ని పిలిచాడు. అతడు వచ్చి పట్నం తీసుకువెళ్ళమన్నాడు వెంటనే.

సోమయాజులుగారు ఏవో మందులు చెప్పబోయారు. కానీ సారధి వారించి, డాక్టరుగారి సాయంతో జీపు సంపాదించి హైదరాబాదుకి తీసుకువెళ్ళాడు.

ఓ ప్రైవేటు నర్సింగ్‌హోమ్‌లో జాయిన్ చేశాడు. ఆ డాక్టరు చెప్పింది విన్న సారధి నోట మాటే రాలేదు.

''ఈయనకి పక్షవాతం వచ్చే సూచనలు కన్పిస్తున్నాయి! లేకపోతే బ్లడ్ ప్రెషర్ పెరిగి ప్రాణాపాయమైనా వస్తుంది! వారికి కావలసిన వాళ్ళని రమ్మని కబురంపండి! పెద్ద వయస్సు! ఏమీ చెప్పలేం!''

సోమయాజులుగారింకా వణికిపోతూనే వున్నారు. విజయ హైదరాబాదులోనే చెల్లెలు రాజ్యంతోబాటు వున్నదని చెప్పారాయన.

సారధి అడ్రసు తెలుసుకుని వెళ్ళాడు వెంటనే.

విజయ నింతవరకతడు చూడలేదు. అతని మనస్సుని ఆ పేరే సమ్మోహితుణ్ణి చేస్తోంది!

''ఈ విజయ నన్నిలా బంధించి వేస్తోందేమిటి?! నన్ను చూసి మండిపడుతుంది! నిప్పులు విసిరేస్తాయామె కళ్ళు! అయినా నాక్కోపం రాదే!'' ఆ వూహలతోనే తలుపు తట్టాడతడు.

''ఎవరూ?'' అంటూ విజయే తలుపు తీసింది. ఇంకా తెల్లవారలేదు పూర్తిగా. విజయ కళ్ళపైన నిదుర తూలిపోతోందింకా! విడీ విడని పూరేకుల్లా వున్నాయామె కన్నులు! -రేగిన జుట్టు మరింత అందాన్ని తెచ్చి పెట్టిందామెకు.

సారధి గుండెల్లో చెప్పరానంత సందడి! ఆనందం! వుద్వేగం! తీయని వూహలు!

అన్నీ కలిసి అతణ్ణి వివశుణ్ణిచేసి వేశాయి. ముగ్ధుడై చూస్తూండి పోయాడామెను.

''ఎవరు మీరు... ఏం కావాలి?'' సారధి గభాలున గుర్తుకు రాలేదామెకు. అందుకే కనుబొమలు ముడిచి విసుగ్గా ప్రశ్నించింది.

''నేను... సారధిని!''

''ఎవరూ!? ఓహో! తమరా?'' ఆమె కనురెప్పల పైన వాలివున్న నిద్రమత్తు క్షణంలో మాయమైపోయిందా పేరు వినగానే.

గభాలున తలుపులు మూసివేయబోయింది. సారధి వద్దని చెప్పబోతూ ఆమె చేతినందుకున్నాడు. అతనికి తెలియనే లేదలా ఎందుకు చేశాడో!

''తాతయ్య హాస్పిటల్లో వున్నారు! నిన్ను... మిమ్మల్ని తీసుకురమ్మన్నారు!''

విజయ అతని చేతివైపు చూసింది తీక్షణంగా! వెంటనే వదిలేశాడతడు.

''మీకెలా తెలుసు? రాజ్యం! లే! తొందరగా! తాతయ్యకి... కులాసాగా లేదట!'' ఆమె ఆందోళనతో చెల్లెల్ని లేపింది. అతడిని ''కూర్చోండి!'' అని మాత్రం అన్నది: అతడు చెప్పబోతూన్న సంగతుల్ని వినమని రాజ్యానికి చెప్పింది. సారధి వేములపల్లి వెళ్ళాడని విని కళ్ళెత్తి చూసిందతని వైపు. ''తాతయ్యకీమధ్య మతిబోతోంది!'' సారధిని రమ్మని వ్రాయడం నచ్చలేదని ఆమె వ్యాఖ్యానం విప్పిచెప్పిందతనికి.

హాస్పిటలుకి వెళ్ళేవరకు ఏమీ మాట్లాడలేదామె.

''తాతయ్యా!'' విజయ పిలుపు విని కళ్ళు తెరిచారాయన.

''అయిపోయిందమ్మా యీ తాతయ్య పని'' ఆయన కళ్ళల్లో అశ్రుబిందువులు.

''ఈ కాలూ, యీ చేయీ నావిగాదమ్మా యిక! ఆ భగవంతుడు నన్నింకా యీ నరకంలోనే వుంచదలుచుకున్నాడమ్మా!''

విజయ కళ్ళు వత్తుకుంది! ఆ వయస్సులో పక్షవాతం ఆయన్నెంతగా బాధిస్తుందో ఆమె కర్థమైంది!

విజయ గుండెల్లో దిగులు పేరుకుపోయిందాయనస్థితిని చూడగానే.

''ఈ తాతయ్య లేకపోతే మేమేమైపోతాం! నా చదువెలాసాగుతుంది? తాతయ్యని పల్లెటూళ్ళో ఎలా వదిలి రాగలనిక! రాజ్యం డాక్టరవగలదా?'' ఆమె మనస్సులోని దిగులు దుఃఖమై బయటికి ప్రవహిస్తోంది. చెక్కిళ్ళు పూర్తిగా తడిసిపోయాయి.

''బ్రతికి నీకు బరువైపోయాను తల్లీ! అదే నా బాధ! నాకింతకన్నా మరణం మేలు...''

''తాతయ్యా! నిన్ను చూసుకుని అమ్మలేక

జరిగిన కథ — 5: సోమయాజులుగారి మనుమరాళ్లు విజయ, రాజ్యలక్ష్మి. సారధితో విజయ పెళ్లి ఆగిపోయింది. సోమయాజులుగారు ఇచ్చిన డబ్బులో 5 వేలు తక్కువగా సారధి సోమయాజులుగారికి తెచ్చి ఇస్తాడు. అతని ప్రవర్తనకు ముగ్ధులయ్యారు సోమయాజులుగారు. సారధి విజయ, రాజ్యలక్ష్మిల బాధ్యతను స్వీకరిస్తాడు. సోమయాజులగారిచ్చిన డబ్బుతో తన కూతురు సీత పెళ్లి చేస్తుంది అరుంధతమ్మ. తన వైవాహిక జీవితం సుఖంగా లేదని సారధి చెల్లెలు సీత అతనికి ఉత్తరం రాస్తుంది. సారధి తన స్వంత చెల్లెలు శశిరేఖను సన్మార్గంలో పెట్టుటకు ప్రయత్నిస్తుంటాడు. శశిరేఖ, సారధి ఒకరికొకరు తమ జీవితానుభవాల్ని చెప్పుకుంటారు. రెండు మూడు రోజులు ఇంటికి రాని శశిరేఖ కోసం ఆమె ఆఫీసుకు వెళుతాడు సారధి. శ్రీనివాస్ అనే ఆఫీసర్‌తో కలిసి శశిరేఖ ఢిల్లీ వెళ్లిందని తెలుసుకొని క్రుంగిపోతాడు. ఆమె రావ్ అనే అతనికి తనను గురించి వ్రాసిన ఉత్తరం చదువుతాడు. ఢిల్లీ వెళ్లిన శశిరేఖ తిరిగి వస్తుంది. సలీం, సారధి, శశిరేఖ, ఆషా కలసి సలీం కారులో సినిమాకు వెళుతారు. సలీంకు సారధిపట్లగల ఆరాధనను మనస్సులోనే మెచ్చుకొంటుంది శశిరేఖ. సారధి, శశిరేఖ సినిమానుంచి కారులో వెళ్లగా, సలీం ఆషాను టాక్సీలో వాళ్లింటి దగ్గర దింపి వెళుతాడు. సారధి శశిరేఖతో విసిగి ఆమెను వదిలేసి సీత దగ్గరకు వెళుతాడు. సీత భర్త శ్రీనివాస్ అని తెలుసుకుంటాడు. శశిరేఖను చూడాలంటుంది సీత. తను విజయకు తగనని సోమయాజులుగారితో అంటాడు సారధి. మనిషికి మనస్సు ముఖ్యం కానీ, కులం ప్రధానం కాదని చెపుతాడు సోమయాజులు.

పోయివా బ్రతుకుతున్నాం! నువ్వీమాట మరోసారి అంటే నా గుండెలు పగిలిపోతాయేమో !'' విజయకి దుఃఖం యింకా చల్లారలేదు.

సోమయాజులుగారు నీళ్ళు నిండిన కళ్ళతో విజయని దగ్గరకు తీసుకుని తల నిమురుతూండి పోయారు.

''మనిషి ఎంతటి మూర్ఖుడో చూశావామ్మా ! శాశ్వతంగాని ఈ శరీరానికేమైనా వ్యాధి సోకితే ఎంతగా విలవిలలాడిపోతాడో !'' ఆయన తనమతాను ఓదార్చుకుంటున్నారనిపించిందామెకు.

ఆ తరువాత డాక్టరు నడిగిందామె.

''తాతయ్యకేమీ ప్రమాదం లేదుగదా !'' అని.

''సారధిగారు త్వరగా తీసుకురావడంవలన ప్రాణాపాయం తప్పిందమ్మా ! ఇక యీ వయస్సులో ఆ పక్షవాతం ఆయన్ని బాధ పెడుతుంది !'' అన్నారు డాక్టరుగారు.


విజయకి సారధి పేరు వినడమే యిష్టం లేనట్లు కళ్ళు క్రిందికి వాల్చుకుంది.

అక్కడే నిలబడివున్న సారధి గమనించి బయటికి వెళ్ళిపోయాడు.

''ఈ మనిషిని చూస్తేనే నేనెందుకిలా కోపంతో దహించుకుపోతున్నాను ? ఎందుకు క్షమించలేకపోతోంది ఈతడిని నా మనస్సు ? !'' ఆమె మనస్సునే ప్రశ్నించింది.

''ఓ పది పదిహేను రోజులుండాలమ్మా యింకా హాస్పిటల్లో ! ఇంద ! ఈ అయిదు వందలూ వుంచు ! పళ్ళూ అవీ తీసుకువస్తాన వెళ్ళి ! ఏం కావలసినా నాకు ఫోను చెయ్యి మా యింటి గలవారికి ఫోనుంది !'' అ రాజ్యానికి ఫోను నంబరిచ్చాడు సారధి.

రాజ్యానికి మనస్సులో అతనిపట్ల వున్న కోపం కరిగిపోయింది. తాతగారి అవస్థ ఆమెను క్రుంగదీసిందెంతగానో ! ఆ ఆపదలో దేవుడిలా ఆదుకున్న సారధి ఆమెకి ఆత్మ



దృశ్యం

"కిటికీలోంచి .
కళ్ళు
చూపుల్ని వీస్తున్నాయి బయటికి
నల్లబడిన ఆకాశం ఒంటినిండా
చుక్కలు, ఎర్రగా కందిన దద్దుర్లల్లా
వెన్నెల జరీచీర కొంగును సవరించుకొంటూ
ఒయ్యారంగా చంద్రకాంత
పర్వత కన్య శిరస్సున అందంగా
వేలాడుతున్న పాపిడి బిళ్ళలా జలపాతం
సముద్ర క్రీడ స్థలిలో
'కవాతు' చేస్తున్న సైనికుల్లా కెరటాలు
చెట్లు... కొమ్మ కొమ్మలో, పువ్వు పువ్వులో
ఎద ఎదలో గుబాళిస్తూ... నిశ్శబ్ద రాగాలు
ప్రకృతి చిత్రపటాన్ని తిలకిస్తూ
మనసు అంతర్లీనమై, రసార్ద్రమై... "

— అవనిగడ్డ సూర్యప్రకాష్

బంధువులా కన్పించాడా క్షణంలో! లోలోన పెరిగిపోతూన్న భయం అతడిని చూసి నెమ్మదిగా కరిగిపోతున్నట్లన్పించింది.

"ఈయనే లేకపోతే ఆ పల్లెటూళ్ళో తాతయ్య ఏమైపోయేవాడో!" ఆ వూహే ఆమెని నిలువెల్లా వణికించింది.

"రాజ్యం! మనకివ్వవలసిన పైకంలో లెక్క కడ్తామని చెప్పు! మనికింకా రావలసి వుంది! తొందరగా యివ్వమను! నేను బజారుకి వెళ్తున్నాను! పళ్ళు తీసుకువస్తాను!" ఆమె సారధి మాటలు విన్నదని తెలిసిపోయింది రాజ్యానికి.

రాజ్యం కళ్ళల్లో నిస్సహాయత చూసి నవ్వాడతడు.

"నా మనస్సు మహామొండిది! ఇలాంటి కోపతాపాలు దాన్నేమీ చేయలేవమ్మా! నాకు తాతయ్య ఆరోగ్యం ముఖ్యం! దిగులుపడకు! తాతయ్య నన్ను కాదనరు!"

సారధి ఓదార్చాడామెని మృదువుగా.

ఆ సాయంత్రమే సలీమ్‌ని కూడా తీసుకు వచ్చాడతడు.

"తాతయ్యా! సలీమ్ అని చెప్పాను చూడండి! వీడే! మిమ్మల్ని చూడాలని వచ్చాడు!"

"అలాగా! కూర్చోనాయనా! మా స్నేహంలో నీకూ భాగం కావాలన్న మాట! ఈ సారధి నాలోని దుఃఖాన్ని సంహరించే ఆయుధం లాంటి వాడయ్యా! నేను ముసలివాణ్ణి! ఇతడు యౌవ్వనశోభతో మెరిసిపోతున్నవాడు! అయినా ప్రాణస్నేహితులమయిపోయాం!"

మూగ ముత్యాలు

సోమయాజులుగారు నవ్వారు సన్నగా.

సలీమ్ నమస్కరిస్తూంటే వారించా రాయన.

"వద్దు నాయనా! నేనంత గొప్పవాణ్ణి గాదు! అందుకు సాక్ష్యంగా యీ పక్షవాతం కన్పిస్తోంది గదా!"

"తాతయ్యా! వీడి పేరు సలీమ్! మీ ... మంత్ర..."

సారధిని మాట్లాడనీయలేదాయన.

"నీ అనుమానానికి ఆధారమేలేదు సారధీ! మంత్రాలు చెప్పకోవడమంటే ఏమిటనుకున్నా వయ్యా! అదో తపస్సు! కానీ తపస్సులో అనేక రకాలున్నాయి!

"అనుద్వేగకరం వాక్యం సత్యం
ప్రియహితం చయత్
స్వాధ్యాయాభ్యసనం చైవ వాఙ్మయం
తపవుచ్యతే!"

ఏ మనిషికీ దుఃఖాన్నీ భయాన్నీ కలుగ చేయని మనస్సుని నొప్పించని మాటల్ని చెప్పడమే ఓ వేదమంత్రం నాయనా! ఎదుటివారి మనస్సుకి ప్రియంగా వుండే వాక్యాన్ని అదీ సత్యం సుమా పలికినా తపస్సే! ప్రణవాది మంత్రాల్ని జపించడం, వేదాల్ని పఠించడం కూడా తపస్సే బాబూ! నీ స్నేహితుడు నాకు చేసిన అపకారం ఏమీ లేనపుడు యితని మనస్సుని నే నెలా నొప్పించనయ్యా! ఇది కూడా ఓ మంత్ర మనీ, తపస్సనీ తెలిసినపుడు అంత మూర్ఖుణ్ణి కాలేను నాయనా! ఇతని కులమూ, గోత్రమూ నా జప తపాదులకి అడ్డంగా రావు సారధీ!"

సారధి సంతృప్తిగా నిశ్వసించాడు.

"తాతయ్యా! ఈ మాట మీరు సారధికి మరోసారి చెప్పండి! నా మనస్సుని వీడెంతగా నొప్పించాడో మీకు చెప్పలేను! స్నేహంతో కూడా సాయాన్ని కోరనంటాడు!" సలీమ్ నిష్ఠూరంగా అన్నాడు.

"వీడి మేడల్లో నేనుంటే నాలో బద్ధకం పెరుగుతుంది తాతయ్యా! వీడి కార్లో తిరుగు తూంటే నాలో వున్న ఆత్మవిశ్వాసం, అభిమానం యిట్టే మాయమైపోతాయి! అపుడా స్నేహం నన్ను శాసిస్తుంది! ఆ సుఖాల కలవాటు పడిన నా ప్రాణం నన్నో బానిసని చేసి వేస్తుంది! అందుకే కాదన్నాను తాతయ్యా!"

"స్నేహాన్ని స్నేహంగానే వుండనివ్వాలయ్యా సలీమ్! సారధి అలా 'అభిమానధనంతో' బతుకుతున్నాడుగనుకనే నీ మనస్సింతగా అతని స్నేహాన్ని కోరుకుంటోంది!" సోమయాజులు గారు సారధినే సమర్థించారు.

సలీమ్ మాట్లాడలేకపోయాడాపైన.

ఆ తరువాత సోమయాజులుగారు సలీమ్ కుటుంబాన్ని గూర్చి ప్రశ్నించాడు.

"వీడి జీవితం వడ్డించిన విస్తరి తాతయ్యా! వజ్రాల వ్యాపారంలో లక్షలు గడించారు వీళ్ళ నాన్నగారు. ఆ పైన అయిన వాళ్ళల్లోనే ఆషా అని ఓ అమ్మాయి వీడికోసం కలలుగంటోంది! వాళ్ళన్నగారు అమెరికాలో చదువుకుంటున్నాడు. అతను రాగానే పెళ్ళి! వీడు మహా అదృష్టవంతుడు!" అన్నాడు సారధి.

"మంచిది నాయనా! ఎవరి అదృష్టం వారిది!"

"తాతయ్యా! విజయ వచ్చింది! వెళ్తాం మరి! కోపంతో చిందులేస్తుంది లేకపోతే!" సారధి నవ్వుతూ లేచి నిలబడ్డాడు.

ఆయనా నవ్వారు. సలీమ్ సారధి నడిగాడు.

"ఒరేయ్! నన్నుకూడా తిట్టిపోస్తుం దేమో! నేనూ నీలాంటి చెడ్డవాణ్ణనుకుని!"

"నేను చెడ్డవాణ్ణటరా? ఏమైనా కాస్త నిషాలో వున్నావేమిటి? కొంపదీసి!"

"నేను నీ స్నేహం నిషాలోవున్నానురా! నువ్వు... ఎవరి నిషాలోవున్నావో మరి!"

సలీమ్ అర్థవంతంగా నవ్వాడు.

"డబ్బుతెచ్చారా?" అంతలో విజయ ఎదురుగా వచ్చి సారధి నడిగింది.

అతడు ఆమెవైపే చూస్తూ 'లేదు! ఓ నెల తరువాత యిస్తాను!' అన్నాడు.

"వడ్డీతో సహా యివ్వవలసి వస్తుందని గుర్తుంచుకోండి!"

"ఎంత యివ్వాలో చెబుతారా దయచేసి?!" సలీమ్ అడిగాడు. సారధి వారిస్తున్నా విన్పించుకో లేదతడు.

"అయిదువేల రూపాయలు!"

"ఇదిగో! తీసుకోండి! వీడినింతవరకూ మీలాగా నిర్దయంగా నిలబెట్టి చిత్తు చిత్తుగా

ఓడించినవాళ్ళెవరూ లేరు ! అందుకు మీకు కంగ్రాచ్యులేషన్స్ !'' గంభీరంగా చెబుతూన్న సలీమ్‌ని చూసి పెదవులపై చిరునవ్వు మెరిసింది. కానీ ఆ చిరునవ్వు శోభతో మరింత అందాన్ని అద్దుకున్న ఆమె ముఖాన్ని చూడకుండా తల వంచుకుంది క్షణంలో.

సలీమ్ అయిదువేలకి చెక్కుని రాసి ఆమె చేతిలో వుంచుతూ అన్నాడు—''సరిగ్గా చూడండి! వీడు మళ్ళీ మీకివ్వలేదంటాడు! మళ్ళీ మీ దగ్గరికి లాక్కురావాల్సి వస్తుంది !''

విజయ యీసారి ముఖాన మెరిసిన నవ్వుని దాచుకోలేకపోయింది.

''ఆ పని మాత్రం చేయకండి !'' అని వెళ్ళిపోయిందామె.

''పరిహాసాలతో జయించలేవు గాని పదరా!'' సారధి ముందుకు నడిచాడు.

''మరి దేనితో జయించుతావురా ?''

''నాకంత ఆశ లేదురా !''

''మరెందుకలా తన్మయుడివై పోయావ్ పాపం ఆమెని చూడగానే ! ఒంట్లో ఏమైనా జబ్బుగాని ప్రవేశించలేదు గదా ?'' సలీమ్ భయాన్ని నటించాడు.

''కొందరలా మనుష్యుల్ని మంత్రించి వేస్తారు రా!''

మనస్సులోని రహస్యాన్ని విప్పి చెప్పకుండా వుండలేకపోయాడు స్నేహితునితో.

''మరి నువ్వేం చేస్తున్నావురా ?'' సలీమ్ ప్రశ్నించాడు.

''నిశ్శబ్దంగా నా మనస్సుకి నచ్చజెబుతున్నాను రా ! కొన్ని అనుబంధాల్ని దూరంగా వుండి ఆరాధించాలి తప్ప చేరువగా వెళ్ళలేము రా! ఆ పైన నేనామెని ఘోరాతి ఘోరంగా అవమానించాను ! జరగబోతూన్న వివాహాన్ని ఆపివేశాను! అందుక్కారణం నేను... రజియా కొడుకునని ఆమెకు తెలియదు ! అమ్మని... దేవతాలా కొలిచే నా మనస్సు... విజయ ఏవైనా ప్రశ్నలు వేస్తే— అవి అమ్మని అవమానపరచేవయితే నేను భరించ లేను. అలా అని నిజాన్ని దాచి విజయ ముందు నాటకమూ ఆడలేను! శశిరేఖనిలా ఒంటరిగా వదిలి వేసి నా సుఖాన్ని నేను వెదుక్కోలేనురా ! విజయ నా జీతంలోకి రావాలనుకున్నా అరుంధతమ్మగారు అంగీకరించదు. అమ్మ గురించీ, శశిరేఖ గురించీ ఆ పల్లెటూళ్ళోవున్న ప్రతి మనిషికీ చెప్పి వస్తుంది ! అప్పుడు విజయ ఆ ఆచారాల్నీ, కుల భేదాల్నీ కాదని నన్ను చేరుకోలేదు ! అంతధైర్యం ఓ ఆడపిల్లకి వుంటే యీ సంఘం కుళ్ళికుళ్ళి ఏడుస్తుంది!''

సారధి గుండెల్లోని బాధనంతా విప్పి చెప్పుకున్నాడు.

''తాతయ్యా విజయని శాసించలేరా ?''

''ఆయన విజయని ప్రేమిస్తున్నారురా ! శాసించడం ప్రేమలో వుండదు ! ఆపైన రాజ్యం భవిష్యత్తుంది ! ఆయనా ఏమీ చేయలేక తహతహలాడి పోతున్నారు విజయకోసం ! నేను చేసిన దానికి శిక్షగా, ఆ అక్కా చెల్లెళ్ళ భవిష్యత్తుకి ఓ అండగా నిలబడాలని నిశ్చయించుకున్నానురా ! విజయకి నేనంటే యిష్టంవున్నా లేకపోయినా భయపడదలచుకోలేదు !''

సలీమ్ గుండెల్లోని స్నేహం విలవిలలాడి పోయింది మిత్రుని నిస్సహాయ స్థితిని చూసి.

''నేను విజయనడుగుతానురా !'' ఆశతో అన్నాడు సలీమ్.

''మళ్ళీ నీ ముఖం చూడదు !''

''ఇప్పుడే పరుగెత్తడంలేదురా ఫూల్ ! తాతయ్యతో స్నేహాన్ని పెంచుకుంటూనే విజయతో కూడా ఓ అనుబంధాన్ని పెంచుకుంటాను ! ఆ తరువాత వున్నదంతా చెప్పి ఆమె నడుగుతాను. ''విజయా ! నీకు ధైర్యం ఎక్కువని విన్నాను ! ఆత్మ విశ్వాసమూ అభిమానమూ గలదానివని తెలిసింది! ఓ మంచివాణ్ణి నీ జీవిత భాగస్వామిగా ఎన్నుకోడానికి నీకు భయమా ?'' అని అడుగుతాను.''

''బాబూ ! ఇదేమీ వుపన్యాసవేదికగాదు ! రోడ్డుమీద నడుస్తున్నాం ! నీ స్నేహం చాలా గొప్పది. దానికి జోహార్లు ! కానీ మన చుట్టూ ఎన్నెన్ని ఎత్తయిన గోడలున్నాయో కాస్త చూడు! ఆ తరువాత ఉద్రేకాన్ని పెంచుకో ఓపికవుంటే!''

సారధి హెచ్చరించాడు స్నేహితుణ్ణి.

సారధి యిల్లు చేరుకునేసరికి సీత నిలబడి వుంది గేటు దగ్గర —

''సీతా ! ఎప్పుడొచ్చావమ్మా ? ఒరేయ్ ! చెల్లాయిరా !'' సలీమ్‌కి పరిచయం జేశాడతడు.

''నువ్వు నాకు ముందే తెలుసమ్మా ! నువ్వు నేను వూహించుకున్నట్లే వున్నావు.''

సలీమ్ మాటల కామె ఆశ్చర్యపోయింది —

''సారధి మాటలతోనే నిన్ను నాకు చూపించాడమ్మా !''

''అన్నయ్యలాంటి పిచ్చివాళ్ళు మరొకరున్నారని విన్నానుగానీ చూడలేదు ! ఇప్పుడు మిమ్మల్ని...''

''నో ! అదేం కుదరదు ! నేను పిచ్చివాణ్ణి ! 'మీరు' అంటే పిచ్చిలో కరుస్తానేమోనని భయంగా వుంది ! కనుక మళ్ళీ అనకు !'' సీతకి నవ్వాగలేదా మాటలకి.


''ఇంత సంతోషాన్ని పంచుకోడానికి, అన్నయ్యకీ నాకూ సాధ్యంగాదు. నువ్వుకూడా వుండన్నయ్యా ! అయితే ఓ షరతు ! ఒక్కసారే నువ్వు అన్ని మెట్లూ దిగి 'నువ్వు' అన్న బంధంలోకి వచ్చావు గనుక యీ రోజు నా చేతి వంట రుచి చూడక తప్పదు !''

''నువ్వు నిజంగా నాకు చెల్లెలివయి పుట్ట వలసిందమ్మా ? ఈ పిసినారి కెలా చెల్లెలివయ్యావో నా కర్మం గావడంలేదు ! కనీసం మర్యాదకయినా భోజనాని కాహ్వానించడు !''

సారధి బట్టలు మార్చుకుంటూ నవ్వాడు.

''వాడో బకాసురుడు ! జాగ్రత్త ! స్వీటూ, హాటూ, ఎన్ని చేసినా స్వాహా చేసేస్తాడు ! మరీ రుచిగా వండకు ! మనకి రవ్వంతకూడా మిగల నీయడు !'' అన్నాడు నవ్వాపుకుంటూ.

''మద్రాసు ప్రయాణం మానుకున్నా నమ్మా వీడు భోజనానికి పిలుస్తాడేమోనని ! నువ్వొచ్చావు గనుక నోరు మూసుకున్నాడు ! లేకపోతే 'మళ్ళీ రేపు' అనేవాడు !''





"మీ యిద్దరూ మాటలతో యుద్ధం చేస్తూండండి! నేను వంటముగిస్తానంతలో!" సీత వంటింట్లోకి వెళ్ళిపోయింది.

"శశిరేఖ వుండవలసింది!" సలీమ్ ఆ మాట ఎందుకన్నాడో సారథి కర్థమైంది.

"సీతనిజూసి మారిపోయేదవా నీ వుద్దేశ్యం?"

"ఏమనేదో మరి! వంటింట్లోకి మనిద్దర్నీ త్రోసి గడియపెట్టి సీతని తీసుకుని హాయిగా షికార్లు కెళ్ళేదేమో!"

"బెంగుళూరు వెళ్ళిందట! రేపు వస్తుందని తెలిసింది!"

సారథి ముఖానమెరుస్తున్న ఆనందం యిట్టే మాయమైపోయిందా మాటలు వింటూంటే.

"శ్రీనివాస్‌కూడా వెళ్ళాడా?"

"హుష్! అరవకు! నెమ్మదిగా చెప్పరా! సీత వింటుంది!"

"ఏం? వినకూడదా?"

"శ్రీనివాస్ .. సీత... భర్త!" సారథికి గొంతు పెగలడమే కష్టమైపోయింది!

"ఏమిటీ!! శ్రీనివాస్!... ఓ మై గాడ్! ఎంత అన్యాయం జరిగిపోయింది!" సలీమ్‌లోని వుత్సాహమంతా కరిగిపోయింది.

"రేఖకి చెప్పకే సంగతి!"

"ఆ అమ్మాయిని జైల్లో వేయించరా! కాస్త మనశ్శాంతి లభిస్తుంది నీకూ నాకూ!"

సలీమ్ కోపాన్ని పట్టలేకపోయాడు.

"అప్పుడు నా చెల్లెలుగాకుండా పోతుందా?"

"మరేం చేస్తావురా? ఇంత స్వేచ్ఛనెలా భరిస్తున్నావురా?"

"నా అన్నవాళ్ళు లేక యిలా తయారయ్యిందిరా! నెమ్మదిగా మార్చాలి యిలాంటివాళ్ళని! మరింత ఎదురుతిరుగుతారు!"

ఆ రాత్రి ముగ్గురూ శ్రీనివాస్, శశిరేఖల ప్రసక్తి రాకుండా జాగ్రత్తపడ్డారు. సీత పొరపాటునకూడా అతని పేరెత్తలేదు. కానీ ఆమెకంతా తెలిసిపోయిందని వాడిపోయిన ఆమె ముఖమే చెబుతోంది. సారథి, సలీమ్ చెప్పే కబుర్లు కూడా వినలేకపోయాడు. ఆ మరునాడు శశిరేఖ వచ్చింది. సీతని చూసి నిలబడిపోయింది.

సీత యిట్టే గుర్తించిందామెని, ఫోటోలో చూసింది గనుక –

"నేను సీతని! బహుశా అన్నయ్య నీకు చెప్పలేదేమో!"

ఎంత ప్రయత్నించినా సీత మనస్సులో యీర్ష్య లేచిపడుతూనే వుంది – అందుకే లోనికిరమ్మని మనఃస్ఫూర్తిగా అనలేకపోయింది.

శశిరేఖ మౌనంగా లోపలికి నడిచింది.

"శ్రీనివాస్ ... గారు ... రాలేదా?" సీత వద్దనుకుంటూనే ప్రశ్నించింది. ఆమె గుండెల్లో యీర్ష్యతోపాటు అవమానం!

"ఈ శశిరేఖ పాటి అందం నాలో లేదా?! ఆయనకీమెలో ... కన్పించిన ఆకర్షణేమిటి?" ఆమె మనస్సు విరుచుకుపడింది.

"అతను నీకెలా తెలుసు?" శశిరేఖ కనుబొమలు ముడిచి అడిగింది.

"అన్నయ్య...చెప్పాడు!"

"ఐసీ! నా గురించి అందరికీ కథల్లి చెబుతున్నాడన్నమాట మీ అన్నగారు! ఎంత డబ్బు గావాలో అడుగు పాపం! కష్టాల్లో వున్నాడనుకుంటాము!"

"నిజమే! మీ అండ చూసుకునే బ్రతుకుతున్నాడు వాడు! కాస్త శ్రీనివాస్‌గారినడిగి ఓ పది వేలిలాపారేస్తే సంతోషిస్తాడు! డబ్బంటే వాడికి మహాప్రాణం! డబ్బు కోసమే వెయ్యగూడని వేషాలు వేస్తున్నాడు! చేయరాని స్నేహాలు చేస్తున్నాడు!"

ఇటీవల విజయవాడలో జరిగిన శ్రీ కె. భాగ్యరాజ్ అభినందన సభలో శ్రీ పి. ప్రభాస్ నవయుగ ఫిలింస్ తరఫున శ్రీ భాగ్యరాజ్, శ్రీమతి ప్రవీణాభాగ్యరాజ్‌లకి షీల్డుని అందజేస్తున్న దృశ్యం.



సీత పరోక్షంగా శశిరేఖని విమర్శించింది. కానీ రేఖకి పూర్తిగా అర్థంగాలేదు.

"పాపం! నువ్వు బ్రాహ్మణ దేవతవనుకుంటానే! ఈ యింట్లో పచ్చిగంగ కూడా ముట్టకు! కులం పోతుంది!"

"కులంపోయినా బ్రతకవచ్చు! కానీ దాన్ని మించినవి చాలా వున్నాయి! వాటిని పోగొట్టుకుంటే బ్రతకలేను నేను!"

"నువ్వు నాటకాల్లో నటిస్తావా?"

"ఏం? బావుండలేదా నేను?! అందంగా లేనంటావా?"

"నిన్ను శ్రీనివాస్‌కి చూపించాలి! విరగబడి నవ్వుతాడు!"

"ఎందుకో? అతనికేమైనా పిచ్చా?" సీత మనస్సులో దుఃఖం విరుచుకుపడుతోంది.

"అంత పొడుగు జడెందుకూ? గుర్రం తోకలా! కట్ చేయించుకోరాదూ?"

"వున్న జుట్టుని కత్తిరించుకుంటే మా వూళ్ళో మేకపోతులంటారు! మేకపోతులక్కూడా పొట్టి జుట్టుంది! బహుశా నువ్వు చూడలేదేమో! పట్నంలో పెరిగిన వాళ్ళకి అలాంటివి చూసే తైముండదు పాపం!"

"బ్రూట్స్! ఐహేట్ దెమ్! నా కసహ్యం అందుకే మీ పల్లెటూళ్ళంటే!"

"నిన్ను చూస్తే మా వూరివాళ్ళిక అన్నం నీళ్ళా ముట్టుకోరు! మా వూళ్ళో పాంట్లూ, షర్టులూ మగపిల్లలు వేసుకుంటారు! గభాలున నిన్ను చూస్తే మగవాడే అనుకుంటారు. నాక్కూడా ముచ్చట వేసింది నిన్నీ డ్రెస్‌లో చూడగానే!" సీత కోపాన్ని అణిచి పెట్టింది శశిరేఖ వైఖరిని గమనించి.

"నీకు చీరలంటే యిష్టమా?"

"అంత పెద్దగా లేదనుకో! అయినా తప్పదుగా! మా అత్తగారు పాంటు వేసుకుంటే యింట్లో నుంచి గెంటేస్తుంది!"

"పూర్‌క్రీచర్! పోన్లే! నావి చాలా వున్నాయి! కావలిస్తే వేసుకో!"

"అన్నయ్యకి యిష్టం వుంటుందో లేదో!"

"మధ్యన ఆయనెవరు, మీ యిష్టాన్ని కాదనడానికి!"

"ఎంతయినా నాకంటే పెద్దవాడు గదా పాపం!"


"నాకలాంటి భయాలేమీ లేవు!" శశిరేఖ నిస్సంకోచంగా చెప్పివేసింది.

"స్వంత అన్నయ్యేమీ కాదనుకో! పల్లెటూరి దాన్ని గదూ! కాస్త భయంగా వుంటుంది ఒళ్ళంతా కప్పే యీ పాడుచీరని విసిరేయాలంటే!"

శశిరేఖ జాగ్రత్తగా వింది మాటల్ని!

"వ్యంగ్యంగా మాట్లాడ్డం మీ పల్లెటూరి వాళ్ళకి బాగా అలవాటనుకుంటానే!"

శశిరేఖ యీసారి కోపం తెచ్చుకోలేదు.



మీ స్నానమునందు ఒక క్రొత్తదనము నిచ్చు
సబ్బు- ప్రేమ్
క్రొత్త
సుకుమారమైన మీ చర్మ సౌందర్యమునకు ప్రేమ్.
దీని పరిమళము స్వచ్ఛమైన నురగ మీ శరీరమును
ఆహ్లాదింపజేయును
మీ శరీరమునకు మృదుత్వమునిచ్చు సబ్బు-ప్రేమ్.
Imageads-M-1564
NEW
Prem
REFRESHING SOAP
PREM
జయలక్ష్మి
గుంటూరు వారి తయారీ
ప్రేమ్ - తాజాతనము నందించు సబ్బు.

సిత తనని రెచ్చగొడుతోందని గ్రహించింది. ఎందుకో ఆమె కర్థంకాలేదు.

''నేను నీ అంత తెలివైనదాన్ని గాదుమరి! అది సరేగానీ ఆ శ్రీనివాస్‌గారికీ నీకూ...... స్నేహమేనా ? పెళ్ళిదాకా వెళ్ళిందా ?''

''ఏమిటి ? వున్నట్టుండి శ్రీనివాస్‌మీదికి దూకావ్?! అతను నీకేమైనా కావలసినవాడా ? పెళ్ళి చేసుకోడం నాకు నచ్చదు ! కానీ శ్రీనివాస్ నా పూజారే ! నా కనుసైగ చాలు అతడికి ! అంత వెర్రి ఆకర్షణ నేనంటే ! ఇప్పటికి నా కోసం వేలు ఖర్చు పెట్టాడు !''

''మరి... అతనితోనే ఉండవచ్చు గదా !''

''అలా రాత్రింబవళ్ళు కలిసి వుంటే ప్రేమ నిషా దిగి పిచ్చెక్కిపోతుంది! అసహ్యం వేస్తుంది! అందుకే మీలా పెళ్ళాడిన భార్యాభర్తలు శత్రువుల్లా పోట్లాడుకుంటారు కొన్నాళ్ళ పోయాక ! నా యింట్లో నే వుంటాను ! అతని యింట్లో అతనుంటాడు ! ఆ దూరం ప్రేమని చావనీయదు ! ఓ నాలుగు రోజులు కలిసి వుండి ఆ తరువాత విడిపోవాలి ! అపుడు తనకి నా విలువ తెలిసి వస్తుంది !''

సీతకి నవ్వాలో ఏడవాలో తెలియకుండా పోయింది ఆమె మాటలు విన్న తరువాత.

''కానీ శ్రీనివాస్ గారికీ సిద్ధాంతం నచ్చుతుందో లేదో అడిగావా ?''

''నా మాటని అతను కాదనలేడు !''

''ఆయనపైన నీకంత నమ్మకమా ! ఆయన... అన్నయ్యలాంటివాడా ?''

''కాదు ! ఇంత పిరికివాడు కాదు !''

''నీకెలా తెలుసు ?''

''అతనికి పెళ్ళయింది ! కాలేదని నిర్భయంగా చెప్పాడు! ఏదీ మీ అన్నయ్యనలాచెప్పమను ధైర్యంగా !''

శశిరేఖ నవ్వింది పెద్దగా. సీత గుండెల్లో వణుకు పట్టుకుంది.

''పెళ్ళయిందా ? నీకెలా తెలుసు ? పాపం

మూగ ముత్యాలు

ఆయన భార్య ఎవరో ?'' సీతకి ఈర్ష్యతో, కోపంతో మతి పోతోంది.

''ఎవరో మరి ! అయినా భార్య సంగతి నాకెందుకు ? అతను నావాడు ! అది చాలు !''

సీతకి శశిరేఖపైన జాలివేసిందీసారి.

అంతలో సారధి వచ్చాడు.

రేఖ లేచి వెళ్ళబోయింది. అతడు పిలిచాడు.

''శ్రీనివాస్ దగ్గరకెళ్ళానమ్మా! అతనికి..''

''పెళ్ళయింది ! అదేగా నువ్వు చెప్పబోయేది ! ఆ సంగతి నాకు ముందే తెలుసు !'' రేఖ విసురుగా జవాబిచ్చింది.

''మరి... అతనితో... స్నేహం... చేయడంలో యింకా అర్థం మేముంది రేఖా ? విన్నతడు పెళ్ళాడలేడు !''

''పెళ్ళాడమని నేనతని కాళ్ళమీద పడదల్చుకోలేదు.''

''మరి అతను మోసంజేస్తే !''

''అతనో నేనో జైల్లో వుంటాం !'' శశిరేఖ అదేమంత పెద్ద విషయం కాదన్నట్టు తేల్చిపారవేసింది.

''ఎందుకలా జీవితాన్ని తేలిగ్గా తీసుకుంటావ్? నీక్కావలసిందేమిటో నీకే తెలియదు రేఖా ! నా మాట వినమ్మా ! ఆ శ్రీనివాస్‌ని మించినవాణ్ణి తీసుకువస్తాను ! హాయిగా పెళ్ళిజేసుకుని......''

''స్టుపిడ్ ! మిస్టర్ సారధీ ! నాకు తెలిసినంతగా నీకు తెలియదు ! ముందా విషయం తెలుసుకో ! జీవితాన్ని అనుభవించ వంరాని మూర్ఖులతో వాదించడం నాదే పొరపాటు ! నాక్కావలసింది డబ్బు, హోదా, సుఖం ! నీతులూ నియమాలూ కావు! ఒక్క పెళ్ళితోనే జీవితంలో సుఖశాంతులు లభిస్తాయంటున్నావు! మరి యీ ప్రపంచంలో చెలరేగుతూన్న అశాంతికి, అవినీతికి కారణం ఏమిటి ? డబ్బు ! హోదా ! పదవి ! అవన్నీ వున్న శ్రీనివాస్‌ని వదులుకోలేను నేను!'' శశిరేఖ మాటల్ని వింటూంటే సారధికి కోపం ఆగలేదు.

''నీకు నేను బ్రతికి వుండడం యిష్టం లేదా ?''

''లేదు ! లేదంటే ఛస్తావా ?! నేను బ్రతికి వుండడం నీ కిష్టంలేదేమో బహుశా ! కానీ నేనంత తేలిగ్గా చావను ! సారధిగారూ ! నేను బ్రతుకుతున్నది నాకోసం ! మీలాగా ఎవరి కోసమో బ్రతుకుతున్నట్లు నటించడం నాకు రాదు !'' శశిరేఖ నిర్భయంగా తన విశ్వాసాన్ని వెల్లడించింది.

''ఆషని చూశావుగదా ! కాబోయే భర్త సలీమ్‌తోనే ఒంటరిగా వెళ్ళదెవ్వడూ !'' సారధి కోపాన్ని దిగమ్రింగి చెప్పాడు.

శశిరేఖ కళ్ళల్లో గిర్రున నీరు తిరిగింది. సారధి కర్థంకాలేదా కన్నీటిలో మెరిసిన బాధ !

''నీలాంటి పిరికివాళ్ళు అన్నలైనపుడు అంత ధైర్యం ఆ అమ్మాయి కెలా వస్తుంది ?''

''అది పిరికితనం గాదమ్మా !''

''నన్ను 'అమ్మా' అనవద్దని నీకెన్నోసార్లు చెప్పాను !''

''చెల్లెల్ని 'అమ్మా' అంటే పాపమంటావా ?''


''మహాపాపం ! నీవలా పిలుస్తుంటే నాకు భయం వేస్తుంది ! ఏడుపొస్తుంది ! మరో మేకవన్నె పులి వలలో చిక్కుకున్నానని వణికి పోతాను !''


సారధికి నోటమాటే రాలేదాపైన.

''నన్నెందుకిలా దూరం చేసుకుంటోందీ పిచ్చిపిల్ల ? ఆ మనస్సులో 'బాంధవ్యం' అన్న అక్షరాలే లేవా ?! ఎందుకిలా నన్నింతగా అసహ్యించుకుంటోంది ?'' సారధి విచారంగా అక్కడనుంచి వెళ్ళిపోయాడు.

సీత నిట్టూరుస్తూ వంటింట్లోకి వెళ్ళింది.

(ఇంకా వుంది)





ప్రశ్నావళి

కె. రామలక్ష్మి

పి. ఆర్. ఎస్. — ఇల్లెందు

అక్కా ! పబ్లిసిటీ చేయాలంటే సినీ తారల చేతనే చేయిస్తారు. వారికంటే అందంగా యింకెవరూ వుండరనా ?

★ వుండరని కాదు. ఉన్నా వాళ్లిలా పబ్లిసిటీకి రారు. అందుకే లుంగీలనుంచి, బీడీల నుంచి, బ్లేడ్లనుంచి, మగాళ్ల చెడ్డీలదాకా పబ్లిసిటీ ఆడబొమ్మలచేత చేయిస్తారు !!

వై. వి. టి. — హైదరాబాదు

భావి పౌరులకు, బావి పౌరులకు తేడా ఏమిటి ?

★ ఒక్క ఒత్తే !

వి.ఎస్. — ఇచ్ఛాపురం

నేను మనస్ఫూర్తిగా ఆరాధించిన దేవుడు దూరమైతే — నేనేం చేయాలి ? నా దేవుని పొందుకోరుటకు నేనేమైనా చేస్తాను...

★ తప్పు. దేవుణ్ణే ఆరాధించు, పొందు కోరకు కాంపిటీషన్ ఎక్కువ.

ఎ. పి. ఎస్. — కిళ్లపట్ల

ఎక్కువగా చదివితే కళ్లకు ప్రమాదమా ?

★ కాదు. కాని చదివే పద్ధతినిపట్టి వుంటుంది ప్రమాదం. కంటికి మరీ దగ్గిరగానో, మరీ దూరంగానో పుస్తకం పెట్టుకోవడం, సరైన వెలుగు లేకుండా కష్టపడి చూసి చదవడం — లాంటి అలవాట్లు సరిచేసుకోవాలి.

ఎమ్. వి. కె. — ఉరవకొండ

కొందరు మనసు విప్పి మాట్లాడుతారు. దేనికోసం ?

★ ఎదుటివారు నిజమైన స్నేహితులని తలచి అలా చేస్తారు. యింకే లాభం ఆశించి కాదు. కాని చాలామంది అలాంటివారిని క్రేక్స్ కింద జమకట్టి ఆడిస్తారు. అందుకే స్నేహితు లెవరో ముందు తెల్సుకోవాలి.

ఎమ్ వి ఆర్. — ఖమ్మం

నేటి యువతీ యువకుల ప్రేమ వివాహాలపై పెద్దవాళ్ళు పెడుతున్న అడ్డుగోడలపై మీ అభిప్రాయం ?

★ పెద్దవాళ్ల నటువదలండి. యీ యువతీ యువకులకు ఏమైంది ? అడ్డుగోడలు దాటలేనంత అమాయకులై ప్రేమించుకున్నారా? బాధ్యతలు, భవిష్యత్తులో తలెత్తగల సమస్యలు ఎదుర్కోగలమన్న నమ్మకంలేని ప్రేమికులే — పెద్దలని అడ్డుగోడలు అనుకుంటారు.

ఎమ్.ఎమ్.బి — ఏలూరు

సముద్రానికి అలలు, జీవితానికి కలలు ఎందుకు వస్తాయి ?

★ ప్రకృతి సహజం కనుకనే — తప్పదు.

డి. ఎల్. — కొడాలి

స్త్రీల కంటే పురుషుల్లో 80% ముందు చనిపోతున్నారు. కారణం స్త్రీల కంటే పురుషులు పెద్దవారగుటవల్ల నంటారా ? అలాంటప్పుడు భర్తలు భార్యల కంటే చిన్నవారైతే — భార్యలు పసుపుకుంకుమలతో ముందే వెళ్లిపోవచ్చును కదా ?

★ పసుపు కుంకుమలతో భార్యలు వెళ్లి పోవడం అలావుంచండి — ఏ భార్యకీ భర్త వుండడు. కాటికి కాలుచాచిన ముసలాడికి సహితం పడుచు పెళ్లాం కావాలి ! బతికున్న పెళ్లాం కాదు. పసుపు కుంకుమలతో దాటిపోవాలను కునేది కాదు !

కె.ఎస్.ఆర్. — గుంటూరు

సంతోషమే 'సగం బలం' అంటారు లేదా, పూర్తిగా బలం రావాలంటే ఏం చెయ్యాలి ?

★ ఎదుటివాడికి సంతోషం లేకుండా చెయ్యడమేకదా ? (కాదా ? !)

ఎస్. ఏ. — హిందుపురం

ఆడదానిగా పుట్టి కష్టాలు అనుభవించడం కన్నా వేరే ఏదైనా జన్మ ఎత్తడం మంచి దంటాను. మీరేమంటారు ?

★ ఆ జన్మలో వున్న ఎవరినైనా ముందు సంప్రదించి చూడడం మంచిదేమో ... ఆలోచించాలి.

ఎం. ఎస్. — కరీంనగరు

మీ దృష్టిలో ప్రేమించి పెళ్లి చేసు కోవడం గొప్పా ? పెళ్లిచేసుకొని ప్రేమించడం గొప్పా ?

★ పెళ్లి చేసుకున్నదాన్ని బాగా చూసు కోవడం రెండిటి కంటే గొప్ప.

బి. ఎస్. కె. — కాజీపేట

ఆత్మహత్య చేసుకొనేవారు మీ దృష్టిలో పిరికివారా ? ధైర్యవంతులా ?

★ చాలా స్వార్థపరులుగా తోస్తారు నాకు. తమదారి తాము చూసుకొని— మిగిలిన వాళ్లని ఎలాపోతేనాకేం ? అని వదిలేయడం స్వార్థమే కాదా ?


జి.వి.ఎస్. — విజయవాడ

శ్రీశ్రీ గురించి మీ అభిప్రాయం వినాలని వుంది.

★ క్షమించండి. చనిపోయిన శ్రీశ్రీ గురించి ఇకపై నేనేమీ మాట్లాడదల్చుకో లేదు. ★

ఇటీవల విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శ్రీ నటరాజ రామకృష్ణగారి పర్యవేక్షణలో 'ఆంధ్ర నాట్యం' నృత్య గురువు శ్రీమతి గౌరీకుమార్ నాట్య ప్రదర్శన జరిగింది ఆ సందర్భంగా శ్రీమతి గౌరీకుమార్ ఆచార్యులు డాక్టర్ నటరాజ రామకృష్ణను పుష్పకిరీటంతో సత్కరిస్తున్న దృశ్యం.





సరదాకి ప్రారంభిస్తే అలవాటుగా మారే ప్రమాదం ఉంది



వ్యసనంగా మారిన త్రాగుడు అలవాటు

అతిశీతల దేశాలలో మంచినీరు గూడా మంచు గడ్డయి త్రాగడానికి వీలుకాని సమయాలలో శరీరంలో ఉష్ణం కొరకై ప్రారంభమయిన మద్యపానం, నేడు అతి ఉష్ణదేశాలలో గూడా ఒక అలవాటుగా, వ్యసనంగా మారిపోయింది నేడది చివరికి ఒక 'కల్చర్'గా, నాగరికతకు చిహ్నంగా రూపాంతరం చెందింది. త్రాగనివాడు గూడా మనిషేనా అనే స్థాయికి గూడా చేరుకొన్నాం.

ఆదాయం కోసం


ప్రభుత్వాలే చివరికి మద్యపాన వ్యాపారాలు గూడా చేస్తున్నాయి. వందల కోట్ల ఆదాయాన్ని వదులుకోలేక మద్యపాన నిషేధం పేరే ఎత్తడం లేదు చివరికి కమ్యూనిస్టు చైనాలో సహితం ఆ దేశనిర్మాత మావో పేరుతో 'మావాతాయి' మద్యం బయలుదేరింది. ఏదయినా ఒక పరిమితిని మించనిదే ప్రమాదంలేదు. కొన్ని మందులలో గూడా మద్యం కలుపుతారు. కానీ పరిమితి మించి, ఒళ్ళు మరచి విపరీతంగా త్రాగితేనే సమస్యలు బయలుదేరుతున్నాయి.

త్రాగితే మనిషి నైజం బయటపడుతుందని చాలామంది నమ్మకం. మనిషికి త్రాగుడు అదనంగా ధైర్యం ఇస్తుందని, త్రాగితేగానీ అంతరంగిక దుష్టశక్తులు బయటపడి హత్యలు, కొట్లాటలు, దోపిడీలకు బయలుదేరడని ఒక దురభిప్రాయం బహుళ ప్రచారంలో ఉన్నది. త్రాగినవాడు తనను తాను మరచిపోయి నిజం చెప్తాడనుకొంటారు. గూండాయిజం, దోపిడీ, సమాజ వ్యతిరేక కార్యాకలాపాలకు త్రాగుడే ప్రోత్సాహిస్తుంది.

ధనవంతుల అలవాటు !

ధనవంతులలో ఎక్కువగా ఈ అలవాటున్నది. వారికిది దైనందినకృత్యం. వారు గెస్ట్‌హౌస్‌లలోనో, ఇళ్ళలోనో త్రాగుతుంటారు. అక్కడా వీలులేకపోతే బార్‌ల కెడుతుంటారు. మన ప్రాంతంలో ఆడవారిలో ఈ అలవాటు తక్కువే. ధనవంతుల కుటుంబాలలో కొందరు స్త్రీలకు త్రాగుడు పరిపాటే! ఇంట్లో ఆడవారికీ ఈ అలవాటు ఉంటే ఇక మగవారికి బార్‌లకు వెళ్ళవలసిన అవసరముండదు.

మన ప్రాంతంలో ఆడవారు బార్‌లకొచ్చి త్రాగడం చాలా తక్కువ. వ్యభిచారులు, క్యాబరే డ్యాన్సర్సు, విదేశాలలో స్థిరపడి సెలవులకి ఇక్కడకు వచ్చినవారు మాత్రమే బార్‌లకు వెడు



తుంటారు. విద్యార్థులలో, ఉద్యోగులలో కూడా ఈ అలవాటు బాగా ప్రాకిపోతున్నది. నేడు ఉద్యోగులలో అత్యధికులకు త్రాగుడు అలవాటున్నా ఒక వ్యసనంకాదు. వారిలో చాలా మంది ఇతరుల ఖర్చులతోనే త్రాగుతుంటారు. తమ వద్దకు ఆఫీస్‌పనులకై వచ్చిన వారి ఖర్చుతో సేవిస్తుంటారు.

మధ్యతరగతి మర్యాద !

మధ్యతరగతి కుటుంబాలు కొన్నింటిలో అతిథులొస్తే మద్యం ఇస్తారు. కొన్ని పల్లెల్లో కూడా మద్యం ఇవ్వడం అతిథిమర్యాదకు, తమ ఉన్నతికి చిహ్నంగా భావిస్తున్నారు. గుండెజబ్బు, లివర్ సిరోసిస్, అల్సర్ వంటి వ్యాధులున్నవారు త్రాగడం ప్రమాదకరం.

ఒక పరిమితిమేరకు త్రాగితే ఫరవాలేదు. ఆస్ట్రేలియావంటి కొన్ని విదేశాలలోని బార్‌లలో ఒక పరిమితికిమించి మద్యం సరఫరాచేయరు. అసలు త్రాగుడుపట్ల మన వారికి సరయిన పరిజ్ఞానంలేదని చెప్పాలి. ఆదుర్దాతో, గర్వంతో ఎడా పెడా త్రాగి అభాసుపాలవుతారు. త్రాగుడు గురించి ప్రజలను విద్యావంతులను చేయవలసిన అవసరం చాలా ఉన్నది.

విషవలయం


మితి మీరి త్రాగడం ఒక విషవలయం. రాత్రిసమయంలో మితి మీరి త్రాగితే ఉదయము తల, వొళ్ళు నొప్పులు వస్తాయి. ఆ బాధ మరవడానికై ఉదయం తిరిగి త్రాగుతారు, దీనినే ''హేంగ్ వోవర్'' అంటారు. త్రాగినప్పుడు విచిత్రంగా, అసందర్భంగా మాట్లాడుతుంటారు. అతనిలోని గొంతెమ్మ కోర్కెలు బయటపడుతుంటాయి.

బార్‌లో రాత్రి 10 గంటలవరకూ మినహా బహిరంగస్థలాలో త్రాగడం నేరం. అయితే ప్రముఖనాయకుల ఆధిపత్యంలో ఉన్న రిక్రియేషన్ క్లబ్‌లలో, క్యాబరేడ్యాన్సుల పేరుతో నగ్ననృత్యాలతో పాటూ త్రాగడం విరివిగా పలుప్రదేశాలలో కొనసాగుతున్నది.

సరదాకి త్రాగడం ప్రారంభిస్తే, అదొక్క అలవాటుగా మారి, వ్యసనంగా రూపొందడం తథ్యం. ఎవ్వరేమన్నా త్రాగడం వొంటెని, ఇంటెని గుల్లచేస్తుంది అనడంలో ఎవరికీ ఎలాటి సందేహంలేదు.

— చలసాని నరేంద్ర

2—9—83 ఆంధ్రసచిత్రవారపత్రిక



మితి మీరి త్రాగటం ఒక విషవలయం

మద్యం లేదా నిషా పుట్టించే పానీయం ఛాందోగ్యోపనిషత్తుదాకా (వైదిక సాహిత్యంలో)కనపడదని ''వేదిక్ ఇండెక్స్'' చెబుతుంది. అయితే, మహా భారతం, రామాయణాలలో దీని ప్రసక్తి ఉంటుందని అందరికీ తెలుసు ! ఆడా మగా కూడా తాగేవారని తెలుసుకోవచ్చు... పంచ ''మ''కారాలలో మద్యం ఒకటి అని వేరే చెప్పనక్కరలేదు కదా !

మహమ్మదీయ మతం ప్రకారం అసలు సారాయి పుచ్చుకోవడమే తప్పు.

పాశ్చాత్య దేశాలలో ''తాగటం'' ఎక్కువ అనే అభిప్రాయం ఎందరికో ఉంటుంది. అమెరికాలో సుమారు అరవయి ఆరు ఏళ్ల కింద మద్యపాన నిషేధం అవసరం అని ఆ దేశం యొక్క కేంద్ర శాసనసభ కాంగ్రెసు ప్రతిపాదించింది. అమెరికాలో మ. ని. నిలవలేదని వేరే చెప్పాలా ?

కొందరి అభిప్రాయం ప్రకారం సారాయి (ఇథయిల్ ఆల్కహాల్) నిజానికి ఉల్లాసం కలిగించే పదార్థంకాదు. అది ఆహ్లాదం బదులు దిగులునే పుట్టిస్తుంది కాని, మద్యాలలో ఉండే ఇతర పదార్థాలు కొన్నిటికి ఈ గుణం ఉంటుంది—

విస్కీ, బీర్ రెండూ బార్లీ నుంచి తయారు చేసేవే. బీర్‌ని కాస్తే విస్కీ రావాలి.

అలాగే ద్రాక్ష నుంచి ఉత్పత్తి చేసే వైన్‌ని కాస్తే బ్రాంది వస్తుంది.

చెరుకు నుంచి రమ్ తీస్తారు. జిన్‌కి మొక్కజొన్న మూల పదార్థం.

ఇంకా బియ్యం వగయిరా పిండి పదార్థాల నుంచి ఏవేవో మద్య పానీయాలు చెయ్యొచ్చు...

అన్నిటికీ కావలసింది పిండిపదార్థం (స్టార్చి.) ఇందులో నుంచి పంచదార, పంచదార నుంచి గ్లూకోస్ వగయిరాలు, వాటినుంచి సారాయి ...

ఒక పెగ్గు విస్కీలో సుమారుగా 140 కాలరీల శక్తి ఉంటుందని అంచనా. బీర్ చాలా పుష్టికరమయిన ఆహార పదార్థమే కూడా.

జీవితంలో ఒకే ఒక్కసారి తాగినాసరే కాలేయానికి తీరని హాని కలుగుతుందిట.

రష్యాలో తాగుడు పెద్ద వ్యసనం అని ఆ దేశాన్ని పాలించేవారే ఆందోళన పడుతూ ఉంటారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారు గాంధీగారు పుట్టిన 100 సంవత్సరాలని గుర్తు ఉంచుకుని ఆయన శతజయంతి పూర్తి కాగానే మద్యపాన నిషేధాన్ని తొలగించారు ...

సారాయిమీద వేసే పన్ను సర్కారు వారికి అంత అధికంగా వస్తుంది మరి !

సారాయి కల పానీయాలని తయారు చేసే కంపెనీల అమ్మకాలు నిజంగా ఎంత ఉంటాయో చెప్పటం కష్టం . .


అన్ని రకాల ''పారిశ్రామిక వేత్త'' లని విమర్శించేవారు సారాయి తయారు చేసేవారిని ఏమీ అనకపోవటం గమనించ తగిన ఒక యదార్థం ... ★



రాజేష్, అరుణ 'భార్యాభర్తల సవాల్'లో ↗↙ 'తోడు–నీడ'లో శోభన్‌బాబు, నళిని


నందం హరిశ్చంద్రరావు దర్శకత్వంలో "కాలయముడు"గా మోహన్ బాబు

"మోహన్ బాబు సరసన శ్రీ పల్లవి నాయిక," అన్నారు నందం హరిశ్చంద్రరావు. ఈయన స్క్రీన్ ప్లే, దర్శకత్వంలో నూరపనేని బాబు నిర్మించే శ్రీ పల్లవి ఫిలిమ్స్ "కాలయముడు" చిత్రానికి రికార్డింగ్, షూటింగ్ ముహూర్తోత్సవాలు జెమిని రికార్డింగ్ థియేటర్‌లో జరిగాయి. శారద, జయమాలిని, రాగిణి, ప్రభాకరరెడ్డి, నూతన్ ప్రసాద్, గిరిబాబు, రాళ్ళపల్లి ఇతర ముఖ్య భూమికలు నిర్వహిస్తున్నారు. బాల మురుగన్ కథకు పరుచూరి సోదరులు సంభాషణలు రాశారు. జె.వి. రాఘవులు సంగీత దర్శకుడు ఎస్. వెంకటరత్నం ఛాయాగ్రాహకుడు.



విశేషాలు

-జి. వి. జి.



"తెల్ల గులాబీలు"

"రాజమండ్రి, వైజాక్, అరకులోయ, మాచ్‌ఖండ్ ప్రాంతాలలో ఆగస్టు 19 నుంచి సెప్టెంబర్ 19 వరకు ఒకే షెడ్యూల్లో షూటింగ్ పూర్తిచేస్తాం," అన్నారు ఆర్. తులసీకుమార్. ఈయన రేలంగి నరసింహారావు దర్శకత్వంలో నిర్మించే ఉషోదయా క్రియేషన్స్ 'తెల్లగులాబి' చిత్రానికి జూలై 20న తొలిగీతం ధ్వనిముద్రితమైంది. రాజేష్, రాంజీ, బాలాజీతో పాటు ఒక నవ నాయిక నటిస్తుంది. పూసల సంభాషణలకర్త. ఆత్రేయ, గోపి గీతాలకు శంకర్ గణేష్ బాణీలు కూర్చారు. ఎం. వి. రఘు ఛాయ, శ్రీనివాసరాజు శిల్పం, రవీంద్ర బాబు కూర్పుతో ఆర్. ఎస్. రామరాజు, రవి కుమార్ రెడ్డి నిర్వహణ బాధ్యతలు వహిస్తున్నారు.

సుమలత, మురళీమోహన్ 'భోళాశంకరుడు' ↑↓ కృష్ణ, జయప్రద 'ప్రజారాజ్యం'లో





'ఖైదీ'లో చిరంజీవి, మాధవి

సినిమా

అక్కినేని హీరోగా శ్రీ శరత్ ఆర్ట్స్ "కోటీశ్వరుడు" రికార్డింగ్ ప్రారంభం

నటసామ్రాట్ అక్కినేని నాయకుడుగా శ్రీ శరత్ ఆర్ట్స్ నిర్మిస్తున్న "కోటీశ్వరుడు" వర్ణచిత్రం తొలిపాట రికార్డింగ్ ఆగస్టు 1 వ తేదీ విజయా గార్డెన్స్‌లో జరిగింది.

"చిగురాకు శుభలేఖ రాసేటివేళ
చిరుగాలి సన్నాయి పాడేటి వేళ
ఆ చూపు అరుణోదయం
ఆ చిరునవ్వు చంద్రోదయం" అనే

రాజశ్రీ వ్రాసిన పాటను బాలసుబ్రమణ్యం, సుశీల పాడగా చక్రవర్తి రికార్డు చేశారు. చిత్రంలో ఈపాటను అక్కినేని, సుజాతలతో చిత్రీకరిస్తారు.

ఆగస్టు 18 నుండి 31 వరకు జరిగే షెడ్యూల్స్‌తో చిత్రం పూర్తవుతుంది.

అక్కినేని, సుజాత, జగ్గయ్య, నూతన నటి ప్రమీల, శరత్‌బాబు, రంగనాథ్, నాగేష్, మాడా, సూర్యకాంతం, పండరీబాయి, రాజసులోచన ముఖ్యతారాగణం.

కథ : భీశెట్టి లక్ష్మణరావు; మాటలు : ఆత్రేయ; పాటలు : వేటూరి, ఆత్రేయ, సి. నా. రెడ్డి, రాజశ్రీ; సంగీతం : చక్రవర్తి; కెమెరా : నవకాంత్; కళ : భాస్కర రాజు; కూర్పు : రవి; కో–డైరెక్టర్ : యం. జగన్నాధరావు; అసోసియేట్ : కె. జయప్రసాద్ రెడ్డి; ప్రొడక్షన్ : కె. నరసింహారావు, సి. వి. యస్. రామారావు, రాజేంద్రరాజా.

ప్రముఖ ఫ్రాతికేయుడు టి.ఆర్. శ్రీనివాస్, పి. హెచ్. రామారావుతో కల్సి నిర్మిస్తున్న ఈ చిత్రం ఆంధ్రలో పూర్ణపిక్చర్స్, నెల్లూరు, గుంటూరు కల్యాణి ఫిలింస్, సీడెడ్‌లో విజయ లక్ష్మీ పిక్చర్స్. నైజాంలో వెంకటకృష్ణ ద్వారా విడుదలౌతుంది.

"కోటి కొక్కడు" లో కడుపులో బంగారం

జ్యోతి (జయసుధ) అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్ళడంచూసి రాజా(కృష్ణంరాజు) "ఏయ్, ఏడుకొండలూ !" అని పిలిచాడు.

కంగారుపడ్డా, వెంటనే తమాయించుకొని, "నా పేరు ఏడుకొండలు కాదు" అంది జ్యోతి.

"ఏడుకొండలు కాకపోతే యాభై కుండలు గాని," అని ఆమె కడుపు వంక చూస్తూ, "అవునూ, గంట క్రితం లేనిది ఇంత అర్జంట్‌గా ఎలా వచ్చింది? కుండెడు మంచినీళ్ళు తాగావా?" అన్నాడు రాజా.

"ఏమిటా వెటకారం ? నేను పెళ్లయిన దాన్ని. మా ఆయన పెద్ద ఉద్యోగం చేస్తున్నాడు."

"మీ ఆయన ఎంత పెద్ద ఉద్యోగం చేస్తున్నా, ఇంత అర్జంటుగా నీకు కడుపు రావడానికి రూల్సు ఒప్పుకోవే ! ఇంతకీ, ఆ కడుపులో ఏం ఉంది ? గంజాయా ? నల్లమందా ? ... ఓహ్ ! బంగారమా !"

"బంగారం ఎందుకుంటుంది ? బిడ్డ ఉంటుంది."

"బిడ్డుందో – గాడిద గుడ్డుందో నేను కనిపెట్టేశాను గాని ముందు బయటకు తియ్!"

"ఏంటి ? తమాషాగా ఉందా ? మర్యాదగా వెళ్లకపోతే పోలీసుల్ని పిలుస్తాను."

"ఏదీ, పిలూ !"

జ్యోతి "పోలీస్ ! పోలీస్ !"అని కేకట్టగానే రాజా తాపీగానే "ఎస్, మేడమ్ ! వాట్ కెన్ ఐ డూ ఫర్ యు ? నేనే పోలీస్‌ని. క్రయిమ్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ... నిన్ను వేటాడి, వెంటాడి, వేధించి, శోధించి, బాధించ మని మాకు స్పెషల్ ఆర్డర్స్ వచ్చాయి" అంటూ తన ఐడెంటిటీ కార్డును చూపించాడు.

అంతే...జ్యోతి పరుగు లంకించుకుంది.

జి. సత్యనారాయణ నిర్మించే "కోటి కొక్కడు" చిత్రానికి కొమ్మినేని దర్శకుడు.

'భామా...రుక్మిణి'లో ప్రవీణ, భాగ్యరాజా




"భార్యాభర్తల సవాల్"లో సుందోపసుందులు

హాస్పిటల్... తలకు, కాళ్ళకు కట్లతో బుల్లెబ్బాయి (గొల్లపూడి) అచేతనంగా పడుకొని ఉన్నాడు. చక్రవర్తి (రావు గోపాలరావు) వచ్చి, "క్షేమమా ?" అన్నాడు హేళనగా.

"ఇది తమ పనేనా?" అన్నాడు బుల్లబ్బాయి నీరసంగా.

"మరంతే. అసలు టేప్ నీ దగ్గర పెట్టుకొని కాపీ టేప్ ఇచ్చావన్న సంగతి ఊహించలేననుకున్నావా ? నీ కార్లో టేప్, నేనిచ్చిన డబ్బు– ఇవిగో !"

బుల్లెబ్బాయి నిర్ఘాంతపోయాడు. "అమ్మా దెబ్బ కొట్టారండి. చక్రవర్తి చక్రవర్తే,



...పతివ్రత వేషాలు వెయ్యమంటే మాత్రం సిగ్గుపడతాను !

బుల్లెబ్బాయి బుల్లెబ్బాయేనని తెలుసుకున్నాను. క్షమించు. ఇంతకంటే ముహూర్తం పెట్టకు!" అంటూ బాధతో నెత్తిమీద గాయాన్ని తడివి చూసుకున్నాడు.

చక్రవర్తి పొడిగా నవ్వాడు. "ఛ-ఛ... నీలాంటి వల్ల మేథావులతో నాకెప్పుడూ పని ఉంటుందయ్యా !"

"అయితే, నన్ను మీ స్నేహితుడిగా స్వీకరించండి."

"ఆనందంగా... సుందోపసుందుల సాక్షిగా ఈ రోజు నుండి నిన్ను నా స్నేహితుడిగానేకాదు; పార్ట్‌నర్‌గా కూడా తీసుకుంటున్నాను."

"ధన్యుణ్ణి."

"మన రాజీకి సూచనగా ఈ పండ్లరసం

రాజకీయరంగంలోకి మరో హీరో !

"మా రాష్ట్రానికి నా అవసరం ఎప్పుడొస్తే అప్పుడే రంగంలోకి దూకుతాను," అంటాడు దాదాపు దశాబ్దంగా వంద పైచిలుకు గుజరాతీ చిత్రాలలో నటించిన



గుజరాతీ సూపర్‌స్టార్ – ఉపేంద్ర త్రివేది. ఈయన్ని 'గుజరాతీ దిలీప్‌కుమార్' అని కూడా అంటారు.

"ఏ పార్టీవారైనా రాజకీయవేత్తలంతా ఒకటే అని కొందరు ప్రజల భావన. ఈ రాజకీయవేత్తలు వారిలో వారు ఘర్షణ పడుతూ బలహీనవర్గాల గురించి ఏ మాత్రం పట్టించుకోవడంలేదు. సామాన్య ప్రజానీకానికి సేవ చేయడానికి తగిన మార్గమేదో తెలుసుకోడానికే నేను రాజకీయరంగంలో ప్రవేశించదలిచాను. నాకు ఏ పదవీ అక్కర్లేదు. అధికారమూ అక్కర్లేదు. అసలు ఏ పార్టీతోనూ చేతులు కలపను," అనే ఈయన అడపా దడపా కాస్త కూస్త సంఘసేవ చేశాడు. దానధర్మాలూ చేశాడు.

ఈయన గత ఎన్నికలప్పుడు ప్రతిపక్ష పార్టీల తరపున గుజరాతీ రాష్ట్రంలో వంద సభలకు పైగా ఉపన్యసించి, విశేషంగా ప్రచారం చేశాడు. కాని, కాంగ్రెస్ 'ఐ'కే మెజారిటీ వచ్చింది. దాంతో ఈయనలో పట్టుదల మరింత పెరిగింది. "అసలు గుజరాతీ రాష్ట్రం న్యూఢిల్లీ నుంచి పరిపాలింపబడుతోంది. రాష్ట్ర మంత్రులు ప్రతి చిన్నపనికీ న్యూఢిల్లీకి పరుగులు తీయవలసివస్తోంది. ఇది చాలా శోచనీయమైన విషయం," అనే ఈయన ఎన్. టి. ఆర్., ఎం. జి. ఆర్. అడుగుజాడల్లో పయనించడానికి సిద్ధంగా ఉన్నాడు. ★

శ్రీ శరత్ ఆర్ట్స్ 'కోటీశ్వరుడు' రికార్డింగ్ సందర్భంగా నిర్మాత టి. ఆర్. శ్రీనివాస్, పూర్ణా పిక్చర్స్ జి. విశ్వనాథ్, దర్శకుడు కొమ్మినేని, సహ నిర్మాత పి. హెచ్. రామారావు.



సినిమా

తీసుకో!'' అంటూ టీపాయ్ మీదున్న గ్లాసును అందించాడు చక్రవర్తి.

బుల్లెబ్బాయి గడగడ తాగేశాడు.

ఎస్. వి. సుబ్బరాజు కథ ఆధారంగా ఆర్. రామకృష్ణంరాజు, కె. ఎల్. ఎస్. ఎస్. రామచంద్రరాజు నిర్మించే పద్మజా కళామందిర్ ''భార్యాభర్తల సవాల్'' చిత్రానికి పి. చంద్రశేఖరరెడ్డి దర్శకుడు.



శ్యామల గౌరి 'చండీరాణి'

ఎ.ఎన్.ఆర్., ఎ. కోదండరామిరెడ్డి కాంబినేషన్‌లో లక్ష్మీ ఫిలిమ్స్ కంబైన్స్ చిత్రం

''నవంబర్, డిసెంబర్ నెలల్లో షూటింగ్ పూర్తవుతుంది,'' అన్నారు ఎన్. ఆర్. అనూరాధాదేవి. ఈమె ''చక్రధారి, శ్రీవారి ముచ్చట్లు, రాముడు కాదు కృష్ణుడు'' వగైరా విజయవంతమైన చిత్రాల అనంతరం నిర్మించే కొత్త చిత్రంలో ఎ. ఎన్. ఆర్. హీరో. ఎ. కోదండరామిరెడ్డి దర్శకుడు. సమర్పణ : నంగునూరు శ్రీనివాసరావు. ★

ఘాటాక్షుని పేరి

లాభసాటి వృత్తి!

మద్రాసులోని వో ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్‌లో మా వృత్తి "యాచక వృత్తి" అని రాసి ఎక్కవుంటు తెరచిన కొంతమంది ఎక్కవుంట్లలో సుమారు ఎనిమిది లక్షల రూపాయలు వున్నాయట.

దివాలాతీసిన మునిసిపాలిటీ!

హేగ్ పట్టణ అధికారులు (కార్పొరేషన్ అందునా) బొత్తిగా డబ్బులేక సంపాదించే మార్గంలేక చివరాఖరికి వో నిర్ణయానికొచ్చి పట్టణంలోగల 79 గడియారాల్ని అమ్మివేయదలచినట్టు అన్ని రోడ్డు గడియార స్థంభాల మీదా తమ నిర్ణయం ప్రకటించారట, ఈ విషయాన్ని లండన్ పత్రిక "టెలిగ్రాఫ్" ప్రకటించింది—

వారం రోజులకి—ఏడుగురు పిల్లలు!

అమెరికాలో డెన్వర్ అనే పట్టణానికిచెందిన వయొలెట్ పిక్ అనే వావిడ కడుపుతో వుండి వో సుముహూర్తాన వో మగపిల్లాణ్ణి కని, అదే వూపులో అదేపనిగా వారం రోజులు రోజుకొక పిల్లనో, పిల్లాడినో కన్నదట. మొత్తం ఏడుగురు పిల్లలూ, తల్లీ క్షేమంగా వున్నారట,



కొడుకుని చంపిన ప్రియుడు!

లండనుకు చెందిన స్టాన్లీ డేవిడ్ అనే వో 21 ఏళ్ళ యువకుడు తన లేడీ లవ్ యింటికి వెళ్ళి ఆమెతో తన హృదయం విప్పి చెప్పుతున్న సమయంలో ఆమె ఏణ్ణర్థం కొడుకు ఏడవనారంభించాడట గారంగా. అతను ఛీ వూర్కోరా అని అదలించినకొద్దీ ఆ పిల్లాడు పేట్రేగిపోయి గీ పెట్టడంతో స్టాన్లీకి కోపం వచ్చి, ఆ కుర్రాణ్ణి ఎత్తి గోడకు విసిరి కొట్టేడట. దాంతో ఆ కుర్రాడు తల పగిలి చనిపోయాడట.

మంచిరోజుకోసం తనయుని బలి!

మహారాష్ట్ర నాసిక్ జిల్లాకు చెందిన వాద్గాన్‌సింగ్నా గ్రామంలో మహద్ శంకర్ పావర్ అనే వో వ్యవసాయి తను ఎంత శ్రమపడినా, ఎంత కష్టపడినా తనకు మంచి రోజులు రానే రావటంలేదని, కనుక నరబలి యిచ్చి తన రోజులను చక్కబరుచుకోవాలనీ నిర్ణయించుకుని, ఆ బలికి తనసొంత కొడుకునే ఎన్నుకున్నాడట. ఆ పిల్లాడికి చక్కగా స్నానం చేయించి, నానా, గుడికెళ్దాంరా అని వో అమ్మవారి గుడికి తీసుకువెళ్ళి "దేవికి సాష్టాంగపడు" అని చెప్పి, ఆ పిల్లాడు సాష్టాంగపడేసరికి అక్కడున్న త్రిశూలాన్ని తీసుకుని ఆ పసివాణ్ణి కుళ్ళపొడిచి చంపేసి, ఆ నెత్తురుతో తర్పణిచ్చి "దేవి నాకిక మంచి రోజులను ప్రసాదించు" అన్నాడట. ఆనక నింపాదిగా జైల్లో కూర్చుని విచారిస్తున్నాడట.

భూతవైద్యునికి శ్రీకృష్ణ జన్మస్థానం!

మనీలాకు చెందిన వో భూతవైద్యుడు లియొనార్డో ఫారిన్స్ క్వ్యాలా అనే అతను 17 ఏళ్ళ వో అమ్మాయిని ఎత్తుకుపోయి నన్ను ప్రేమించు. నా కోర్కె తీర్చు. లేకపోతే నిన్ను రాయిగా మార్చేస్తాను అని భయపెడ్తూండగా (మొన్న జూలై 17వ తేదీన) అతని భార్య చూసి, జారిపడి, తనకు తన భర్తైన ఆ భూతం లొంగకపోయేసరికి పోలీసులకి రిపోర్టిచ్చి అతగాణ్ణి అరెస్టు చేయించిందట.

కట్నం రేటు పెంచితే చెప్పుదెబ్బ!

కర్నాటక రాష్ట్రానికి చెందిన కొప్పాల్‌లో వో ఇంట్లోని పెళ్ళి నిశ్చితార్థంకు తరలి వచ్చిన పెళ్ళికొడుకులుంగారు ఆ తతంగంలో ఇకిలించి లోగడ వొప్పుకున్న కట్నం రేటు పెంచాలని, అన్నిటి ధరా పెరిగిపోడమే తాను కట్నం ఎక్కువ కోరడానికి కారణమని ప్రకటించి "అహుదు" అని కన్నడంలో సంబరపడిపోయాడట. దానికి ఆ పిల్లతండ్రి దాన్దేవుంది భోంచేశాక ఖాయం చేసుకుందామని, వారు భోంచేసేలోగా తానో నిర్ణయానికి వచ్చి, ఆనక పెళ్ళికొడుగ్గారు యిహ నిశ్చితార్థం తతంగం ఆరంభిద్దామా అనడిగితే, పెళ్ళికూతురు తండ్రి ఇకిలించి చెప్పుతో అతడినికొట్టి ద్రాష్టుడా అస్సలు నీకు కట్నమివ్వడమే దండగనుకుంటే, యింకా రేట్టెంపు కావాలా అని వాకబు చేశాడట.

పొడవు తెచ్చిన కష్టాలు!

పాకిస్థాన్‌కు చెందిన ఆలంబన్నా అనే యువకుడు ఎనిమిదడుగుల మూడంగుళాలు పొడవున్నాడట. ఈతడు జనం మధ్యకు వెళ్ళడమే మానుకున్నాడట. జనం మధ్యకు



వెళితే తన్నో వింత మృగాన్ని చూసినట్టు చూస్తారు, పొడుగుండడం నా తప్పా. ఇది నా తల రాత. సినిమాకు వెళ్ళేవీల్లేదు, సిటీబస్సులో నిలబడి ప్రయాణం చేయలేను, బస్సుల్లోగానీ, రైళ్ళలోగాని వొంగునే నడవాలిగానీ, నిటారుగా నిలబడలేను. చివరికి మక్కా వెళ్ళి, తిరిగి వచ్చేప్పుడు నన్ను విమానంలో ప్రయాణం చేయ వీల్లేదని అక్కడి అధికారులు అన్నారు. నేను కూర్చున్నా విమానం టాపుకు నా తల దాటిపోయేంత ఎత్తుండడమే కారణం— అని అతడు వాపోయాడట. ★

మహాదేవుడిగారి మహిషం

ఎమ్. వి.వి. సత్యనారాయణ

"ఏమండోయ్, త్వరగా రండి. శుభవార్త !" అరచింది తాయారు. మహాదేవుడి చేతిలోని చెంబు జారి పడింది. జారి పడిన చోట పార పాటున అతడి కాలి(వేళ్ళు వుండటం తటస్థిం చింది. ఇంకేముంది మహాదేవుడు ఆర్తనాదం చేశాడు.

"ఏమిటండి ? శుభవార్తంటే కేక పెడతారేం ? ఎవరో పోయినట్టుగా." వటం ట్లోంచి బయటపడింది తయారు. ఆమె కంటికి నాపరాయి దరిదాపులలో చెంబు బోర్లపడి వుండటమూ, సదరు చెంబు కించిత్తు సొట్టపడి వుండటమూ కనిపించాయి. దరిమిలా మహాదేవుడు ఏడుపు బిగపట్టిన మొహం అక్కడే వున్నట్టు తోచింది

"హవ్వ... నిక్షేపంలాంటి చెంబు ! వదులు చేతులా మీవి ? మీకంటె చిన్నపిల్ల నయం !" నడుంమీద చేతులుంచుకుంది ఆమె.

మహాదేవుడికి కోపం నషాలానికి యించు మించుగా అంటింది. బాధను ఓర్చుకుంటున్నట్టు మూలుగు ఒకటి అతడి గొంతు (పాంతంలోంచి దూసుకువచ్చింది.

"నా కాలి(వేళ్ళు చిట్లాయి" అన్నాడు మహాదేవుడు.

తాయారు అప్పుడు చూచింది. నిర్లిప్తంగా పెదిమ విరిచింది.

"చెంబు ఎందుకు జారినట్టు?" అంది తాయారు.

అప్పటికి బాధకు నరాలు అలవాటు పడిన ట్టున్నాయి. మాటలు తన్నుకువచ్చాయి.

"కొంపలు అంటుకున్నట్టు గావుకేక పెట్టావు. నీనోట శుభవార్త వినడం దాదాపు అలవాటులేని పని ! చెంబు జారి పడక ఏం చేస్తుంది ?" అన్నాడు మహాదేవుడు.

తన తల భాగానికి పైన గాలిలో రెండు చేతులూ జోడించింది తాయారు. "మీ తెలివికి సంతోషించాం మహా(పభో !" అంది.

"ఇంతకూ శుభవార్త ఏమిటి తాయారూ?" నేరుగా టాపిక్‌లోకి దిగిపోయాడు మహాదేవుడు.

తాయారు కూడా మూడ్‌లోకి వచ్చేసింది. "మా నాన్న వుత్తరం రాశారు. మనకో గేదెను బేరంచేశారట !"

"గేదెనా ?" మహాదేవుడు ఆశ్చర్యపడ్డాడు. ఆశ్చర్యంలో (వేళ్ళు చిట్లిన బాధ సెలవు పెట్టింది.

తాయారు శోభనం పెళ్ళికూతురు లాగా ముసిముసినవ్వులు నవ్వింది. "అవునండి ! సాక్షాత్తూ గేదెనే ! అచ్చంగా మనకోసమే ! చిక్కటి కమ్మటి పాలు తాగి యుగాలయి నట్టుంది" అంది.

"అలాగా తాయారూ! నీ సంతోషమే నాకు సగం బలం !" అన్నాడు మహాదేవుడు.

"అవునవును" కించిత్తు వ్యంగ్యం' బోలెడు శృంగారం కలబోసి చూచి, "మీకు చక్కటి పెరుగు వేసి ఎంత కాలమయిందో అని నా మనను అల్లాల్లాడి పోతుంది. మీకు ఎలా చెప్పగలను ? ఇంత కాలానికి మన (పాణానికో గేదె రాబోతుంది. మన పాలిట కల్పవృక్షాన్ని బేరం చేశాడు మా నాన్న."

మహాదేవుడు తలూపాడు.

"మన పిల్లలు ఎప్పుడూ ఏవో వండి పెట్ట మంటారు. నేతి సరుకులయితేనే గానీ వాళ్ళకు నచ్చవు. మాయదారి డాల్డాతో ఏం తింటాం ? మొహం మొత్తిపోయింది."

"అవును గేదె వుంటే నేతికేం కరువు ?"

"పక్కింటి పుల్లారావుగారూ అండ్ ఫేమిలీ వుడికి వుడికి చస్తారు. వాళ్ళకు డైరీఫారం పాలే... వెన్న తీసేసిన నీళ్ళే శరణ్యం."

"అదేమిటి తాయారూ ! మనమూ అదే గదా వాడుతోంది !"

"అబ్బ ! ఇప్పటి మాట కాదండి ! గేదె వచ్చిన తర్వాత కూడా ఈ దిక్కుమాలిన పాలే వాడతామా ? మా నాన్న బేరం చేశాడు కదా."

మహాదేవుడి తలలో యింతసేపు మినుకు మినుకు మంటోన్న ట్యూబ్ కాస్తా వెలిగింది.

"తాయారూ! బేరం అంటావేం? యింకా కొనిపెట్ట లేదా."

"ఏం చోద్యం మాట్లాడతారండీ ! మన పెళ్ళికయిన అప్పే యింకా తీరలేదు."

మహాదేవుడు ఆశ్చర్యంగా చూచి, "మన కిద్దరు పిల్లలు పుట్టారు. ఒకడు మెట్రిక్‌కీ, మరొక్కత్తె సెవెన్త్‌కీ వెళ్తున్నారు. ఇంకా అప్పు తీరకపోవడం ఏమిటి లెద్దు ......" తిప్పుకున్నాడు.

"ఏమిటో ఆడంగి వేషాలు ! ఆయనకు బోలెడంత ఖర్చు."

"ఖర్చా ? పల్లెటూరు. నిక్షేపంలాంటి మాష్టరు గిరీ... చదివించుకోవలసింది యిక ఒక్కడినీ."

"ఏమిటో లెక్కలు ?"

"మీ నాన్న ఎక్కడయినా చిన్నిల్లు తెరిచాడేమో !"

"హవ్వ ! ఈ వయసులోనా ?"

"వయసు కాదే పిచ్చీ ! మనసు (పధానం!"

తాయారు మొహం ఎ(రగా అయింది. "మీతో కబుర్లు వేసుకుంటే నావంట అయినట్టే ! పిల్లలిద్దరూ ట్యుటోరియల్ కాలేజీ నుండి వచ్చేస్తారు! ఇంతకూ డబ్బు పంపుతారా లేదా?" అంది.

"డబ్బా ! ఎందుకు ? ఎక్కడికి ?"

"మతిమరుపు మేళం ! గేదె కొనడానికి ! మా నాన్నకు !"

"ఇప్పుడా ? డబ్బు ఎక్కడిది ?"

అపరకాళిలాగా చి(రుబు(రు లాడింది తాయారు. అంతకంటె హెచ్చు మొత్తంలో రుసరుస లాడింది. గిరుక్కున వెనక్కి తిరిగింది. వంటింట్లోకి నడిచింది.

మహాదేవుడికి (వేళ్ళు చిట్లిన బాధ తిరిగి వచ్చింది. తనివితీరా ఏడవ్వాలని సరదా పుట్టు కొచ్చింది. కాని గేదె కొనడానికయ్యేఖర్చు పచ్చి వెలక్కాయలాగా గుటకకు అడ్డంపడింది.

ఆ ఖర్చు ఎంత వుంటుంది ? అంకె తెలిస్తే బాగుండును.

మహాదేవుడు తిరిగి కాళ్ళూ చేతులూ కడుక్కోవడానికి తలపడ్డాడు. మెల్లగా వంటింట్లోకి వెళ్ళాడు. తాయారు మూతి సున్నాలాగా (తిప్పి కాఫీగ్లాసు అందించింది.

"గేదె కొనడానికి ఎంత ఖర్చవుతుంది ?" అన్నాడు మహాదేవుడు.

"ఏం ? పంపిస్తారా ?"

"తాయారూ ! మన ఆర్థిక పరిస్థితి..."

తాయారు చెంపలు వాయించుకుంటూ. "బాబూ ! నాకూ మా నాన్నకూ బాగా బుద్ధి వచ్చేలాగా చేశారు. రెండువేలవుతుంది. మా నాన్న గేదెకు అడ్వాన్సుగా వదిరూపాయలు కూడా యిచ్చేశాడు. ఆ డబ్బు కాస్తా పోతేపోతుంది" అంది.

"గేదెకు రెండువేలా ?"

"వూవ్వూ ... రెండువందలే ! కబేళాకు పోవలసిన గేదెను కొనుక్కుంటాం !"

"తాయారూ ! రెండు వేలూ ఎక్కడి నుండి తీసుకురాను."

"(పావిడెంట్ ఫండ్ లోన్."

"ఇంటి మరమ్మత్తులనుకున్నాం కదా !"

"కో-ఆపరేటివ్ బాంకులోన్ !"

''బోలెడు వడ్డీ !''

''వెధవసంత ! చిక్కటి పాలూ, గడ్డ పెరుగూ వూరకనే వస్తాయా ? పైగా గేదెను సరిగా చూసుకున్నామంటే పాలూ, పెరుగూ అమ్ముకోవచ్చును కూడా !''

''ఆల్‌రైట్ ! రేపే లోన్‌కి అప్లికేషన్ పడేస్తాను !''

తాయారు మొహం గాస్‌లైటులాగ వెలిగింది.

మరునాడు మహదేవుడు కోఆపరేటివ్ బ్యాంకుకు వెళ్ళాడు.

''మీకు ఎంత డబ్బు కావాలి ?'' అడిగాడు మేనేజర్.

''రెండు వేలు !''

మేనేజర్ ఎడాపెడా అంకెలువేసి, ప్లస్సులూ ఇంటూలూ చేశాడు. చివరకు యాభై పెట్టి భాగహారం చేశాడు. తటపటాయించి యువతరి బ్రాకెట్సులో రెండువేల మూడు వందల యాభై వేశాడు. కొంతసేపు కళ్ళు మూసుకుని ధ్యానించాడు.

''మీరు ఆరొందలేభై మాత్రం షేర్ కాపిటల్ కట్టాలి.'' అన్నాడు.

''మరి... ఆరొందలేభై కడితే... ఏం యిస్తారు ?''

''రు 2350 మాత్రమే !''

''అంటే పదిహేడొందలు వస్తాయన్న మాట !''

''కాదు. ఈ డబ్బు ఈ డబ్బే ! ఆ డబ్బు ఆ డబ్బే !''

''యిప్పుడు ఆ డబ్బు ఎలా వస్తుంది ?''

''ఆ డబ్బు !'' పెళ్ళున నవ్వాడు మేనేజర్. ''ఆరొందలేభై మాత్రమేనా ? అది మేమే కడతాం – అయితే మొత్తానికి వడ్డీ వేస్తాం. అంటే మూడు వేల రూపాయిలకూ చక్రవడ్డీ!''

మహదేవుడు దీర్ఘంగా నిట్టూర్చి, ''నాకు కావలసింది రెండువేలే !''

మేనేజర్ అతడి తలమీదనుండి వెనక్కి చూచి, ''మీ తర్వాత చాలమందికి లెక్కలు వేయాలి. మీరు కాస్త ప్రక్కకు వెళ్లి ఆలోచించుకోండి !'' అన్నాడు.

మహదేవుడికి చచ్చేటంత అవమాన



మహాదేవుడిగారి మహిషం

మయింది. మేధావి ముందు నిలబడి అఆలు నేర్పమన్నట్టు అయింది తన పరిస్థితి.

అటుతర్వాత మహదేవుడు మూడు రోజులు కో ఆపరేటివ్ బాంకు చుట్టూ తిరిగాడు. త్రిప్పటం రాజీ కుదిర్చింది. బాంకువాళ్ళు పెట్టమన్నచోటనల్లా గుడ్డిసంతకాలు పెట్టాడు. వేయమన్న వ్రేలిముద్రలు వేశాడు.

ఎవరో ముక్కూ మొహమూ తెలియని వాడిని పిలిచి "మీకు ఈయన షూరిటీ" అన్నాడు మేనేజర్.

అతడివైపు తిరిగి "మహదేవుడుగారు మీకు షూరిటీ!" అన్నాడు. తిరిగి సంతకాల ఉద్యమం సాగింది. సామాన్యుడు మోయలేని లెడ్జర్లలో సంతకాలు పెట్టించుకున్నాడు. అవతలి వ్యక్తి ఎంతసేపూ వ్రేలిముద్రలే వేశాడు. అదీ ఖాళీ స్థలంలో.

"బాబూ! ఈయన పేరు?" అడిగాడు మహదేవుడు. మేనేజర్ చిద్విలాసంగా నవ్వి, "బాబు. అదే పేరు అన్నాడు."

మహదేవుడి సదరాబాబును పరిశీలనగా చూసుకున్నాడు. అతడు యించుమించు తెలుగు సినిమాలో విలన్‌లాగా వున్నాడు. నెరిసిన గడ్డం, ఎర్రటి చీరలున్న తెల్ల కనుగ్రుడ్లూ, ఒక కంట్లో అదనంగా పువ్వూ, గాయపడిన చెంపా, రూపాయి బిళ్ళ సైజులో కాల్చిన నుదురూ, కాకీప్యాంటులోకి జొనిపిన పాత టెర్లిన్ చొక్కా, కాళ్ళకు ఏనాటివో ఎర్రటి కెట్సూ, కుడిచేతి మణికట్టుకు నల్లటి కాశీతాడూ ...

మహదేవుడికి వెన్ను జలదరించింది.

"రెవెన్యూ స్టాంపులు తెచ్చారా?" అడిగాడు మేనేజర్.

"మీ దగ్గరే వుంటాయిగా వాళ్ళ. చూసెయ్యండి" అన్నాడు బాబు. కంచు బిందెలో ఇత్తడిమేకు గీతలాగా.

మేనేజర్ చురుకుగా చూచి, "అందరికీ నేనే ఎక్కడ చూడగలను?" అన్నాడు తెలుగు సినిమా డైలాగ్‌లాగా.

రెండో అర్థం బాబుకు తోచినట్టుంది. మరమేకులాగా నవ్వి, తన షూరిటీవైపు తిరిగి, "రెండు స్టాంపులకు డబ్బులు యివ్వండి. వెళ్ళి తెస్తాను" అన్నాడు.

మహదేవుడికి అతడి చొరవ ముద్దొచ్చింది. చటుక్కున అర్థరూపాయి బిళ్ళ తీసి యివ్వాలనిపించింది. అయితే అతడు తిరిగి స్టాంపులు తెచ్చినప్పుడు పదిపైసలు యివ్వకపోవడం మాత్రం ద్రోహంగా తోచింది. స్టాంపు ఖర్చు సరేసరి.

రెండు వేల మూడు వందల యాభై రూపాయలతో యింటికి చేరుకున్నాడు మహదేవుడు. ఆ సమయానికి మహదేవుడు మామగారు ప్రత్యక్షమయ్యారు.

మహదేవుడికి లోన్ రావడంకంటె మామగారి రాక ఆశ్చర్యాన్ని కలిగించింది. సస్పెన్స్‌గా తోచింది.

"నేనే టెలిగ్రాం యిచ్చి రప్పించాను!" అంది తాయారు.

"ఓ!" అన్నాడు మహదేవుడు.

"అల్లుడూ! డబ్బు తీసుకువచ్చావా?" అడిగాడు మామగారు.

మహదేవుడు తలూపాడు. చెట్టంత మామగారు అడిగితే అదే మహద్భాగ్యంగా అనిపించింది.

"మొత్తం ఎంత వచ్చింది అల్లుడూ.?"

అల్లుడు సత్య హరిశ్చంద్రుడిలాగా వుప్పొంగిపోయాడు. అంతేగాదు హరిశ్చంద్రుని చంపి పుట్టాననుకున్నాడు.

"మొత్తం సొమ్ము యిటివ్వు అల్లుడూ."

అల్లుడు తెలివి తెచ్చుకున్నాడు. తనమామగారి చెయ్యి తిన్ననైన చెయ్యికాదు. ఎంత డబ్బయినా ఆ చేతిలో ఖర్చయిపోయి తీరాల్సిందే! కానీ యిప్పుడు డబ్బు మొత్తం యివ్వకుండా ఎలా తప్పించుకోవడం?

"గేదెను దొడ్లో కట్టేశారా?" అన్నాడు అల్లుడు.

"గేదెనా? డబ్బు యివ్వనిదే వదులుతాడా వాడు. ఎవడు? అమ్ముకునేవాడు!" అన్నాడు మామగారు.

తాయారు తెలివిగా అల్లుడినీ మామగారినీ

కార్టూన్‌లు పంపేవారికి మనవి

కార్టూన్‌లతోపాటు స్వంత చిరునామాగల స్టాంపులు అతికించిన కవరు పెట్టి సంపాదకుడు, ఆంధ్ర సచిత్ర వార పత్రిక, గాంధీనగరం, విజయవాడ—3. అన్న చిరునామాకి టపాలో పంపాలి. వీటి పరిశీలనకు కనీసం 6 నుంచి 8 వారాలు పట్టవచ్చును. ఈలోగా, వేరుగా కాని, టపాలోగాని వీటిపై ఉత్తర ప్రత్యుత్తరాలకు తావు ఉండదు. కార్టూన్‌లు 'టపా'లో పోయినా, దారి తప్పిపోయినా సంపాదకుని బాధ్యత వుండదు. ప్రత్యేక సంచికలకు కార్టూన్‌లు పంపేవారు కవరుమీద ఆ సంచిక పేరు ఉదహరించాలి. ఈ కార్టూన్‌లకి కూడా పై నిబంధనలు వర్తిస్తాయి.

—సం.

మీ పంటలకు కావలసిన పోషణ అందుతోందా?

జై కిసాన్ సంపూర్ణ 19:19:19

జై కిసాన్ యూరియా 46.4% నత్రజని



ఏ ఇతర ఎరువు కన్నా హెచ్చు పోషక పదార్థములు కలవి!

- జైకిసాన్ సంపూర్ణ 19:19:19
  పోషక పదార్థములు 1:1:1 పాళ్లలో గల సంకీర్ణ ఎరువులలోకెల్లా మిన్నయైనది.
- నైట్రేట్-నత్రజని గల ఎరువులతో పోల్చితే. సంపూర్ణలోని నత్రజని ఏమీ వృధాపోదు.
- సంపూర్ణలోని పోషక పదార్థములన్నీ నీటిలో కరుగుతాయి.
- అందువలన పంటలపై కీని పనితనం తొందరగా కనబడుతుంది.
- జైకిసాన్ యూరియా 46.4%లో నత్రజని ఎంతో ఎక్కువ. బైయూరెట్ తక్కువ. అందుచేత ఇది అన్ని రకాలుగా వేయడానికీ. పంటపై పిచికారి చేయడానికీ సురక్షితమైనది
- అతి తెల్లనిది. అతి శుద్ధమైనది. అతి శక్తివంతమైనది.



జై కిసాన్ ఎరువులు

అత్యధిక దిగుబడి కోసం అత్యధిక పోషణ.

జువారి అగ్రో కెమికల్స్ లిమిటెడ్, గోవా

ప్రాంతీయ విక్రయ కార్యాలయాలు: సికింద్రాబాద్, విజయవాడ, బెంగుళూరు, హుబ్లి, నాగపూర్, పూనా, జువారి నగర్.

JAI KISAAN

LINTAS.ZUA.106-2315 TL

మహాదేవుడిగారి మహిషం

మార్చి మార్చి చూస్తోంది. డబ్బు పంపిణీ వ్యవహారాల్లో ఆమె చటుక్కున ఎవరికీ దొరకదు. తరువాత ఎటు తిరిగి ఎటు వచ్చినా ఆమె కాచుకోగలదు.

అల్లుడు రెండు వేల రూపాయలూ లెక్క కట్టి తీసి మామగారికి అందించాడు. మామగారు మరల లెక్కపెట్టాడు.

"రెండు వేలు !" అన్నాడు ఆ సంగతి అప్పుడే కనిపెట్టినట్టు.

"ఎప్పుడు తీసుకువద్దాం మామయ్యా గేదెను ?" అడిగాడు మహాదేవుడు.

"ఏదీ యింకా మూడు వందలు కావాలి కదా !"

"రెండు వేలే కదా అన్నారట !"

"అప్పుడు. యిప్పుడో మరో అయిదు పెంచాడు. బ్రహ్మాండమైన గేదె ! నల్లగ పాషాణంలాగా వుంటుంది. వెడల్పయిన తొంటి భాగం. పొడుగు. నీ యిల్లు పాల సముద్రం అనుకో. మూడు వందలకు సెటిల్ చేశాను !"

మహాదేవుడు తన భార్యవంకా ఉరఫ్ ఆయన కూతురివంకా చూశాడు.

ఆమె 'పాల సముద్రము' తన్మయత్వంలో వుంది.

మహాదేవుడికి ఒంటరిగా మామగారితో పోరాటం హితవు కాలేక పోయింది. మూడు వందలూ తీసి చేతిలో పెట్టాడు. ఆ రాత్రి మామగారికి స్పెషల్ భోజనానికి పై యాభై రూపాయిలూ రెక్కలు తెచ్చుకున్నాయి. మామ గారికి కక్క కొరికాక రమ్ము కొట్టడం చిన్న అనవాయితీ వుంది మరి !

ఎట్టకేలకు మహాదేవుడి ఇంటికి గేదె వచ్చింది. అది నిజంగా నల్లటి నాపరాయే ! కండ పొడుగు కాదు. తాయారు రోజంతా ముచ్చట ప్రదర్శిస్తూనే గడిపింది.

"మా నాన్న ఎంత మంచి గేదెను కొని పెట్టాడండీ ! చూలుతో వుంది. త్వరలో ఈను తుంది. మన పాల కరువు తీరుతుంది !" అంది తాయారు.

"నెలకు మాటనలభై అయిదు రూపాయల కటింగ్ !" గొణిగాడు మహాదేవుడు.

"పాలు రోజుకీ అయిదు రూపాయిలు కావడం లేదు ?"

"మేత రోజుకి పది రూపాయిలు పెడితే అంతో యింతో అదే మనకు తిరిగి యిస్తుంది!"

"ఎప్పటికి యీనుతుందట ?"

"మరో నెలకు."

"అంటే మేత ఖర్చు మూడొందల రూపాయలు !"

"అవును ! ఆ మాత్రం భరించలేకపోతే ఎలా ?"

"ఎక్కడి నుండి తీసుకురాను ?"

తాయారు చిరాకుగా చూచింది. "తీరా గేదెను కొన్న తర్వాత మేత మానేస్తామా ? ఇంట్లోకి తెచ్చిన జీతంతోనే సర్దుకుందాం. తర్వాత సంగతి చూసుకో వచ్చును" అంది.

మహదేవుడు గేదెకు కావలసిన చిట్టూ, తవుడూ, గడ్డీ కొన్నాడు. పశువు వుండటానికి వీలుగా పాక వేశాడు. కావడానికి ఆ రోజే మూడు వందలయింది. ఈనబోతోన్న పశువు కావడంతో ప్రత్యేక శ్రద్ధ కావాలంది తాయారు. మహదేవుడు మనిషిని పెట్టాడు. పిల్లలకు చదువులు దెబ్బ తినకూడదంది తాయారు. మరో అయిదు వందల రూపాయిలు అప్పు చేశాడు మహదేవుడు. ఎలా అయితేనేం వెల రోజులు గడిచాయి. తర్వాత మరో అయిదు రోజులు గడిపింది గేదె. ఇంటి చుట్టూ దోమల మోత పెరిగిపోయింది.

చిట్టచివరకు మోయవలసినంత కాలమూ మోసి మరీ ఈనింది గేదె. పెయ్యదూడ. మహదేవుడు తన కష్టాలు గట్టెక్కినట్టు నిట్టూర్చాడు.

"ఆ హా ! జున్నుపాలు !" కేరింతలు కొట్టారు పిల్లలు.

తాయారు తృప్తిగా జున్ను వండింది. అంత కాలమూ ఎవరికి ఎ వ రు గా వు న్న వాళ్లంతా మహదేవుడివి చుట్టుముట్టారు.

"రెం డో పూ ట జున్నుపాలు మాకు యివ్వండి !"

"మూడోపూటవి మాకు !"

"లీటరు ఎలా యిస్తారు ?"

"మాకూ రోజూ వాడుకగా పోస్తారా ?"

"వాడకం పాలు లీటర్‌కి ఎలా తీసుకుంటారు ?"

"మీ యింట్లో గేదె వుండటం మా వీధికే అదృష్టం."

"మిగతా పాల వాళ్లకంటె బేరం కాస్త చూచీ చూడనట్టు పోనివ్వండి !"

మహదేవుడు వుబ్బితబ్బిబ్బయాడు సిటీలో గేదెకు యింత విలువ వుందా ! ఆశ్చర్యం. తెలివైనదే ! తన గేదె మీద బాకీ ఒక ఏడాది లోగా తీరిపోవచ్చును. ఆటుతర్వాత అంతా ఆదాయమే ! మహదేవుడిని చూచి నల్లనాపరాయి ఆప్యాయంగా అరిచేది.

నల్లనాపరాయి లాంటి గేదె అయితే ఏంగాక పాలు యివ్వడంలో మహదేవుడి గేదె ఆ వీధిలోని గేదెల పాల రికార్డును బద్దలుకొట్టింది. పిల్లల దగ్గరకువెళ్లినా పొడవదు. కుడితి ఆలస్యమయినా అల్లల్లాడిపోదు. అంతేకాదు యింట్లో పాడి పొంగి పొరలుతోంది.

తాయారు మహముచ్చట పడిపోయింది. గేదెను యింటి చుట్టూ స్వేచ్ఛగా తిరిగే వీలు కల్పించింది. గేదె కూడా అత్యంత విశ్వాస పాత్రంగా ప్రవర్తిస్తూనే వచ్చింది. గేదెను ఆలనాపాలనా చూచేవాడు రాకపోయినా తాయారు సర్దుకు పోగలుగుతోంది.

"గేదె యిచ్చే పాలతోనే మేత ఖర్చు కొట్టుకు పోతోంది. రోజుకు పదిరూపాయలు మిగులుతున్నాయి. సంవత్సరానికి మూడువేలు వేసుకోండి... చచ్చు... సంభావన ... తాయారు మురిపెంగా గొంతు వణికింది.

అదేరోజు ఆమె కోపంతో, భయంతో, ఆవేశంతో, ఉద్వేగంతో వణికిపోయే పరిస్థితి ఎదురయింది. గేదె మాయమయింది: దూడతో సహా కనబడకుండా పోయింది. మహదేవుడూ, తాయారూ, పిల్లలూ గేదె కోసం శోకాలు పెట్టారు. అల్లల్లాడిపోతూ తిరిగారు. గేదె చిరునామా దొరకలేదు.

తాయారు తిండి మానేసింది.

"అమాయకప్పీనుగు ! ఎవడో తోలుకు వెళ్లిపోయాడు బుద్ధిమాలిన వెధవ ! సర్వస్వం నాశనమైపోయింది. ఎవరితో చెప్పుకోవాలి ?" వగర్చింది తాయారు.

"పోలీసులకు రిపోర్ట్ యిద్దాం !" అన్నాడు మహదేవుడు.

"హమ్మనాయనోయ్ ! దిక్కుమాలిన సంత పోలీసు లొద్దు బాబోయ్ !"

"అయితే ఏంచేద్దాం ?"

"వెతికించుదాం ! మనుషులను పెడదాం !"

"ఇదో వడ్డీ."

"మరి ఏం చేస్తాం ? అసలు లాక్కోవాలంటే అంతేమరి."

మహదేవుడు నిట్టూర్చాడు. తల రోట్లో పెట్టాడు తాను. రోకటిపోటుకు వెరచి ప్రయోజనం లేదు: ఇద్దరు మనుషులను ఏర్పాటు చేసుకున్నాడు. ఆఫీసుకు సెలవు పెట్టాడు. రెండు రోజులూ అంటే అక్షరాలా నలభై ఎనిమిది గంటలపాటు తిరిగాడు కాని ఫలితం కుదరలేదు.

వారం రోజులయింది. తాయారు చిక్కిశల్యమయింది.

"పోతే పోయింది గేదె ! నువు ఆరోగ్యం పాడుచేసుకుంటే ఎవరికి నష్టం ?" అన్నాడు మహదేవుడు.

తాయారు ఎంగిలిపడింది. భార్య బాధ చూడలేక మహదేవుడు మరల సెలవు పెట్టి తిరిగాడు. గేదెతో తిరిగివచ్చాడు.

"హయ్యో ! ఈ గేదె మనది కాదండి !" అంది తాయారు.

"పోనియ్ తాయారూ ! మన గేదెకు బదులుగా దొరికింది. మనమే వుంచుకుందాం !" అన్నాడు మహదేవుడు.

మ హ దే వు డు వెంటపెట్టుకువచ్చింది ఎర్రగేదె.

"ఎవరిదో పాపం! పాడిగేదె తప్పిపోయింది!" అంది తాయారు.


"దూడ లేదేం ?" అన్నాడు మహదేవుడు.


"దొమ్మ రోగం తగిలి పోయివుంటుంది. ఈ వూరి పాలవాళ్ళలాగా దూడబొమ్మ చేయించండి !" అంది తాయారు.

మహదేవుడు దూడ బొమ్మ చేయించుకు వచ్చాడు.

తాయారు తిరిగి ముచ్చటపడటం మొదలు పెట్టింది. అయితే ఆ ముచ్చట ఒకనాటి సుప్రభాతంలో రగడగా మారింది. ఎర్రగేదె తప్పిపోయినవాళ్ళు మహదేవుడి యింటిమీదకు దండయాత్రకు వచ్చారు.

ఎర్రగేదె దూడని చంపినందుకూ, ఆ దూడబొమ్మ చేయించి మూడు నెలల నుండీ





ధర్మపథం

బులుసు వేంకటరమణయ్య

సీతాదేవి అగ్నిప్రవేశం

సీతాదేవి మహాపతివ్రత. అనసూయ వంటి మహాపతివ్రతల ప్రశంసలను పొందినది. భర్తను విడవలేక — పతిసేవకై అతనితో పాటు అరణ్యానికి వచ్చిన ఉత్తమురాలు. ఆమె పాతివ్రత్యాన్ని గురించి శ్రీరామునికి తెలిసే ఉన్నది. అయినా, ఆమె అగ్ని ప్రవేశం ఎందుకు చెయ్యవలసి వచ్చింది ?

ఈ విషయం ఆలోచించదగినదే !

ఆమె గొప్ప పతివ్రత అయినా తప్పు పనులు చేసింది. వాటివలన ఆమెకు పాపం సంభవించింది. ఆ పాపానికి ఫలం అనుభవించవలసి వచ్చింది. ఎంతవారికయినా కర్మఫలం అనుభవానికి వచ్చి తీరుతుంది.

ఆమె చేసిన తప్పులు ఏమిటంటారా ?

మాయా మృగాన్ని వెంటాడి, దానిని పట్టుకొనుటకు శ్రీరాముడు పర్ణశాలనుండి బయలుదేరేటప్పుడు సీతాదేవితో — ఎట్టి పరిస్థితులలోనూ గుమ్మందాటి అవతల అడుగు పెట్టవద్దని గట్టిగా చెప్పాడు. తాము నివసిస్తూ వున్న దండకారణ్యం మాయల మారులైన రాక్షసులకు నివాసమనీ, ఆ అడవిలో సన్న్యాసులు భిక్షానికి రావడం



అసంభవమనీ ఆమె తెలుసుకోవలసి ఉన్నది. ఆమె తన్ను తల్లిగా భావించి సేవచేస్తూ ఉన్న లక్ష్మణుని నానా దుర్భాషలూ ఆడి అక్కడినుంచి తరిమివేసింది. భర్త ఆజ్ఞను లెక్కచెయ్యక ద్వారం దాటి బయటికీ, సన్న్యాసి వేషంలో ఉన్న రావణునికి భిక్షం వెయ్యడానికి బయటికి వచ్చింది. ఈ తప్పుల వల్ల ఆమెకు పాపం సంభవించింది. ఆ పాపానికి ఫలితంగా ఆమె అగ్నిప్రవేశం చెయ్యవలసి..వచ్చింది.

సీతాదేవియందు ప్రగాఢమైన ప్రేమగల శ్రీరాముడు కఠిన హృదయుడై ఆమెను అగ్నిప్రవేశం చేసి శపథం చెయ్యవలెనని కోరడం కూడా, ఆమె దోషాల ఫలితమే ! అంతేకాక, ఆమె పరగృహ నివాసానికి ప్రజలు ఆమె శీలాన్ని శంకించకుండా, ఆమె పరిశుద్ధతను చాటడంకోసమే శ్రీరాముడు ఈ విధంగా కోరాడని కూడా చెప్పవచ్చును.

ఎంత చిన్నతప్పు చేసినాసరే, దాని ఫలాన్ని అనుభవించడం ఎంతటివారికైనా తప్పదని దీనివల్ల మనం తెలుసుకోవలసి ఉన్నది.

పాలు వాడుకుంటోన్నందుకూ జమిలిగా పోలీసు కేసు పెట్టారు ఎర్రగేదె మనుషులు.

మహదేవుడు చిక్కులలోపడ్డాడు. పోలీసు స్టేషన్‌కి నడిచాడు. ఎర్రగేదెవాళ్ళు కోర్టుకు కూడా యీడ్చిపారవేస్తానన్నారు.

మహదేవుడు పోలీసు స్టేషన్‌లో ప్రవేశిస్తూనే కర్ణపేయమైన పిలుపు విన్నాడు. ఆ పిలుపు నల్లరాయిలాంటి తన గేదెది ! పోలీసులు అతడి ఆప్యాయతను గుర్తించేశారు.

"ఈ గేదె మీదా ?" అడిగాడు హెడ్ కానిస్టేబులు.

మహదేవుడు అమాయకంగా తలూపాడు.

"మీ నల్ల గేదె తప్పిపోయిందని ఎర్ర గేదెను అపహరిస్తారా ?" అన్నాడు హెడ్ కానిస్టేబులు.

"అపహరించలేదు సార్ ! ఎర్ర గేదె దొరికింది !"

మహాదేవుడిగారి మహిషం

"మీ గేదె పోయినట్టూ ఆ గేదె దొరికినట్టూ పోలీసులకు చెప్పవద్దా ?"

"ఆ విషయం తెలియదు సార్ !"

"మరేం తెలుసు ! ఎర్ర గేదె దూడను చంపెయ్యడం తెలుసా ? దూడ చర్మతోం బొమ్మ చేయించడం తెలుసా ?"

మహదేవుడు నీళ్ళు నమిలాడు.

"మీ నల్ల గేదె పోలీస్ స్టేషన్‌లో రెండు వారాలను నుండి వుంది తెలుసా ?"

"తెలియదు సార్ ! దాని కోసం వెతికి వెతికి అలసిపోయాం సార్ ?"

"ఈ రెండు వారాల నుండి దాన్ని పోషించడానికి మా వాళ్ళూ అలసిపోయారు. స్టేషన్‌కి అయిదు వందలు ఖర్చయింది. దానికి తోక దూడ ఒకటీ !"

"మా ఎర్రగేదె గురించి మాట్లాడరేం?" అన్నారు ఎర్రగేదె మనుషులు.

"ఆ విషయం కోర్టుకు వేసేస్తాం ! వీ గేదెల తగాదా మేం తీర్చలేం! మహదేవుడుగారూ అయిదు వందలు తీసుకువచ్చి గేదెను తోలుకు వెళ్ళండి. లేకపోతే దాన్ని వేలం పాడవలసి వస్తుంది" అన్నాడు హెడ్డు.

చచ్చిచెడి గేదెల మేళంలోంచి బయటపడి నల్లగేదెతో దాని దూడతో యింటికి వచ్చాడు మహదేవుడు.

తాయారు మరల ముచ్చటగా పాలగిన్నెతో పాదుగు దగ్గర కూర్చుంది.

నల్ల నాపరాయిలాంటి గేదె ఫెడీల్‌మని తన్నింది. దానాదీనా తేలిందేమంటే పోలీసుల రక్షణలో గేదె పాలు యిగిరిపోయాయి ! గేదె దండోపాయం నేర్చుకున్నదనీమా.

మహదేవుడు గేదెమా క్రిందపడిన తాయారునూ మార్చి మార్చి చూడసాగాడు.★

తాజా వార్తలకు, వ్యాఖ్యలకు, కొంగ్రొత్త ప్రత్యేక శీర్షికలకు ఆంధ్రపత్రిక దిన పత్రిక పెట్టింది పేరు...మీరు మీ కాపీ మీ ఊరి ఏజెంటుద్వారాగాని లేదా మానేజరు, గాంధీనగరం, విజయవాడ-3 లేదా మానేజరు, బషీర్‌బాగ్, హైద్రాబాద్-29 కి గాని వ్రాసి పోస్టులో తెప్పించుకొనండి.

జుట్టుకు సిల్కువంటి మృదుత్వము నిచ్చుటకు నైసర్గిక ఉపాయము...



శుద్ధమైన షికాయిలోని సహజ లాభకర గుణములు స్వస్తిక్ షికాకాయ్ సబ్బులో నింపబడినవి. వాడటానికి అనువైనది. లిక్విడ్ షాంపూ కంటే ఎంతో పొదుపైనది.



దీని పుష్కలమైన, మృదువైన నురగ మీ జుట్టును మెత్తగా, పూర్తిగా శుభ్రపరుస్తుంది. మీ జుట్టును ఆరోగ్యంగా, నిగనిగలాడేలా వుంచుతుంది. తాజా సువాసన నింపి పట్టువంటి మృదుత్వాన్ని ఒసగుతుంది.



సుస్వస్తిక్
శికాకాయ్ సబ్బు

ఇందులో షికాయి కలిసి వుంది. భారత స్త్రీల అందమైన జుట్టుకు పారంపర్యమైన రహస్యము.

shilpi dm 25/79 tel

సీరియల్

మానస మురళి

కొడాలి సాంబశివరావు

19

(గత సంచిక తరువాయి)

రాత్రిలో చాలా భాగం కరిగి పోయింది.

విజయ్ నిద్రరాక మంచం మీద అటూ ఇటూ దొర్లాడు. గిరగిరా తిరిగే ఫ్యాను వంక తదేకంగా చూసాడు. ఆ ఫ్యాను మాదిరే ఆతనిలో ఆలోచనలు కూడా ఆ విధంగా సుళ్ళు తిరుగుతున్నాయి. అర్థంగాని వేదన గుండెను మథిస్తుంది.

ఎందుకు ?

మానస మాటలు గుండెల్లో బాంబుల్లా పేలాయి. ఆ క్షణం నుంచి అతనికి శాంతి, విశ్రాంతి కరువయింది.

ఆమె మాటల్లో సత్యముందనిపించింది.

ఆలోచనల మధ్య నలిగి పోతున్నాడేగాని ఒక నిర్ణయానికి రాలేకపోతున్నాడు.

అంతులేని సంఘర్షణకు లోనయ్యాడు.

కాలం కరుగుతుంది ... ఆలోచనలు కెరటాల్లా ఎగిసి పడుతున్నాయి. సమస్య తెగడం లేదు. నిర్ణయం మనసులో బలపడడం లేదు ... మధ్య మధ్య గతించిన గతం తాలుకు నీడలు... ! మనసు — మస్తిష్కం అలసిపోతున్నాయి.

తూర్పురేఖలు విచ్చుకునే సమయానికి అతను ఆలోచనల నుండి తేరుకున్నాడు. రాబోయే ఉషోదయంలా ఆతని హృదయం కొత్త వెలుగుతో నిండింది. తీసుకున్న నిర్ణయం గట్టిగా బలపడింది. అప్పుడతని మనసు ప్రశాంతతను పొందింది.

'మానసా ! నీవే గెలిచావు. నీ నిజాయితీకి, నీ వ్యక్తిత్వానికి తల వంచుతున్నాను. ఈ నా జీవితంలో 'మురళి' తరువాత ఎవరికీ చోటు లేదనుకున్నాను. మురళీప్రియ నా నుంచి దూరమయ్యేక ఈ హృదయ కవాటాలు మూసుకు పోయాయి. మధ్యలో ... చందన తన మంచి తనంతో మమకారంతో ఆ కవాటాల్ని తట్టి నిదురించే హృదయాన్ని మేల్కొలిపింది. తిరిగి అలలా ఎగిసిపడి — కలలా కరిగిపోయి— నాలో చీకటి నింపింది.

ఇన్నాళ్ళకు... ఇన్నేళ్ళకు తిరిగి నీవు ... ఆ చీకటిని పారద్రోలి వెలుగు దివ్వెను వెలిగించావు. ఆ దివ్య వెలుగులో మనిద్దరి జీవితాలు కాంతివంతం కాగలవని ప్రగాఢంగా విశ్వసిస్తున్నాను. మురళి చేసిన గాయాల్ని మాన్పింది చందన. చందన నింపిన చీకటిని నీవు పారద్రోలి — ఆ లోటు భర్తీ చేయగలగాలి ... అపుడే ఆనందం ...! —

విజయ్ పెదవులపైన రాగచంద్రికలు నృత్యం చేసాయి.

* * *

''మీ నిర్ణయం నాకు అనుకూలంగా వున్నందుకు చాలా సంతోషం విజయ్‌గారూ ! కానీ, నన్ను పెళ్ళాడాలన్న తలంపు మీకది వరకు లేదు. నేను అడిగిన తరువాతే అంగీకరించారు. అంటే నా మీద సానుభూతితో అంగీకరించారా ? లేక మీ ఆదర్శం కోసం తలదించారా ?''

''నీవెలా అనుకున్నా సంతోషమే ! నిన్ను నా అర్ధాంగిగా స్వీకరించడానికే నిశ్చయించుకున్నాను. అదే సత్యం —'' చిరుదరహాసంతో అన్నాడు విజయ్.

ఆ మాటలు మానసలో వన్నీటిజల్లులుచిలకరించాయి. హృదయం ఒక్కక్షణం పురివిప్పిన మయూరంలా నృత్యం చేసింది. కానీ...అంతలోనే ఏవో భయాలు... సందేహాలు— రేగాయి.

''వేడి వయసులో తీసుకున్న ఈ నిర్ణయం కడదాకా చెదిరిపోదని నమ్మవచ్చా ?''

''ఆలోచించే నిర్ణయించుకున్నాను. నమ్మితే నీ జీవితం స్వర్గతుల్య మవుతుంది —'' అతని కళ్ళలో రవ్వంత చిలిపిదనం తొంగి చూసింది.

''మీ మీద నాకా నమ్మకం ఏర్పడుతుంది. కానీ, మీ పెద్దవాళ్ల మాటేమిటి ? ఓ పతితను తమ కోడలిగా స్వీకరిస్తారా ?''

''నీకలాంటి భయాలేం అక్కర్లేదు. నేను వంటరి వాడిని.''

''మీకెవరూ లేరా ?—'' విస్మయంగా చూసింది మానస.

''లేరు. నాకు నేనే... రేపు నీ తోడు...'' నిర్లిప్తంగా నవ్వాడు విజయ్.

''మరి సమాజం ? అది వేసే ప్రశ్నలకు ఏమని సమాధానం చెబుతారు ?''

''సమాజాన్ని గురించి భయం నీకేగాని నాకలాంటి భయాలేం లేవు. నేను నమ్మిన సిద్ధాంతానికి ఆనందంగా తల దించుతానే తప్ప ఎవరికీ భయపడను.'' అతని కంఠంలో పలికిన దృఢత్వానికి—ధైర్యానికి ఆమె ముగ్ధురాలయింది.

జరిగిన కథ — 8 : విజయ్ ప్రేమను అంగీకరిస్తుంది మురళి. శివశంకరం మురళిని తన ప్రియురాలు మీనాగా భ్రమ చెందుతాడు. తన మనవడ కోరికపై రాజమణి మురళిని తన ఇంటి కోడలుగా చేసుకుంటానని మురళి పిన్నికి చెపుతుంది. కారణం చెప్పకుండా విజయ్‌ను దూరమవ్వమంటుంది మురళి. పుష్కరాల్లో దొరికిన తనను పెంచి పెద్ద చేసిన వారి కోసం త్యాగం చేయాలనుకుంటుంది మురళి. శివశంకర్‌కు బ్లడ్ కేన్సర్ అని తెలిసి దిమ్మెరపోతుంది. ఈ విషయం ముందే తెలిసి ఉంటే విజయ్‌ను దూరం చేసుకునుండను కదా ! అని వాపోతుంది. శివశంకర్ మురళి సాహచర్యంలో ఉల్లాసంగా, ఆనందంగా ఉంటూంటాడు. ఒకరోజు మురళి శివశంకర్ కోరికను తిరస్కరిస్తుంది. అతను ఆమెను మురళీప్రియగా గుర్తిస్తాడు. ఆమె ఆ విధంగా నాటకమాడురున్నది తన డబ్బు కోసమే అని నిందిస్తాడు. ఊహించని విధంగా అతను ఆమె మెడలో పసుపుతాడు కడతాడు. మురళి మెడలో తాళికట్టిన మూడురోజులకే మరణిస్తాడు శివశంకర్. మురళి చెప్పిన కథ విని సానుభూతిగా చూసాడు విజయ్. ఆమె కోరగా తన కథను చెప్పసాగాడు — హోటల్ మంజులో జరిగిన పోలీసు రైడింగ్‌లో మానస, సుకుమార్‌లను అరెస్ట్ చేస్తాడు ఇన్‌స్పెక్టర్ విజయ్. సుకుమార్‌ను మంత్రిగారి ఆజ్ఞానుసారం విడుదల చేయక తప్పలేదు విజయ్‌కి. మానసను కూడ విడుదల చేస్తాడు. రాత్రి ఇంటికి వస్తున్న మానసను రౌడీల బారినుండి రక్షించి ఆమె ఇంటికి చేరుస్తాడు విజయ్. ఇన్‌స్పెక్టర్ విజయ్ పేరు వింటేనే పేవ్‌మెంట్లుమీద చిల్లర వ్యాపారాలు చేసేవారు, అవినీతిపరులు గడగడలాడుతుంటారు. ఏ కొద్దిమంది స్వార్థపరులకో తప్ప విజయ్ కార్యదీక్షత, నిజాయితీ చాలమందిని ఆకర్షించాయి. మానస మూడవసారి విజయ్‌కు పట్టుబడుతుంది. అతను ఆమెను శ్రీనివాస్ ఏజన్సీస్‌లో చిన్న ఉద్యోగంలో చేరుస్తాడు. మానసకు అక్కడా చుక్కెదురవుతుంది. మానస వేరే ఉద్యోగం చేయడానికి ఒప్పుకోదు. ఈ నీచ వృత్తే నీకు ఇష్టం అని మానసను విజయ్ నిందించగా ఇన్ని మాటలకు బదులు తనను పెళ్ళి చేసుకొని ఉద్ధరించమని అడిగి వెళ్లిపోతుంది.

భయాలన్నీ తొలగిపోయి మనసు సంతోష రాగాన్ని ఆలపించింది.

"ఎక్కడో కోవెలలో దేవుడుంటాడని ఇన్నాళ్ళూ భ్రమ చెందాను. మిమ్మల్ని చూసాక నా భ్రమ తొలగిపోయింది ..." కృతజ్ఞతతో, ఆరాధనతో ఆమె కళ్ళు నిండుకున్నాయి.

అతను నవ్వాడు చల్లగా, మృదుమధురంగా.

"ఇక ముందు నీ కళ్ళల్లో ఆనంద భాష్పాలే తప్ప కన్నీళ్లకు చోటులేదు —" అని ఆర్తిగా ఆమె కన్నీళ్లను మునివేళ్లతో స్పృశించాడు విజయ్.

అతని స్పర్శకు ఆమె గుండె జలదరించింది. శరీరం పులకించిపోయింది.

అప్పడను కుందామె 'ఈ శరీరాన్ని ఎందరో తాకారు. కానీ, ఈ హృదయాన్ని తాకగల శక్తి ఎవరికీ లేకపోయింది. మూగవోయిన హృదయ వీణ నేడు కదిలింది. తీయని రాగాన్ని ఆలపిస్తూ అద్వితీయమైన ఆనంద పారవశ్యతతో చిందు లేస్తుంది. ఇన్నినాళ్లకు ఈ బ్రతుకు పండ బోతుంది ...' ఆమె కళ్ళు జలపాతాలయ్యాయి.

అతని రూపాన్ని కళ్లనిండుగా చూసుకోవా లనుకుంది. కానీ కన్నీళ్ళ మధ్య అడ్డుతెర ... మనసులోని కృతజ్ఞతను ఎలా చెప్పాలో — హృద యంలోని రాగభావాల్ని ఎలా వ్యక్తం చేయాలో ఆమెకు అర్ధంకాక చటుక్కున అతని రెండు చేతుల్ని అందుకుని ముద్దాడేసింది.

విజయ్ తృప్తిగా నిట్టూరుస్తూ "ఈ పని ఏం బాగాలేదు—" అన్నాడు కవ్వింపుగా.

"అదేం ? — !" చటుక్కున అతనిచేతుల్ని వదిలింది భయంగా.

విజయ్ హాయిగా నవ్వుతూ "ముద్దుపెట్టు కున్నందుకు కాదు..కానీ ఆ స్థలమే బాగాలేదు " కళ్ళు చిలికించి బుగ్గ చూపించాడు.

మానస తేలికబడిన మనసుతో నవ్వింది మల్లెపూవులా.

కొంచంసేపు తరువాత "మా ఇంటికి వెళ్దాంరండి– " అన్నది.

"ఎందుకు మీ వాళ్లతో మన విషయం మాట్లాడ డానికా ?"

"కాదు. మీ జీవితంలోకి నన్ను ఆహ్వానిస్తు న్నారు. అందుకు మీకు జీవితాంతం ఋణపడి వుంటాను. మన పెళ్లికి ముందుగా మీరు నా జీవితంలోకి తొంగి చూడాలి. మా కుటుంబ సభ్యుల్ని మీకు పరిచయం చేస్తాను. మా ఇంటి గురించి, మా వాళ్లను గురించి మీకు పూర్తిగా తెలియాలి. ఆ తరువాత తుదినిర్ణయం మీదే.."

అతను తమాషాగా భుజా లెగరేస్తూ "ఇప్పుడు కాదు. పనుంది, రేపు తప్పకవస్తాను" అన్నాడు.

20

"అదుగో,అటు చూడండి. ఆ మంచంమీద కూర్చుని విభ్రాంతిగా చూస్తున్నదే ఆమె మా నాన్నకు జన్మనిచ్చిన తల్లి నాంచారమ్మగారు. ఆమె కెప్పుడూ నా పెళ్లిధ్యాసే. ఆడదానికి పెళ్లే పరమార్ధం అంటుందామె. తింటానికి తిండి లేకపోయినా కులభ్రష్టత్వం కారాదని మాకు చిన్నప్పటినుండి నీతులు నూరిపోస్తూనే వుంది.

లోకంపోకడ తెలియని పాతకాలపు మనిషి. ఆమె మాటల్ని మేమెవరం గౌరవించమనితెలిసినా వాగుతూనే వుంటుంది. నిన్న నా పెళ్లిగురించి చెప్పాను. ముందు కులం అడిగింది. తెలీదన్నాను. గోత్రం అడిగింది, తెలీదన్నాను. దానితో వెర్రి ఆవేశం తెచ్చుకుని చెడామడా తిట్టిపోసింది. బరి తెగించిన దానివన్నది. రాత్రినుంచి ఒకటే సణు గుడు. ఆమె మాటలు నేను పట్టించుకో లేదను కోండి— " అని ఆగి చిన్నగానవ్వింది మానస.

విభ్రాంతిగా చూసాడు ఇనస్పెక్టర్ విజయ్.

మంచంలోవున్న నాంచారమ్మ చూపులతోనే కాల్చేస్తుంది విజయ్‌ను.

"ఇక ఇటు చూడండి విజయ్‌గారూ ! అదిగో ఆ గుమ్మంలో దిగాలుపడి చూస్తుందే



మానస మురళి

ఆవిడ మా అమ్మ మీరాబాయి. నన్ను నవమాసాలు మోసి తన రక్తమాంసాలు పంచి ఇచ్చిన తల్లి ! పాతికేళ్ళనాడు సాంప్రదాయ సిద్ధంగా ఈ ఇంటి కోడలైంది. ఈ ఇంట్లో ఆమె ఏం సుఖపడిందో గానీ, మమ్మల్ని మాత్రం బాగానే చూసింది. ఆవిడ తల్లి ప్రేమను శంకించాల్సిన పనిలేదు. కాకపోతే ఆడపిల్ల గడప దాటితేనే పరువు పోతుందనే మూర్ఖత్వం మాకు కోపం తెప్పిస్తుంది. పరదాల మాటునే ఆడదాని జీవితం రాణిస్తుందని అంటుంది. మేము గడప దాటక పోతే మన బ్రతుకులు దొర్లవని ఎంత చెప్పినా వినదు. గడపదాటి వెళ్లినమేము తిరిగి గడపలో అడుగు పెట్టేంతవరకు హైరానా పడుతూనే వుంటుంది.

ఈ పాటికి ఆవిడ మనస్తత్వం బోధపడే వుంటుంది.

నాకు పెళ్లిచేసి అత్తారింటికి పంపాలని ఆశపడ్డది. ఆమె ఆశ ఈ రోజు నెరవేరబోతుంటే సంతోషపడలేక పోతుంది. కారణం ? నేను కులాన్ని– సాంప్రదాయాన్ని ఉల్లంఘిస్తున్నానట. నాకు పుట్టగతులుండవట. ఇలాంటి శాపనార్థాలు ఎన్నో పెట్టింది.

నేను ఆమె మాటలకు బాధ పళ్లేదు. నవ్వుకున్నాను.

అసలు నేను ఇలాంటి సాహసానికి ఎందుకు పూనుకున్నానో అమ్మకు తెలీదు. తెలిస్తే ఆమె గుండె ఆగినా ఆగవచ్చు.

నేను అందరి ఆడపిల్లలా శీలవతినైతే సాంప్రదాయాల్ని పాటించేదాన్ని. పరదాల మాటున దాగి వాళ్ళు తెచ్చే ఏ దౌర్భాగ్యుడికో ఇల్లాలు నయ్యేదాన్ని. నా జీవితంలోవున్న మచ్చల్ని గురించి ఆమెకు తెలీదు. తన కూతురు ఉద్యోగం చేసి సంపాదిస్తుందన్న భ్రమలో వున్నది. ఈ ఇంటికోసం, ఈ మనుషులకోసం నా శరీరాన్ని అమ్ముతున్నానని ఆమె కలలోకూడా ఊహించలేదు. ఈ కఠోరనిజాన్ని ఆమె జీర్ణించుకోలేదని ఇన్నాళ్లూ ఆమెను భ్రమలో బ్రతికిస్తూ వచ్చాను–'' అని ఆగి ప్రక్కనేవున్న తండ్రి ముఖంలోకి చూసింది మానస.

ఉమాపతిముఖం తెల్లగా పోయివుంది !

అవమాన భారంతో ఆయన తల వాలి పోయింది.

తండ్రిని చూసి నిర్వికారంగా నవ్వింది మానస.

''ఎందుకు నాన్నా తల దించుకుంటున్నావు ? జీవితం ముందు తల దించుకున్నావు. పరిస్థితుల ముందు తల దించుకున్నావు. కన్న కూతురి ముందు కూడా తల దించుకుని హీనుడవుకాకు. అయినా నీవేం తప్పుచేశావని తల దించుకోవాలి ?

నాకు జన్మనిచ్చావు. జీవితాన్నిచ్చావు.

నేను నీ కూతుర్ని. ఈ రక్తమాంసాలు నీనుంచి వచ్చినవే. నీ కూతురినైన నన్ను పెట్టుబడిగా పెట్టుకుని వ్యాపారం చేసావు. నీ అసమర్థతను నా ద్వారా కప్పిపుచ్చుకున్నావు. ఏ తండ్రీ తన కూతురుపట్ల ప్రదర్శించని ధైర్యాన్ని – సహసాన్ని నీవు ప్రదర్శించావు. అందుకు ధీమాగా, ధైర్యంగా తలెత్తుకోవాలి–''
అదిరే పెదవులతో ఆవేశంగా విజయ్ వంక చూసింది మానస.

''విజయ్ గారూ ! నేను ఈయన కూతురుగా పుట్టినందుకు చెడిపోవాల్సి వచ్చింది. లంచం తీసుకుని కట్టుబడి వున్న ఉద్యోగాన్ని పోగొట్టుకున్నాడీ పెద్దమనిషి. మరోదారి లేక ఈ సంసారాన్ని నడిబజారు కెక్కించలేక నన్ను నడిబజార్లోకి పంపించాడు. 'ఈ ఇంటికోసం నీవు త్యాగం చేయాలమ్మా ! నా పరువు నీ చేతుల్లో వుంది–'అని మొసలి కన్నీళ్ళు విడిచాడు. నన్నా పాప పంకిలంలోకి పడద్రోయవద్దని ఎంతగానో ఏడ్చి బ్రతిమాలాను.

అయినా ఈయన ఉక్కు మనసు కరగలేదు. చివరకు నేనే కరిగి అందరికీ వెలుగునయ్యాను. ఈయన ఎంత తెలివిమంతుడంటే నాచేత చేయిస్తున్న వృత్తిని ఇంటా బయటా తెలీకుండా ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నాడు. కన్న తండ్రే ఇలా పంపించాడన్న నెపాన్ని తనమీదకు రాకుండా చూసుకున్నాడు.

'ముళ్లకంచెలపాలైన నా జీవితాన్ని ఇకనైనా బాగుచేసుకుంటాను నాన్నా !' అన్నాను. 'నీవు పెళ్లి చేసుకుని సుఖపడడం నాకూ ఇష్టమే నమ్మా – నీవు లేకపోతే ఈ ఇంటికి వెలుగుండదు. మా అందరికీ సంతోషముండదు. ఇందర్ని బాధపెట్టి నీవు వెళ్లిపోవడం ఏం బాగాలేదమ్మా. తమ్ముడికి ఉద్యోగం దొరికి – ఈ ఇంటికి మరో మార్గం దొరికాక పెళ్లిచేసుకుందువు. అందాక ఆగు. త్యాగంలో సుఖం వుందిగానీ స్వార్థంలో లేదమ్మా –' అని లౌక్యంగా గంపెడు ప్రేమను ఒలకబోసాడు.

ఇలాంటి తండ్రి కడుపున పుట్టినందుకు నవ్వాలో ఏడ్వాలో నాకే అర్థంగావడంలేదు. ఇలాంటి సంధిగ్ధావస్థ ఎన్నోసార్లు వచ్చింది. కానీ ఇదే ఆఖరుసారి. మళ్లీ ఇలాంటి అవస్థ రాకూడదు. రాదు–'' చెమ్మగిల్లిన కళ్లను పమిట చెరుగుతో వత్తుకుని తండ్రివైపు చూసింది మానస.

''ఇన్నాళ్లూ నీ మాటలింటూ వచ్చాను. మంచిచెడులను గురించి ఆలోచించక నీవు దూకమన్న నిప్పుల గుండంలో కళ్లా దూకాను. ఇప్పుడు నా వళ్లంతా కాలిపోయి బొబ్బలెక్కి – చితికి చీమూ – నెత్తురు వోడుతుంది. ఈ బాధను నేనిక భరించలేను. ఆ గాయాన్ని మాన్పుకుంటాను. నన్ను విడుదల చేయ్ –

నీకు చేతిలెత్తి నమస్కరిస్తాను నన్ను ఆశీర్వదించి పంపు–'' కన్నీళ్లను జలజల రాలుస్తూ రెండు చేతులు జోడించింది మానస.

ఉమాపతి రెండుగా చీలినట్లు విలవిల్లాడి పోయాడు.

ఆర్ద్రనయనాలతో రెండు క్షణాలు కూతుర్ని చూసి మళ్లీ తల దించుకున్నాడు

కళ్లు తుడుచుకుని నవ్వింది మానస.

''బాధపడుతున్నావా నాన్నా? నీవు బాధ పడాల్సిన పని లేదు. నేను వెళ్లిపోతే నా స్థానాన్ని భర్తీచేయగల చెల్లెలుంది. అది కూడా నీ కూతురేగదా! రేపు మీకు తిండిపెట్టేది అదే! నాతోపాటు దానికీ జన్మనిచ్చావు. ఆ కృతజ్ఞతతో నయినా అదీ నాలాగే నీ మాట వింటుంది. ఈ ఇంటినుంచి నేను వెళ్లిపోయినా మీకు ఏలోటూ రాదు.''

ఉమాపతి పిడుగుదెబ్బ తిన్నవాడిలా తలెత్తి చూసాడు. అతని కళ్లలోకి కన్నీళ్లు దుమికాయి.. అతని పెదవులు కదల్లేదు!

కారణం...! అతని సంస్కారం అంతే!!

వెక్కి వెక్కి ఏడుస్తున్న చెల్లెలు రాధికను దగ్గరకు తీసుకుంది మానస.

''ఎందుకే ఏడుస్తావు పిచ్చిదానా? నాన్న చాలా తెలివిపరుడు. నీకు బ్రతకడం నేర్పగల డులే... ఊరుకో...''

ఆ తరువాత విజయ్ దగ్గరకు వచ్చింది మానస.

''నాదో చిన్న కోరిక. తీరుస్తారా విజయ్ గారూ?–'' బేలగా అర్థించింది.

అంతవరకూ మూగ వేదనను అనుభవిస్తున్న విజయ్ పెదవి విప్పి 'ఏమిటీ' అని అడగలేదు. ఆ ప్రశ్నను కళ్లద్వారానే వేశాడు.

''ఏమీలేదు. అదుగో అటు చూడండి. ఆ బిక్క మొహం వేసుకుని నా మాటల్ని శ్రద్ధగా ఆలకిస్తున్నవాడే నా చిన్న తమ్ముడు. ఏ జన్మ పాప ఫలితమో అంధఃకార బంధురమైన జీవితాన్ని గడుపమని దేవుడు వాడి నుదుట రాశాడు. ఆ రాతను త్రిప్పిరాస్తూ వాడికి కళ్లు తెప్పించాలని ఎన్నాళ్లనుంచో అనుకునేదాన్ని. ఈ ఇంట్లో నన్ను అమితంగా అభిమానించేది, నిస్వార్థంగా ప్రేమించిందీ వీడొక్కడే! ఆపరేషన్ చేయిస్తే చూపు వస్తుందట. చూపు వస్తే వాడి బ్రతుకు వాడు బ్రతుకుతాడు. ఈ జీవితకాలంలో మిమ్మల్ని మరే కోరికా కోరను. వాడికి చూపును ప్రసాదించండి–'' అని విజయ్ దోసిల్లో ముఖం కప్పకుని బావురుమని ఏడ్చేసింది మానస.

విజయ్ ఇక నిగ్రహించుకోలేకపోయాడు. ఆమెనలాగే పొదివి పట్టుకుని ఆర్తిగా గుండెలకు హత్తుకున్నాడు.

మరో ఐదు నిమిషాల తర్వాత...

విజయ్ ముందుకు నడిచాడు.

అతనివెంట మానస... ఆమె చేతిలో తన చిన్నారి తమ్ముని చేయి...

ఆ ముగ్గురూ ఆ యింటికి గుమ్మం దాటుతూనే ఇంట్లోవారికి చలనం కలిగింది!

* * *

ఇనస్పెక్టర్ విజయ్ ఇంటి వచ్చాడు భాస్కర్. తమ్ముడ్ని అల్లంత దూరాన చూసి 'వీడైనా తనను అర్థం చేసుకుని వచ్చాడు. చాలు–' అని సంతోషంగా ఎదురెళ్లింది మానస. ఆ సమయంలో విజయ్ ఇంట్లో లేదు.

భాస్కర్ వస్తూనే ''నీవింత బరితెగించి ప్రవర్తిస్తావనుకోలేదు. నీవు నా తోడబుట్టిన దానివని చెప్పకోవడానికే సిగ్గుగా వున్నది. ఈ బ్రతుకు బ్రతికేకన్నా ఏ భావిలోనయినా దూకి చావరాదూ?'' అని ఆవేశంగా చెడామడా తిట్టిపోశాడు.

మానస ముఖంలో నవ్వు చప్పన మాయ మయింది.

''ఎందుకురా! నేనెందుకు సిగ్గుపడాలి? నేనెందుకు చావాలి? ఆ మాటకొస్తే చావాల్సింది– సిగ్గుతో తల పగల కొట్టుకో వాల్సింది మీ నాన్నరా! నా జీవితమిలా పతనం కావడానికి కారణభూతుడైన మీ నాన్న చావాలి–''

''నోర్ముయ్! కామంతో కళ్లు మూసుకు పోయి ఎవడో కులం కానివాడితో లేచివస్తావా? రేపటినుంచి మేము బయట ఎలా తలెత్తుకు తిరగాలి?''

మానస నవ్వింది పిచ్చి పువ్వులా!

''ఓ... అదా నీ బాధ? ఎంత స్వార్థపరుడివిరా నీవు? చెడిపోయిన అక్క జీవితం బాగు పడుతుందంటే ఏ తమ్ముడైనా మనసారా సంతోషిస్తాడు. ఏ కుటుంబం కోసమైతే నేను పాపపు పనులకు పూనుకున్నానో– ఆ కుటుంబమే నేడు నన్ను వెలివేస్తుంది.

నేను చెడిపోయినంతకాలం మీరు ధీమాగా మగధీరుల్లా తలెత్తుకుని తిరిగారు. ఈనాడు నా జీవితాన్ని మార్చుకుని మంచిగా బ్రతుకుదామను కుంటే మీరే అందరికన్నా ముందుగా దుమ్మెత్తి పోస్తున్నారు. ఇన్నాళ్లూ నాచాటున బ్రతికిన మీరే ఈనాడు యుద్ధానికి వస్తున్నారు.

ఏమిట్రా నేను చేసిన నేరం? ఎందుకు నామీద ఇంత కక్ష?


ఇన్నాళ్లూ వళ్లు అమ్మి మిమ్మల్ని సాకి నందుకైనా నామీద కృతజ్ఞత వుండాలి. చాలురా... చాలు. మీరిస్తున్న బహుమానాలు కలకాలం గుర్తుంటాయి.'' మానస నయనాలు అవిరళ ధారలుగా వర్షించసాగేయి.

భాస్కర్ ఆమెవంక ఏహ్యంగా, ఛీత్కారంగా చూసేడు.

''నీతిలేనిదానవు. నీతో మాట్లాడడంకూడా అసహ్యమే. ఇక జన్మలో నీ ముఖం చూడను–'' అని విసురుగా గోడప్రక్కన కూర్చున్న తమ్ముడి చేయి పట్టుకుని బరబరా ఈడ్చుకుపోసాగేడు భాస్కర్. వాడు ఏడుపు లంఘించుకున్నాడు.

మానస అడ్డు వెళ్లింది. ''వాడినెక్కడికి తీసికెళతావు? కనీసం వాడినైనా నా కళ్లెదుట వుంచు–'' అని.

''వీల్లేదు. నీ నీడకూడా మా మీద పడడానికి వీల్లేదు. నీవు కుక్కముట్టిన ఇస్తరిలాంటి దానవు. ఏ క్షణం ఆ ఇల్లు వదలి కానివాడితో లేచివచ్చావో, ఆ క్షణమే నీవు మా దృష్టిలో చచ్చిన దానితో సమానం. ఊఁ ... అడ్డు తప్పకోఁ ... ...'' అని మానసను విసురుగా



ట్రోసేసి తమ్ముడ్ని తీసుకుని వెళ్ళిపోయాడు భాస్కర్.

ఆ ఊపుకు మానస గోడకు వెళ్లి కొట్టుకుని నుదురు చిట్లి స్పృహ తప్పింది.

21

కోదండరామాలయంలో భాజాభజంత్రీల మధ్యన విజయ్ — మానసల పెళ్లి జరుగుతోంది. ఆ పెళ్లికి ఇరుపక్షాల బంధువులెవరూ లేరు. విజయ్ స్నేహితులు — పరిచయస్తులు అంతా ఓ ఇరవై మంది మాత్రమే వున్నారు.

సన్నాయి మేళాల మధ్య విజయ్ తన మెడలో మిలమిల మెరిసే మంగళసూత్రం కడుతుంటే మానస హృదయం తీవ్రంగా స్పందించింది. తన అదృష్టానికి లోలోన మురిసిపోయింది. 'ఈ జన్మకీ వరం చాలు. శిలలాంటి తన జీవితంలో రస స్పందన కలిగించి, తనకో గౌరవ ప్రదమైన స్థానం ఇస్తున్న ఈ మహామనీషికి — జీవితాంతం కృతజ్ఞతగా వుంటూ ఆరాధిస్తాను—' మానస కళ్లవెంట ఆనందభాష్పాలు జలజలరాలాయి.

విజయ్‌కు మాత్రం ఆమె మెడలో మంగళ సూత్రం కడుతుంటే క్షణకాలం మనసు బెదిరి ఏవో గతం తాలుకు నీలినీడలు కళ్లముందు కదిలాయి. రెపరెపలాడుతున్న హృదయాన్ని నొక్కిపట్టాడు.

'తను కావాలని ఈమెను మోసం చేయడం లేదు. నిజమే...తనకు ఇదివరకే పెళ్లయింది... కానీ, ఆ పెళ్లి పేరిట తనకు దుఃఖమే మిగిలింది. ఒక జీవిని చావునుంచి తప్పించడం కోసం తను మనువాడాడు ... ఆ రాగమయి తనను అన్యాయం చేసి వెళ్లిపోయింది...అదంతా గతించిన గతం...!

ఆ చందన తననుంచి విడిపోయి రెండేళ్లయింది. ఎక్కడున్నదో, ఏమయినదో తనకు తెలీదు. ఆమె కావాలనే తననుంచి దూరంగా పారిపోయింది ... ఆమె నిష్క్రమణతో తన హృదయం రెండోసారి దగాపడింది ... ఇప్పుడా గుండెలో మానస కొలువుండాలని వచ్చింది. వంటరి జీవితంతో విసిగిన తనకూ ఒక తోడు కావాలని మానసను చేపడుతున్నాను. ఇది తన స్వార్థమే అయినా — దగాపడిన మానసకు ఒక దారి చూపాలన్న తలంపుకూడా వున్నది. ఇందులో మోసం దగా — ఏదయినా వుంటే తనకిదివరకే పెళ్లయిన సంగతి ఆమెకు చెప్పకపోవడమే! ఆ పెళ్లి పెళ్లి కాదన్న తలంపుతో ఆ విషయం చెప్పలేకపోయాను ... అంతే!

ఇప్పుడా ఆలోచనలతో — స్మృతులతో బాధ పడడం అవివేకం!

గతించిన ఆ గతం ఓ తీయని ప్రేమకల!

ఇది వాస్తవం!

నేటినుంచి మానస తన అర్ధాంగి. ఈమెను ప్రేమించాలి. ఈమె స్మృతులతో చివరిదాకా కలిసి బ్రతకాలి. ఇది ధర్మం! తనను నమ్మి వచ్చిన ఈమె జీవితంలో నవ వసంతాలు చిమ్మాలి. అదే తన కోరిక ... ' అని ఆలోచించి మూడు ముళ్ళూ వేశాడు.

అందరూ అక్షింతలు చల్లి దంపతుల్ని ఆశీర్వదించారు.

నిజానికి ఈ మేళతాళాలు—వేదమంత్రాలు ఇవన్నీ విజయ్‌కు నమ్మకం లేదు. సింపుల్‌గా రిజిష్టర్ మ్యారేజ్ చేసుకోవాలనుకున్నాడు. కానీ; మానస కోరిక మరోలా వుండడంతో ఆమె కోసం అంగీకరించాడు.

'మీ మాటకు అడ్డు చెబుతున్నానని కోపం తెచ్చుకోకండి. నేను చెడిపోయినదాన్ని. ఈ జన్మకిక పెళ్లి యోగం లేదనుకున్నాను. కానీ దేవుడు మిమ్మల్ని పంపించి నా జీవితంలో నవ కాంతుల్ని నింపాడు.

సెంటిమెంట్స్ అని కొట్టివేయకండి. ఆ సెంటిమెంట్స్‌లోని తీయదనాన్ని అనుభవంలోకి తెచ్చుకోవాలని ఎన్నాళ్లనుంచో కోరుకుంటున్నాను. పెళ్లంటే పందిరి, బంధువులు — మేళతాళాలు—పూల మండపం—మిల మిల మెరిసే మంగళసూత్రాలు — వేదమంత్రాల హోరు! ఇవన్నీ వుంటేనే నిండుదనం.

నాకు అలాగే మన పెళ్లి జరగాలని కోరికగా వున్నది.

మీకు ఇష్టం లేకపోతే మానేద్దాం—''

మానస మాటలకు నవ్వాడు విజయ్.

''దేవిగారికి చాలా కోరికలున్నాయ్! ఏమో అనుకున్నాను. అప్పుడు అడదానివనిపించావు. ఓ. కే. నీ కోరిక ప్రకారమే అరేంజ్ చేస్తాను. కాకుంటే బంధువులే వుండరు మన పెళ్లికి. అయినా స్నేహితులు — హితులు వున్నారుగా. వాళ్లు చాల్లే మన పెళ్లికి సాక్ష్యం—'' అని ఆమె కోరిక నిమిత్తం ఇలా కోవెల్లో వివాహం ఏర్పాటు చేయించాడు విజయ్.


తను కోరిన విధంగా జరుగుతున్నందుకు, తన మాటకు అతను విలువ ఇచ్చినందుకు మానస ఆనందం అంతా ఇంతాకాదు.


పెళ్లయిపోయింది. వచ్చిన మిత్రులు డిన్నర్ తీసుకుని విజయ్‌ను ప్రత్యేకంగా అభినందించి వెళ్లిపోయారు.

ఇక నూతన దంపతులు ఇద్దరే మిగిలిపోయారు.

''అంతా వెళ్లిపోయారు. ఇక మనమే మిగిలాం—'' చిలిపిగా కన్ను గీటాడు విజయ్. అతని మనసులోని కోరికను అర్థంచేసుకుని సిగ్గుతో అందంగా నవ్వింది మానస.

(ఇంకా వుంది)





"నేను కుట్టుపని నేర్చుకున్నప్పటినుంచి, ఒక పరిపూర్ణమైన స్త్రీమూర్తిగా అనుభూతి చెందుతున్నాను."





మీ పిల్లలకు బట్టలు. కర్టెన్లు, కుషన్ కవర్లు... ప్రత్యేకతగల ఒక టేబుల్ క్లాత్. మీ చీరకు ఫాల్ వేసుకోవడం. లేదా ప్రతివారం చిరిగినవి కుట్టుకోవడం. కుట్టుపని, ఒక స్త్రీ తన వ్యక్తిత్వాన్ని వ్యక్తపరిచేందుకు ఆనందదాయకమైన ఒక మార్గం.

ఇది మనకు తెలుసు. ఎందుచేతనంటే, భారతదేశంలో మరే ఇతర కుట్టుమిషను కన్నా కూడా ఉషా కుట్టుమిషన్‌తోనే ఎక్కువ మంది స్త్రీలు కుట్టుపని చేస్తారు. ఉషా మిషనుని వాడటం, నిర్వహణ తేలికని వారికి తెలుసు. భారతదేశంలో తయారయ్యే మరే ఇతర కుట్టుమిషనుకంటే కూడా, ఉషాకు అధికంగా ప్రత్యేక సదుపాయాలు ఉన్నాయని వారికి తెలుసు. దీనికి, భారతదేశంలోకల్లా పెద్దదైన విక్రయానంతర సేవ మద్దతు ఉందని వారికి తెలుసు.

రండి, ఈ రోజే ఒక ఉషాని జాగ్రత్తగా పరికించండి.

ఉషా

అద్భుతమైన నాణ్యతకు ప్రతీక

ఉషా సం: 1 అయినది.

ఎందుచేతనంటే, దాని అద్భుతమైన నాణ్యతను అందరూ మెచ్చుకుంటారు.

ULKA-D-US-704

కొత్తగొంతులు

— టి.యల్. కాంతారావు

విదేశాల్లో క్రికెట్ గెలిచారు
మనవాళ్లు
అందాల పోటీలకు హాజరైనాయి
మన లేళ్ళు
అదుగో మన నాయకులు పదవీ
త్యాగాలు చేస్తున్నారు
మనబిడ్డలు కాల్పుల్లో చస్తున్నారు
ఇక్కడ కరువు మాట సరేగాని
ఉత్తరాది పంటల పౌష్కల్యం
చూడండి
బిచ్చగాడా! ఇంకా పాత చేతిని
చాపడమేనా?
పిచ్చిదానా! ఇంకా పాత దేహం
మూవడమేనా?

— డా॥ ఎన్. గోపి

ఎన్. గోపి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో వేమన కవిత్వంపై పరిశోధన జరిపి ప్రజాకవి వేమన అనే సిద్ధాంత గ్రంథాన్ని రాసి పి. హెచ్. డి. అనే డిగ్రీ పొందారు. వేమనవాదం అనే మరో విమర్శ గ్రంథాన్ని రాశారు. బ్రహ్మంగారి తత్త్వంమీద అనేక వ్యాసాలు రాశారు. సాధారణంగా పరిశోధనా రంగంలో పనిచేసే వ్యక్తులు కవిత్వం అందునా కొద్దో గొప్పో పాఠకులను కదిలించే కవిత్వం రాయటం కష్టం. 1976 లో తంగేడుపూలు కవితా సంకలనాన్ని, 1982 లో మైలురాయి కవితా సంకలనాన్ని వెలుగులోకి తెచ్చారు గోపీగారు. కవిత్వ పర్యవసానం చైతన్యమని, దాని దృక్పథం అభ్యుదయమని నమ్మి, నిశ్శబ్దమంటే మృత్యువని, మంచికో చెడ్డకో చప్పుడే గొప్పదని విశ్వశించి వర్తమాన స్తబ్దతా వల్మీకాన్ని బద్దలుకొట్టేందుకు ఈయన కవిత్వం రాస్తున్నారు.

అభ్యుదయ కవిత్వ ఉద్యమ లక్షణం కాని, గురజాడ అప్పారావుగారి హేతువాద, సంస్కరణవాద దృక్పథం కాని భాష కవితా యుగానంతర కవులందరూ కవిత్వంలో కేంద్ర బిందువుగా సమాజం, సామాన్య మానవుడు, శ్రామికులు, రైతుకూలీలు నిలిచారు. వస్తువు ఒకటే అయినా రూపాలు భిన్నం అవటంలో కవుల వ్యక్తిత్వం బహిర్గత మవుతుంది. గోపీగారి తంగేడుపూలు, మైలురాయి రెండు సంకలనాలు వచన కవిత్వాన్నే భావాభివ్యక్తికి వాహికగా చేసుకున్నాయి. కవిత్వం ఉన్నా లేకపోయినా పద్యం రాయటం ఎంత కష్టమో, వచన గేయం రాయటమూ అంతే కష్టం. నియమాను సరణమా? నియమోల్లంఘనమా? అన్నది చర్చేకాదు. రాసిందాంట్లో కవిత్వం ఉన్నదా? లేదా? అన్నది ప్రశ్న. మళ్ళీ ఆ కవిత్వం అభ్యుదయకరమైనదా? ప్రయోజన శూన్యమైనదా? అనేది వేరొక ఆలోచన. గోపీగారి రెండు సంకలనాలూ సంఘాన్ని, దాన్ని ఆశ్రయించుకొని జీవిస్తున్న మనిషిని గురించి రాసినవే. ఆది నుంచీ — ఏవో కొన్ని అక్కడక్కడా మార్పులు జరుగుతున్నా ఈ సమాజంలో డబ్బు ఉన్నవాడు లేనివాణ్ని, తెలివైనవాడు తెలివిహీనుణ్ని, బలమైనవాడు బలహీనుణ్ని మోసం చేస్తూనే ఉన్నాడు. ఈ సంఘం మోసం మీద నుంచే నడుస్తున్నది. ఈ మోసం అంతం కావటానికే కవులూ కళాకారులూ వారి శిల్పాన్ని ప్రజాయత్తం చేస్తున్నారు.

ఎటుచూసినా ఎండమావులు ఎదురవుతూ ఎడద ఎడారిగా మారుతున్న చోట, నిరాశా నిస్పృహాల చీకట్లు అలముకొన్న చోట, అడగడుగునా అపజయాలే ఎదురవుతున్నచోట, భయాల వలయాలు మనిషిని చుట్టుముట్టి ఉక్కిరి బిక్కిరి చేస్తున్నచోట, కలలు కలతలతో కన్నీరు కారుస్తున్నచోట, ఆశలు రాలిపోతూ ఆనందం అంతమవుతున్న కాలాన, కోట్ల కోట్ల నయనాలు శతాబ్దాల చీకట్లను మోస్తున్న కాలాన, ఎక్కిపోతున్న పాదాలక్రింద బక్క ప్రాణాల ఊపిరులు మూలుగుతున్న సమయంలో స్వాతంత్ర్య స్వప్నం పీలికలుగా చినిగిపోయి అలసిన కళ్ళల్లో నైరాశ్య ధూమం కమ్ముకుంటున్న వర్తమానం ఇది. దేశంలో అధికాధిక జనాభా నవ్వులు అల్పసంఖ్యాకుల ఇనప్పెట్టెల్లో బందీలవుతున్నాయి. వెచ్చని గదుల్లో ఒకరినిషాకై ఎందరెందరి కళ్లల్లోనో వెలుగులు ఆరిపోతున్నాయి. సాటి మానవుల రోదన ధ్వనుల్ని సన్నాయి పాటలుగా మార్చుకొని ఆనందిస్తున్న మానవాధములు సమాజాన్ని పాలిస్తున్నారు. స్వంత సుఖాల పైరుకోసం ఎదుటివాని రక్తాన్ని ఎరువుగా వాడుకుంటున్న అహింసావాదులు చట్టబద్ధమైన హింసను ప్రోత్సహిస్తున్నారు. ఇట్లాంటి సాంఘిక పరిస్థితుల్లో, చారిత్రిక వాతావరణంలో అహింస హంసలా నడిచి రావటానికి, ఆనందం మందారంలా విచ్చటానికి కత్తికి మిత్తికీ కలహం వచ్చి కత్తి కొత్త సిద్ధాంతాన్ని వెలిగించే వత్తిగా మారాలని గోపీగారు చెబుతున్నారు. వ్యక్తి సంఘటిత శక్తిగా మారి, నిటారుగా నిలబడి విలువైన గమ్యంకోసం ప్రయాణిస్తే ఈ సమాధిమీద వికసించే పువ్వులు ఉద్భవిస్తాయని గోపీగారి విశ్వాసం. అందుకు ఉద్యమించే కవిత్వం రాయడమే ఈయన ధ్యేయం. తన చుట్టూ ఉన్న అన్యాయాన్ని తన లోపలి ఆకలిని, గుండెల్లో బాధను, కళ్ళల్లో దుఃఖాన్ని, నానా రకాల భ్రమల్ని కవిత్వంలో దహనంచేసి సుస్నాతుడై మానవీయ గీతాన్ని ఆలపించాలనే ప్రయత్నం గోపీగారి కవిత్వం.

ఈ సంఘాన్ని మార్చాలనే ప్రయత్నంలో సంఘంతో పోరాడి, సంఘానికి ఎదురొడ్డి ఎంతో మంది బలి అయ్యారు. వారి వారసత్వంలోని పాటను, కోపాన్ని దీపాన్ని తానందుకుని ఈ ప్రపంచాన్ని మారుస్తానని కవిత్వం ద్వారా వాగ్దానం చేస్తున్నారు గోపీగారు. తన అక్షరాలు చెమట సిరాతో తడిసిన పాదాలతో కాగితాలమీద అడుగు జాడలను ముద్రిస్తూ జనం గుండెల్లోకి నడిచిపోతాయని గుండెల్లోంచి నమ్ముతున్నారీయన. తాము బ్రతికి నన్నాళ్ళూ తమ రెక్కలు ముక్కలు చేసుకొని వేరొకరికి రెక్కలు తొడిగి, తమ చెమటను కాలువలుగ వేరొకరి భూముల్లోకి ప్రవహింపజేసి, తమ చర్మంతోటి వేరొకరి కాళ్ళకు మన్ను అంటకుండా చెప్పులు కుట్టిఇచ్చిన జాతి పట్టెడన్నానికి, జానెడు నేలకు నోచుకోనపుడు వారి కష్టాలకు, కన్నీళ్ళకు కారకులైన వారిమీద తిరగబడేందుకు సిద్ధంచేసే యుద్ధ కవితకు కొంచెం దూరంగా ఉన్నారు గోపీగారు. అయితే పంటపొలాల పక్కనే పగిలినభూములు, చాకిరీదార్లైన చంటిపిల్లలూ, పిట్టగోడల మట్టి నీడల్లో ఎవరో పొట్టల పిల్లలు, అందని ఆసుపత్రులు, మూగవోయిన సంస్కృతి, కాలనీల కొరడవులు, పట్టపగలు చీకట్లు, తలమీద నీడలేని తలపండిన బిచ్చగాళ్ళు, బతుకు నలిగి తొడిమలే లేని మూగ మూగపూలు గోపీగారి కవిత్వంలో ప్రాణాన్ని పోసుకున్నాయి. తన గర్జన యుగాంతపు కనుమలదాకా ప్రతిధ్వనిస్తుందని, తన రక్త నేత్రాలు భవిష్యోదయ సంధ్యలో శతపత్రాలై నవ్వుతాయని తన గీతాలు పీడిత మానవులకు దీవెనలని, వాళ్ళ బతుకుల్లో ఆశా కుంకమలు చల్లుతాయనే ఆత్మ విశ్వాసం ఉన్న కవి ఎంత త్యాగానికీ, ఎంత శ్రమకూ సిద్ధపడాలి.

కొందరి ముఖాల్లో కాలం ఆగిపోతే
రగిలే క్షణాలు
పగిలే బాంబులయితే
లెక్కించగలవా రక్త సంవత్సరాలు?
చావులాంటి
వేల వేల యేండ్ల నిద్రమీద
ఎండలాంటి మెలుకువ ఫెళ్ళున కొడితే
పుడుతుంది ప్రపంచమంత పద్యం చదవ
గలవా ఇప్పుడైనా? ★

అవసరం

రేకటి సుబ్రహ్మణ్యం



సీట్లో కూర్చున్నాడుగాని– పనిమీద కాన్‌సన్ ట్రేట్ కాలేకపోతూంది విశ్వేశ్వరయ్యమైండు.

ఆ రోజు ఉదయం పది గంటలకు– తన తోడల్లుడి నుండి ఉత్తరం వచ్చింది. 'తన దగ్గిర అప్పుగా తీసుకున్న ఐదువేల రూపాయల్ను అర్జంటుగా పంపవలసిందని– తన కూతురిపెళ్ళి అనుకోకుండా నిశ్చయం కావడంవల్ల డిమాండ్ చేస్తున్నానని– 'ఏమనుకోవద్దని' వుత్తరంలో వుంది –

తల తాకట్టయినా పెట్టి తప్పక తెచ్చి వ్వమని మొత్తం వుత్తరానికి 'సెంట్రల్ ఐడియా'– ఉన్నపాట్న అయిదువేలు తక్కువ వ్యవధిలో ఎక్కడ తీసుకురావడం ? తోడల్లుడి దృష్టిలో ఐదు రూపాయల్లా వున్నట్టుంది– అనే సందిగ్ధంలో వుండగా మరో టెలిగ్రామ్ వచ్చింది. టెలిగ్రాఫ్‌వారి నిర్లక్ష్యానికి గుర్తుగా– వుత్తరం కంటే ముందుగా టెలిగ్రామ్ యిచ్చి నప్పటికీ ఆలస్యంగా అందడం విడ్డూరమనిపించ లేదు విశ్వేశ్వరయ్యకు.

ఆ రోజంతా ఐదువేలు ఎలా సంపాదించాలి? అనే ప్రశ్నకు అతని బుర్ర లెక్కలు వేస్తూంది. చివరికి ఆన్సర్ లంచ్ అవర్‌కు జీరో వచ్చింది– ఓ ఇంజనీరింగ్ ఆఫీస్‌లో హెడ్‌క్లర్క్ విశ్వేశ్వరయ్య. కంట్రాక్టర్ల దగ్గర సాధ్యమైనంత మేరకు గుంజాడు. సాయంకాలానికి ఐదు వందలు జమగూడాయి. అందులో సగభాగం విధిగా అసిస్టెంట్ యింజనీర్‌కు చెల్లించాలి. మిగిలేది బోడి రెండు వందల యాభై రూపాయలు. అయిదువేల అవసరానికి ఈ మొత్తం ఏ మూలకు ? రేపే డబ్బును పంపాలి–తోడల్లుడు రాసిన వుత్తరం + టెలిగ్రామ్ ప్రకారం—

ఏ ఇ గారు మొహమాటం మనిషి. డైరెక్టుగా బిజినెస్‌లోకి దిగేరకం కాదు. తనకు కావల్సిందేమిటో ఆఫీసులో కంట్రాక్టర్ల దగ్గర అడిగిపుచ్చుకోడు. బల్లక్రింద చెయ్యి పెట్టడు గాని– హెడ్‌క్లర్క్ జేబులు నిండాయా, లేదా అని గమనిస్తూ వుంటాడు దినమంతా.

కాని– క్యాంపులకెళ్ళినప్పుడు కంట్రాక్టర్లు కవర్లు అందిస్తుంటారని జీప్ డ్రైవర్ నరసయ్య ద్వారా విన్నాడు. ఈ సమయంలో తనను ఆదుకునే వ్యక్తి అసిస్టెంట్ ఇంజనీర్ అని చివరికి తీర్మానించుకున్నాడు.

ఇలా తనలో తను తన్నుకుంటుండగా డ్రాఫ్ట్స్‌మన్ జోగారావు కుర్చీ దగ్గరికివచ్చి కూలబడ్డాడు మరో కుర్చీలో –

''ఏమిటిసార్ ! ప్రొద్దున్నుంచి మిమ్మల్ని గమనిస్తూనే వున్నాను. పరధ్యానంలో వున్నారు. ఏదో... గడ్డు సమస్యల్లో వున్నట్లుందే ?'' అన్నాడు నెమ్మది నెమ్మదిగా అతను.

''అబ్బే ! ఆలోచనాలేదు. పాడు లేదు. నెలాఖరుకావొచ్చిందిగా. మన జీతాల బిల్లులు రాస్తున్నాను. ఎల్డీసీ లీవులో వున్నాడుగా. నేనివి రాయకపోతే – మీకూ–మన సిబ్బందికీ యిబ్బంది. కాస్త సాయంచేయండి. ఇదిగో... ఈ పేర్ల కెదురుగా వాళ్ల పేమెంట్ వేయండి. క్రింద సంతకంపెట్టి, ఏ ఇ గారి దగ్గరికి పంపిం చేస్తాను. చెక్కు వచ్చేస్తుంది. రేపు మార్నింగ్ కల్లా డ్రా చేసుకోవచ్చు. రేపు సాటర్‌డేకదా !''

''నిజమే అనుకోండి ! కాని మిమ్మల్ని చూస్తూంటే ఈ బిల్లులకోసం తన్నుకుంటు న్నట్లులేదు. క్రితం నెలలోకూడ మన ఎల్డీసీ లేడు. అప్పుడుకూడా మీరే బిల్లులు రాశారు. ఆయన మరో నెలవరకూ రాడుగా ? సిక్‌లీవ్‌లో వున్నాడు !''

విశ్వేశ్వరయ్య తడబడ్డాడు. ఆ తడబాటు కప్పిపుచ్చుకునే సామర్థ్యం లేకపోడంతో పట్టు బడిపోయాడు.

''ఏమీలేదు. ఒకమాట. నాకు అర్జంటుగా అయిదువేల డబ్బు కావాలి. మా తోడల్లుడికి అర్జంటుగా టి. ఎమ్. ఓలో పంపాలి !''

''అదన్నమాట కథ. మనల్ని యిలాంటి సమస్యల్లో ఆదుకునేందుకు ఇప్పుడున్న శాల్తీ ఒక్కడే ఒకడు. వాడే మన ప్యూన్ పుల్లారావ్!''

మీ తలనొప్పికి సత్వర నివారణకు అత్యవసర మైనది – ఆస్ప్రో అనే అడ్వర్టయిజుమెంటులా వుంది అతని ధోరణి.

ఆ మాటతో ఉలిక్కిపడ్డాడు విశ్వేశ్వరయ్య.

''ఏమిటి ? ప్యూన్ దగ్గర అయిదువేల రూపాయలు అప్పు అడగడమా ? అసలు వాడి దగ్గర అంత డబ్బు ఎక్కడినుంచి వస్తూంది?''

చిన్నగా నవ్వాడు డ్రాఫ్ట్స్‌మన్.

''ప్యూన్ దగ్గర డబ్బులుండకూడదనే రూలు ఎక్కడ వుంది సార్ ! క్రితం నెల్లో వెయ్యి రూపాయలు నేను అప్పు తీసుకున్నాను. అడిగిచూడండి. వడ్డీకూడా ఎక్కువగా తీసుకోడు. మనం ఎంతయిస్తే అంత !''

''సరే!'' అందామనుకున్నాడు విశ్వేశ్వరయ్య. ఆ మాట అనేందుకు సుపీరియారిటీ కాంప్లెక్స్ అడ్డొచ్చిపడి, మౌనరూపం దాల్చుకుంది. డ్రాఫ్ట్స్‌మాన్ కాస్సేపుండి తన వర్క్‌మీదకి వెళ్లి పోయాడు.

పుల్లారావ్ ఎవరినీ యాచించడు. నిజంగా చెప్పాలంటే–ఆ ఆఫీస్‌లో పన్జేసే తన కంటే, ఏ ఈగారి కంటే ఉన్నతుడు. అలాంటి మనిషి యింత డబ్బును ఎలా సంపాదించాడు ? స్టాఫ్‌కు

అవసరం

తెలీకుండ మామూళ్లు వసూలు చేసుకుంటున్నాడేమోనన్న అనుమానం వచ్చిందతనికి.

ఆ రోజు సాయంత్రం అడ్రసు కనుక్కుని –ఎవరూ చూడని సమయంలో రాత్రి తొమ్మిది గంటలకు పుల్లారావ్ యింటిముందు స్కూటర్ ఆపాడు విశ్వేశ్వరయ్య. ఆ స్కూటర్‌ను ఆరు సంవత్సరముల క్రితం ఐదువేలుపెట్టి కొన్నాడు. ఇప్పుడు అమ్మదామన్నా కొన్నది మొదట సెకండ్ హ్యాండే కనుక దానికి రీసేల్ వ్యాల్యూలేదు. అందువల్ల తనే వాడక తప్పడంలేదు.

స్కూటర్ యింటిముందాపిన విశ్వేశ్వరయ్యకు ఆశ్చర్యమేసింది. ఆ ఇల్లు నిజంగా పుల్లారావ్‌దేనా అని అనుమాన మేస్తుందతనికి. అంత డబ్బున్న పుల్లారావ్ ఈ ఇంటిలోనేనా వున్నది అని అతని సందిగ్ధం. జేబులో నుండి స్లిప్ తీసి, ఎడ్రస్ చూసుకున్నాడు. అన్నీ సరిపోయాయి.

పూరిగుడిసె లాంటి యిల్లది. ఇంటిని చూస్తే లోపల పేకాట ఆడుతుంటారేమోనన్న సందేహం వస్తుంది. కాని బయట నీట్‌గా వున్నదాన్నిబట్టి – లోపల సంస్కారవంతులే సంసారం చేస్తున్నారని అనుకోక తప్పదు. డోర్‌నంబర్ తడిక తలుపుమీద మాసిపోయి, అరిగిపోయి వున్నాయి. పరిశీలనగా చూస్తే తప్ప అంకెలు సరిగ్గా కన్పించడంలేదు. ఈ పూరి గుడిసె లాంటి యింటిలో తనకు అయిదువేలు దొరుకుతాయని నమ్మకంలేదు విశ్వేశ్వరయ్యకు.

స్కూటర్‌కు స్టాండు వేసి, దాని ప్రక్కనే నిల్చున్నాడు. స్కూటర్ ఆగిన చప్పుడు విని కాబోలు బయట ఆడుకుంటున్న ఇద్దరి కుర్రాళ్లలో ఒకడు ఆయన వైపుకు చూసి యింట్లోకి పరుగెత్తాడు. మరో రెండు నిముషాల్లో పుల్లారావ్‌తో బయటికి వచ్చాడు.

''రండిసార్ ! ఇంతదూరం వచ్చారేమిటి?'' సాదరంగా ఆహ్వానిస్తూ అన్నాడు పుల్లారావ్.

విశ్వేశ్వరయ్య ఆ పూరి గుడిసెలోకి అడుగు పెట్టాడు. ఆయన అనుకున్నట్లు లోపల పేకాట ఆడే వ్యక్తులు ఎవరూ లేరు.

పూరిగుడిసే అయినా – వంటగదిని వేరు చేస్తూ, పల్చటి బ్లాకర్టన్ మధ్యలో వ్రేలాడుతూంది. ట్రాన్స్పరెంట్‌గానున్న ఆ గుడ్డ ఆవల పుల్లారావ్ భార్య పొయ్యి ముందుకూర్చుని ఏదో వండుతూండడం అస్పష్టంగా కన్పిస్తోంది.

విశ్వేశ్వరయ్య ఓ చెక్క కుర్చీమీద కూర్చున్నాడు. బిడియానికి అలవాటుపడ్డ ప్యూన్ పుల్లారావ్ చేతులు కట్టుకుని ఆఫీసులోలాగే వినయంగా నిలబడ్డాడు. అతనలా వుండడం వల్ల విశ్వేశ్వరయ్యకు డబ్బడగడం కాస్త యిబ్బందిని కల్గిస్తూంది. అయినా ఆత్మాభిమానాన్ని చంపుకుని అడుగక తప్పలేదు.

''పుల్లారావ్ ! నా కర్జంటుగా అయిదువేల రూపాయలు కావాలి. వడ్డీకూడ యిచ్చేస్తాను!''

ఎప్పుడూ 'ఓయ్ !' అని ఆఫీస్‌లో పిలిచే విశ్వేశ్వరయ్య అవసరంతోటి కాబోలు పేరుతో పిలవకతప్పలేదు. అవసరం అలాంటిది.

పుల్లారావ్ ఆశ్చర్యంతో విశ్వేశ్వరయ్య వైపుకు చూశాడు. అలా చూస్తాడని వూహించిన విశ్వేశ్వరయ్య – పాతచెక్క రాక్‌లోనున్న పుస్తకాలకేసి చూస్తూ కూర్చున్నాడు. విసుగనిపించాక చూపు మళ్ళించి–గోళ్ళవైపుకు చూసుకున్నాడు. చెప్పాలంటే ఎంతో యిన్‌కన్వీనియెంటుకు గురవుతున్నాడన్నది నిజం.

పుల్లారావ్ కొడుకువచ్చి, విశ్వేశ్వరయ్య ప్రక్కనున్న జాజికాయ చెక్క పెట్టెమీద చాలీ చాలని చక్కెర, పాలకంటే నీళ్ళు ఎక్కువగా వున్న ఓ కషాయంలాంటి ద్రవాన్ని తెచ్చి అక్కడ పెట్టి వెళ్ళిపోయాడు. మొదట అదేదో వర్షాకాలంలో చూరునుండి కారే నీళ్ళేమో అనుకున్నాడు.

''సార్ ! కాఫీ తీసుకోండి !'' అన్న పుల్లారావ్ మాటతో అది కాఫీయని సర్టిఫై చేసుకున్నాడు. బలవంతంమీద అందులోని సగ భాగాన్ని లాగించి, సిగరెట్ వెలిగించాడు.

ప్యూన్ పుల్లారావ్ బ్లాకర్టన్ను తొలగించుకుని లోపలికెళ్ళి ఓ చెక్కపెట్టెముందు ఓ అయిదు నిముషాలాగి, ఐదువేల రూపాయలతో తిరగివచ్చాడు. అవి దొంగనోట్లేమోనన్న అనుమానం లేదు. అసలు, సిసలైన కరెన్సీయే !

విశ్వేశ్వరయ్య లెక్కపెట్టుకున్నాడు. అయిదు వేలకు నోటురాసి యిచ్చాడు. అయితే యింత డబ్బు పుల్లారావ్‌కు ఎక్కడిదనే అనుమానం అతడ్ని పీక్కుతింటూనే వుంది.

* * *

విశ్వేశ్వరయ్య తోడల్లుడికి డబ్బును పంపించాడు. ఐదువేల రూపాయలు అడిగిన వెంటనే యిచ్చిన పుల్లారావ్‌కు మనసులోనే కృతజ్ఞతలు తెల్పుకున్నాడు.

మరుసటిరోజు ఆఫీసులో జోగారావ్ మళ్ళీ మాటలు కలిపాడు.

''డబ్బు అడ్జస్టు అయిందాసార్!''అంటూ.

తలాడించాడు విశ్వేశ్వరయ్య. ఆ తర్వాత అడిగాడు.

''ఇంతకీ... పుల్లారావ్‌కు ఆ డబ్బు...!''

''ఎక్కడిదనికదా మీ అనుమానం. మనం హైక్లాస్ పీపులం అయినా, లోక్లాస్ పీపులం అయినా ఈ డబ్బుతో అట్టే యిబ్బంది వుండదు సార్. హైక్లాస్ పీపులం అయితే ఫోన్లో మాట్లాడి మన స్టేటస్‌కి సంబంధించిన వారి నుండి డబ్బులు ఈజీగా గేదర్ చేసుకోవచ్చు. లోక్లాస్ పీపులం అయితే ముందు జాగ్రత్తతో డబ్బులు ఆదా చేసుకోవచ్చు. కాని మనం మిడిల్ క్లాస్ పీపులం. పైగా ఉద్యోగస్తులం. అందు

లోనూ యింజనీరింగ్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగస్తులం. కంట్రాక్టర్లనుండి డబ్బులు రాబట్టుకోవాలంటే డిగ్నిటీ మెయిన్‌టైన్ చెయ్యాలి. అందుకు తగ్గట్టు వేషధారణ అవసరం. అందుకోసం విధిగా మంచి ఖరీదైన బట్టలకోసం కొంత మొత్తాన్ని కేటాయించక తప్పదు. మిగిలేది సున్నా! మన హోదాకు యింట్లో ఫ్రిజ్ వుంటే బావుంటుందని భావించుకుంటాము. దాని ఖరీదు నేను చెప్పనక్కరలేదు. వేలల్లో వుంటుంది. ఇది అనవసరపు ఖర్చు. పైగా దానికి కరెంటు నిమిత్తం నెలకు నలభై రూపాయలదాకా బేర్ చేయాల్సి వుంటుంది. ఐదు వేలకు వడ్డీ వేసుకుంటే నెలకు దానిమీద ఎంత అనవసరంగా మనం ఖర్చుపెడుతున్నామో అర్థమవుతుంది. దాని వుపయోగం వుండొచ్చు. కాయగూరలు, పండ్లు నిలువ వుంచుకోవచ్చు. కాని మార్కెట్‌లో ఏరోజుకారోజు తాజాపండ్లు కాయగూరలు దొరుకుతాయి. అలాటపుడు ఈ ఫ్రిజ్ అవసరమేమిటి? ఇంట్లో ఫ్రిజ్ వుండడం కేవలం ప్రిస్టీజి కోసమే!

ప్రిస్టేజీలో యిరుక్కుని మనకుతెలీకుండనే డబ్బును వృధా చేస్తున్నాము. ఇంట్లో ప్రతి ఒక్కరికీ ఓ బ్రష్షు, టూత్‌పేస్ట్ అవసరం. నెలకు అందరిమీద వీటికోసం యాభై రూపాయలదాకా ఖర్చు. ప్రకృతి ప్రసాదించిన వేపచెట్లు మనకు వూరినిండా వున్నాయి. దంతధావనానికి వేపపుల్ల ఎంతో ఆరోగ్యప్రదమైందని ఆయుర్వేద సిద్ధాంతము. దాన్ని పుల్లారావ్ నమ్ముతాడు. ఖర్చు లేకుండా దొరికే వేప్పుల్ల ఎంత ఆదా చేస్తుందో మనకు తెలిసి కూడ పట్టించుకోము.

ఈ టూత్‌పేస్టులూ, బ్రష్షులూ మన పరిసరాల్లో నివసించే వ్యక్తులు వాడుతూంటారు గనుక మనం వేపపుల్లను వాడడం యిన్ఫీరియారిటీగా ఫీలవుతాము. తద్వారా డబ్బు వేస్ట్. కాని మనిషికి కావాల్సింది ప్రిస్టేజ్!

మనిషి ఆరోగ్యానికి నడక ఎంతో అవసరం. కండరాల చలనం మనం వయస్సు పీరుతూన్నా వుత్సాహంగా వుండటానికి తోడ్పడుతుంది. పుల్లారావ్ ఆఫీసుకు నడిచే వస్తాడు. కాని మీకూ, నాకూ స్కూటరు ఎందుకు అవసరం? ప్రిస్టేజీకోసం. కాని దాని మెయిన్‌టెనెన్స్‌కు, పెట్రోలు ఖర్చులకు ఎంత ఖర్చవుతుంతో తెల్సి కూడ రేపటి అవసరాన్ని గూర్చి ఆలోచించడానికి ప్రయత్నించము.

సినిమాకెళితే బాల్కనీ కెళ్ళాల్సిందే! ఫామిలీతో వెళ్తే ఈ సిటీలో ముప్పయి రూపాయలకు ముప్పు. కాని మనకు ప్రిస్టేజి అవసరం గనుక మరో క్లాసుకు వెళ్ళము.

పుల్లారావ్ 'లోక్లాస్ పీపుల్' నుండి వచ్చాడు. ఒక వంద అటో, యిటో మనంత జీతమే ప్రతినెలా అందుకుంటున్నాడు. అతనికి ప్రిస్టేజి అవసరం లేదు.

వీటికి దూరంగా వుండడంవల్ల కొంతవరకు జీతంలో ఆదా చేసుకున్న డబ్బును మంచి మిత్రులకు, తక్కువ వడ్డీకి యిచ్చి సాయపడుతూ మిగులు డబ్బును యింప్రూవ్ చేసుకుంటున్నాడు. మనం ప్రెస్టేజిలో యిరుక్కుని, అవసరం వచ్చినపుడు అప్పుల పాలవుతున్నాము సార్! పుల్లారావ్‌కు, మనకూ అదే తేడా!"

విశ్వేశ్వరయ్యకు యింట్లో వున్న ఖరీదైన ప్రతివస్తువూ ఎందుకూ పనికిరానివిగా అనిపిస్తున్నాయి. ఎంత తక్కువ ధరకైనాసరే రేపటి కల్లా ఆ ఫ్రిజ్జూ, స్కూటర్ అమ్మేయాలనే నిర్ణయం మొదటిసారిగా అతని బుర్రలో జొరబడింది. ★

సత్యం వద్ధ - ధర్మం చెర

అవధానుల జగన్నాథ రావు & మల్లంపల్లి గాంధీ రామారావు

బస్సుదిగి గాభరాగా జేబులు తడుముకున్నా.

ఒంటినిండా చెమట్లు పట్టేశాయి. కాళ్ళ కిందనున్న భూమి అలా పాతాళంలోకి దిగిపోయి నట్లనిపించింది. నవనాడులూ ఎవరో బలవంతంగా బంధించినట్లయింది. ఈనగాచి నక్కలపాలు చేసి నట్లయింది పరిస్థితి. నెల జీతమంతా జాగ్రత్తగా పెట్టి, ధ్యానమంతా జేబులోని పర్సుమీదే ఉంచుకున్నా, దిగడం హడావుడిలో ఎవడో ఒడుపుగా కొట్టేశాడు.

ఒంటిమీదకి కాస్త తెలివి వొచ్చేసరికి, దిగిన బస్సు కనుచూపుమేర దాటి వెళ్ళిపోయింది. నాతో బాటుదిగిన మరి నలుగురూ, నాలుగు వైపులా వెళ్ళిపోయారు.

ఏం చేయడానికీ తోచలేదు. సిగరెట్ వెలిగించి, గట్టిగా ఓ దమ్ములాగి ఇంటివైపు నడక సాగించాను. కాలింగ్‌బెల్‌కి తలుపు తీసిన శ్రీమతితో మాట్లాడకుండా నేరుగా బెడ్‌రూమ్‌ లోకిపోయి మంచంమీద కూలబడ్డా.

కళాకాంతులు లేని ముఖం చూసేసరికి శ్రీమతికి అర్థమయిపోయింది — ఏదో జరగకూడని విషయం జరిగిందని. మాట్లాడకుండా, చల్లటి మంచినీళ్ళు ఓ గ్లాసు చేతికందించి వంటింట్లోకి వెళ్ళిపోయింది.

* * *

''కాఫీ తీసుకోండి. కాస్త సుఖువుగా ఉంటుంది'' అంది సీత.

చిక్కటి కాఫీ గొంతులోకిపడేసరికి మనస్సుకి హాయిగా అనిపించింది.

పక్కనున్న స్టూలుని మంచానికి దగ్గరగా లాక్కుని, నుదిటిమీద చేయి వేసి ''ఏం జరిగిందండీ ?'' అంది ప్రేమగా. సీతలోని ఆ నిబ్బరమంటేనే నాకు ప్రేమ. వచ్చిన వెంటనే ప్రశ్నలతో వేధించకుండా అవసరాలు గమనించి నడుచుకొనే ఆ తత్వం నాకెంతో యిష్టం.

''పర్సు ఎవడో కొట్టేశాడు సీతా !'' అన్నాను దిగులుగా — గడపవలసిన నెల రోజులు జ్ఞాపకంవచ్చి. ఎంత దాచుకుందామనుకున్నా గొంతులోని దుఃఖం బయటపడిపోయింది. నాకు తెలియకుండానే కళ్ళు చెమ్మగిల్లాయి.

ఐదు నిముషాలు ఇద్దరి మధ్యా నిశ్శబ్దం రాజ్యమేలింది,

''పోలీస్ రిపోర్ట్ యిచ్చారా ?'' అడిగింది సీత. అప్పుడు జ్ఞాపకం వచ్చింది — దొరకడానికి అవకాశం, ఆశా లేశమాత్రమే ఉన్నా, దాని కూడా పోలీస్ రిపోర్టీయాలని ముఖం కడుక్కొని యిద్దరం కలసి, దగ్గర్లోనే ఉన్న పోలీస్ స్టేషన్‌కి వెళ్ళి రిపోర్టిచ్చివచ్చాం.

* * *

పరామర్శనీ, ఓదార్పునీ బొత్తిగా సహించలేని తత్వం నాది. ఆఫీసులో అందరికన్నా ముఖ్య సన్నిహితుడయిన విశ్వాసానికితప్ప, మరెవరికీ జరిగిన జేబు దొంగతనం గురించి చెప్పలేదు.

ఆ విషయాన్ని పూర్తిగా మరచిపోయి, మెల్లగా పనిలోకి జారుకుందా మనుకునే తరుణంలో ''థాంక్స్! గురూ గారూ !'' అన్న వెంకట్రావు పిలుపు విని తలపైకెత్తాను.

ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చొని, నెమ్మదిగా నా చేతికి రెండు వంద నోట్లు అందించాడు.

''ఏమిటివి ?'' అన్నట్లు ప్రశ్నార్థకంగా చూశాను.

''నిన్న జీతాల్రోజు నాకు అర్జంటు అవసరం వచ్చి మీ దగ్గర తీసుకున్నాకదండీ. ఇంటికెళ్ళే హడావుడిలో మరిచిపోయుంటారు'' అన్నాడు వెంకట్రావు నెమ్మదిగా.

అప్పుడు జ్ఞాపకం వచ్చింది— ఆ రోజేదో ఆఫీసు పనిమీద బైటకెళ్ళిన వెంకట్రావు వచ్చేసరికి పే క్లార్క్ వెళ్ళిపోయాడని, అందువల్ల వెంకట్రావు చేబదులుగా రెండువంద లడిగి తీసుకున్నాడనీ.

''మీకే నేను థాంక్స్ చెప్పాలి... సరిగ్గా టైముకి సొమ్ము తిరిగి యిచ్చినందుకు'' అని వెంకట్రావుతో అన్నప్పుడు ఆయన నా వైపు అదోలా చూశాడు.

నా జేబెవడో కొట్టేశాడన్న విషయం తెలియని వెంకట్రావుకి నా మాటల్లో కృతజ్ఞతకన్నా, వ్యంగ్యం ఎక్కువగా కనిపించిందేమో?

* * *

బస్సు దిగి యింటి మొహం పడుతూ... జేబు తడుముకున్నా. భద్రంగా ఉన్న కొత్త నోట్లు మనసుకి హాయినిచ్చాయి. వీధంతా నిశ్శబ్దంగా ఉంది.

సడెన్‌గా ఓ సైకిల్ ఎదురుగా వచ్చి నా ముందు ఆగింది. ''మాస్టారూ ! నిన్నగాని పర్స్ పోయిందా ?'' ఎంతో సౌమ్యంగా అడిగాడ కేరేజ్ మీద నుండి దిగిన మనిషి. చీకటి పడి పోయినా ఇద్దరూ చలవ కళ్ళజోళ్ళు తీయలేదు సైకిల్ తొక్కిన మనిషి మాత్రం ముక్కురుడిల ఉన్నాడు. పర్స్ విషయమై ఆచూకీ తెలుస్తు దన్న సంతోషం, వారి రూపు రేఖల్ని అంతగ గమనించ నీయలేదు.

''అవునండీ !'' — అన్నాను ఆత్రంగా ఉదయం దొరికిన రెండు వందలతో బాటు మిగిలిన ఎనిమిది వందలు కూడా దొరికిపోత యన్న ఆశతో.

''ఎంతపోయింది ?'' అడిగాడు మారుతున్న గొంతులో కాస్త సౌమ్య రసాన్ని నింపుతూ.

''ఎనిమిది వందలు''—అన్నాను హుషారుగా.

''పోలీస్ స్టేషన్‌లో ఎంతకి రిపోర్టిచ్చావు?'' గొంతులోని సౌమ్యత కాస్త తగ్గడమే కాకుండా, ఏకవచన ప్రయోగంలోకి దిగిన— ఆ మనిషి మీద తొలిసారిగా కాస్త అనుమానం వేసింది — మంచివాడు కాదేమోనని. అయినా అవసరం నాది. కాస్త ఆలోచించే సరికి జ్ఞాపకం వచ్చింది — వెంకట్రావు చేబదులు తీసుకెళ్ళిన రెండు వందల గురించి మరచిపోయి, వెయ్యిరూపాయలు పోయాయని పోలీస్ స్టేషన్‌లో రిపోర్టిచ్చినట్లు.

''వెయ్యి రూపాయిలు'' అన్నాను వెర్రి వెధవలా.

''ఏం ? ఒళ్ళు తిమ్మిరెక్కిందా ?''అంటూ ఆ దవడా ఈ దవడా చడామడా చాచి నాలుగైదు లెంపకాయలు కొట్టాడు— అంతవరకూ మాట్లాడకుండా నిల్చున్న ఆసామీ.

అనుకోని ఈ హఠాత్పరిణామానికి కళ్ళు బైర్లుకమ్మాయి. గొంతెత్తి గట్టిగా అరవబోయాను సహాయం కోసం. ''అరిచావంటే జాగ్రత్త!'' అని పక్కన్నిల్చున్న ఆసామీ చేతిలోని కత్తి మోచేతికి తగిలి నెత్తురు చిమ్మింది. అరుద్దామన్న ఆలోచనకి ప్రాణభీతి ఆనకట్ట వేసింది.

''పెద్ద లచ్చాధికారి లాగ తయారయి, జేబులో ఏడుపుగొట్టు ఎనిమిదొంద లెట్టుగొని, ఎయ్యి రూపాయిలు పోనాయని రుపోర్టిత్తావా ఎదవనాయాలా ! నీ జోబులోని ఎనిమిదొందలూ నా ఒక్కడి నోట్లోకే పోతాయనుకున్నావేటి -


తప్పులెక్క సెప్పినా సరిపోడానికి. జేబు కొట్టిన గంటకల్లా పోలీస్ స్టేషన్‌కాడ సగం డబ్బు జమ సెయ్యకపోతే... మా పేనాలుంచుతారేటి ఆ ఫాయాల్లు. నీ ముష్టి రెండొందల తప్పు లెక్కకీ నా మక్కె లిరగదొబ్బాడా హెడ్డు. ఈ యిసయం మళ్ళా పోలీసోళ్ళకి సెప్పావంటే నువ్వు వల్లకాట్లోకి... నేను జైల్లోకి జాగర్త" అంటూ జుత్తు పట్టుకులాగి మరి రెండు వాయించాడు. నిస్సహాయుడనై తన్నులు తినడం తప్పించి మరేమీ చేయలేకపోయాను.

ఏదో టెంపో వస్తున్న చప్పుడు విని... వాళ్ళిద్దరూ సైకిలెక్కి తిరిగి తొందరగా వెళ్ళిపోయారు.

* * *

మర్నాడు ఆస్పత్రి ఖర్చులకీ, ఎక్స్‌రేలకీ, డాక్టర్ల ఫీజులకీ ఆ రెండొందలూ ఖర్చయిపోయాయి. ఆప్తమిత్రుడు విశ్వానికి కూడా ఈ విషయం చెప్పడానికి మనసంగీకరించలేదు.

★



మనసుకెళ్ళు

పి. అమనాథశంకర్



రాజారావుకి ఐదునెల్ల క్రితం ఓ బ్యాంకులో ఉద్యోగం వచ్చింది. అతను తనకు బ్యాంకు లోనే ఉద్యోగం రావాలని ఎన్నో కలలు కన్నాడు. ఎంతో కృషి చేశాడు. చివరకు విజయం సాధించాడు.

ఉద్యోగంలో జాయినైనరోజు అతను పొందిన సంతోషానికి అంతులేకుండాపోయింది. జీవితంలో తను అనుకున్నది ఒకటి సాధించాడు.

ఇక రెండోది సాధించాలి.

అతని రెండో ఆశయం : ఉద్యోగంచేసే ఓ అందమైన అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకోవటం. రాజారావుకి కట్నాలమీద—కానుకల మీద ఆశలేదు. అతనికేకాదు. అతని ఇంట్లో ఎవరికీ కట్నం తీసుకోవాలనే ఆలోచనలేదు.

తను ప్రేమించే అమ్మాయి కూడా ఉద్యోగస్తురాలయితే ఆర్థికంగా ఎక్కువ ఇబ్బందులను ఎదుర్కోవలసిన అవసరం వుండదని అతని నమ్మకం. అందువల్లనే రాజారావు ఉద్యోగంచేసే అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకోవాలనుకున్నాడు.

అతను ఉద్యోగంలో చేరిన మూడునెల్ల తర్వాత ఆ బ్యాంకులోకి సరళ కొత్తగా వచ్చి జాయినయ్యింది.

ఆమెను చూసిన వెంటనే రాజారావు హృదయం ఒక్కసారి సంతోషంతో కొట్టుకున్నది.

సరళ సన్నగా — నాజూగ్గా వున్నది. బంగారు రంగులోవుంది. పెద్దకళ్లు, సన్నని ముక్కు, ఎర్రని పెదవులు అతడికి ఎంతగానో నచ్చాయి. ఆమెలో అందంకంటే ఆకర్షణ ఎక్కువగా కనిపించింది.

వారం రోజుల తర్వాత రాజారావు — సరళతో బాగానే పరిచయాన్ని పెంచుకున్నాడు. ఇద్దరూ పక్కనే వున్న సీట్లలో కూర్చోవడం కారణంగా ఎక్కువసార్లు ఇద్దరూ మాట్లాడుకోవడం, ఒకర్ని చూసి ఒకరు అనేక సందర్భాల్లో నవ్వుకోవడం జరిగింది.

ఇలా జరిగిన తర్వాత రాజారావు తన మనసులో తప్పకుండా ఆమెనే పెళ్ళి చేసుకోవాలనే కోరికను బాగా పెంచుకున్నాడు...

మరికొన్ని రోజులు అవలీలగా, ఎంతో ఈజీగా గడిచిపోయాయి. ఈ గడిచిన రోజుల్లో రాజారావు — సరళ కావాలనే ఒకరి కళ్లలోకి మరొకరు చూసుకోవటం, తొట్రుపడటం, సిగ్గుపడటం జరిగిపోయి చివరకు ఇద్దరు ఒకర్నొకరు ప్రేమించుకునే దశకు చేరుకున్నారు.

ఒక సెలవురోజు సాయంత్రం రాజారావు ఎగ్జిబిషన్‌కి వెళ్లాడు. అక్కడ అతనికి ఓ స్టాల్ వద్ద నిల్చుని ఏవో బేరం చేస్తున్న సరళ కనిపించింది. ఆమె ఒంటరిగా వుండటం అతనికెంతో ఉత్సాహాన్ని కలిగించింది. అతను గబగబా ఆమె దగ్గరకు వెళ్ళి పలకరించాడు.

ఆమె ఆశ్చర్యంగా "మీరా!" అన్నది.

"అవును. ఒక్కరే వచ్చారేం ?" అన్నాడు.

"మా అమ్మను కూడా రమ్మన్నాను. కాని ఆమె రానన్నది. ఒంటరిగా వచ్చాను."

తర్వాత ఇద్దరూ కొంచెంసేపు ఏవో కబుర్లు చెప్పుకుంటూ నడిచి ఆ తర్వాత ఖాళీగా వున్న ప్రదేశంలో కర్చీఫ్‌లు పరచుకుని కూర్చున్నారు,

తను మనసులో వున్న ఆలోచనలను బయటపెట్టటానికి అంతకుమించిన సమయం రాదని అనుకున్నాడు రాజారావు.

అందుకే అతను "మీతో కొంచెం మాట్లాడాలి" అన్నాడు.

"మాట్లాడండి... బ్యాంకు విషయాలా?" అన్నది సరళ చిరునవ్వుతో —

"బ్యాంకు విషయాలు కాదు...నాగురించి" చిన్నగా అన్నాడు.



సాధించిన విజయాలు మనకు గర్వకారకమైనవి

మన అవసరాలకు తగినంతగా ఆహార పదార్థాలను మనమే పండించుకుంటున్నాము—అత్యధిక జనాభా గల దేశాలలో భారతదేశము రెండవది, ఇదివరలో ఆహార ధాన్యాల దిగుమతికై అమిత వ్యయం చేయవలసిన దృష్ట్యా, ఇది తక్కువ విజయమేమీ కాదు.

పారిశ్రామికంగా ముందంజ వేసిన ప్రపంచ దేశాలలో మన మొకరము—రేడియోల నుండి కంప్యూటర్ల వరకు, గుండు సూది నుండి అతి సంక్లిష్ట యంత్రాలు, సామగ్రి వరకు సమస్తమూ మనము ఉత్పత్తి చేసుకుంటున్నాము.

ప్రపంచంలోని ఏ యితర దేశం కంటె (అమెరికా రష్యాలు మినహా) శిక్షణ పొందిన శాస్త్రజ్ఞులు, సాంకేతిక వేత్తలు మనకు అధికంగా ఉన్నారు. అనేక వర్ధమాన దేశాలు మన సహకారంతో సంయుక్తంగా పారిశ్రామిక సంస్థలు నెలకొల్పుకున్నాయి.



పంచవర్ష ప్రణాళిక, 20 అంశాల కార్యక్రమాలలో ఉద్దేశింపబడిన కార్య సంపూర్తికి వలసిన నేర్పు, సమర్థతలను ఈ విజయాలు మనకు సమకూర్చాయి.

విశ్వసనీయమైన భవిష్యత్తు వైపు మనము పురోగమిస్తున్నాము

davp 83/38

ఎగ్జిబిషన్‌కు వచ్చిన మనుషులు మెల్లగా తిరుగుతున్నారు. జెయింట్‌వీల్ గిర్రున తిరుగుతోంది...

"నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను..."

ఆమె అతడి కళ్లలోకి నవ్వుతూ చూసి "అనుకున్నాను" అన్నది.

రాజారావు సిగ్గుపడ్డాడు.

"కేవలం ప్రేమించటమేకాదు... మీరు ఒప్పుకుంటే పెళ్లికూడా చేసుకుంటాను."

సరళ కొంచెం ఆశ్చర్యపడింది. అతను అప్పుడే పెళ్లి గురించి కూడా మాట్లాడతాడని ఆమె వూహించలేదు.

"మీకు ఇష్టమేనా సరళా" అడిగాడతను.

"నాకు ఇష్టమయినా కట్నం ఇవ్వగలిగిన స్తోమతు మాకు లేదు. నాకు తండ్రి లేదు. మా అమ్మ ఎంతో కష్టపడి నన్ను పెంచగలిగింది" అన్నది సరళ.

"నాకు కట్నం అవసరంలేదు సరళగారూ... నాకు మీరు కావాలి... అంతే... చెప్పండి... మీకు ఇష్టమే కదూ" అన్నాడు రాజారావు ఆవేశంగా —

"కేవలం నా ఇష్టమే కాదు రాజారావు గారూ... మా అమ్మతో కూడా ఓ మాట చెప్పాలికదా" అన్నది సరళ.

"అలాగే... మీ అమ్మగారితో చెప్పండి. రేపు మీరు నాకు ఏ విషయం చెప్పాలి. నేను ఇంటికి లెటర్రాస్తాను. సరేనంటారా?"అన్నాడు.

సరళ తలూపింది.

తర్వాత ఇద్దరూ లేచి అక్కడినించి కదిలారు. పక్కపక్కనే నడుస్తున్న వారిద్దరికీ కూల్‌డ్రింక్ స్టాల్ దగ్గర నిల్చుని డ్రింకు తాగుతున్న రాజేశ్వరి కనిపించింది. ఆమె వాళ్ళు పనిచేసే బ్యాంకులోనే ఎకౌంటెంటుగా పని చేస్తోంది. ఆమెకు పెళ్ళయింది. ఇద్దరు పిల్లలు. ఆమె భర్త ఏదో ప్రయివేటు కంపెనీలో పని చేస్తున్నాడు. ఆమె డ్రింకు తాగుతూ నవ్వుతూ ఓ యువకుడితో మాట్లాడుతోంది. ఇద్దరూ అతన్ని గుర్తించారు. అతను బ్యాంకు మేనేజరు. అతను కూడా నవ్వుతూ డ్రింకు తాగుతున్నాడు.

వాళ్ళిద్దరూ రాజారావుని, సరళని చూడలేదు.

వారిని దాటి వచ్చేశాక "పెళ్ళయి ఇద్దరు పిల్లల తల్లయి అలా పరాయి మగాడితోనవ్వుతూ ఎగ్జిబిషన్‌లో డ్రింకు తాగటానికి ఆమెకు సిగ్గని ఎలా అనిపించడం లేదో నాకు అర్థం కావటం లేదు సరళగారూ. పాపం... ఈ రాజేశ్వరిగారి మొగుడికి ఈ విషయం తెలీదు కదా... తన భార్య చాలా పతివ్రత అని సంతోషపడిపోతూ వుంటాడు... కదూ!" అన్నాడు రాజారావు.

సరళ మాట్లాడలేదు.

ఎగ్జిబిషన్ గ్రవుండ్సు నించి బయటకు వచ్చిన తర్వాత "ఇక నే వెళతాను... రేపు మీరు నాకు మీ నిర్ణయాన్ని తెలియజేస్తారు కదూ" అన్నాడు రాజారావు.

"రేపటివరకూ అవసరంలేదు రాజారావు గారూ... నా నిర్ణయాన్ని ఇప్పుడే తెలియజేస్తాను. మిమ్మల్ని పెళ్లి చేసుకోవటం నాకు ఇష్టంలేదు. ఎందుకంటే మీది చాలా సంకుచితమైన మనస్తత్వం అని ఇప్పుడే అర్థమయింది. ఎలాగంటే — మనం కలుసుకున్నట్టే రాజేశ్వరి— బ్రాంచి మేనేజరు ఎగ్జిబిషన్‌లో కలుసుకుని వుండొచ్చు... ఒకే ఆఫీసులో పనిచేసే ఉద్యోగులు ఒకరిలో ఒకరు కొంచెం చనువుగా మాట్లాడుకోవటం — నవ్వుకోటం చాలా సహజమైన విషయం. అలాంటి సహజమైన విషయాన్ని మీరు ఎంతో అసహజమైన విషయంగా చిత్రించి వాళ్ళిద్దరికీ ఏదో సంబంధం వున్నట్టూ, ఆమె తన భర్తను మోసం చేస్తున్నట్టూ మాట్లాడారు. మీ మాటల్లోనే మీ దృష్టి తెలుస్తోంది. మీ సంస్కారం బయటపడుతోంది. మీలాంటి మనిషిని నేను కోరుకోలేను. సారీ... ఈ విషయం గురించి మరచిపొండి" అని అక్కడి నించి వెళ్ళిపోయింది సరళ.

స్థాణువులా నిలబడిపోయాడు రాజారావు. అతని మెదడులో ఆలోచనలు జయింట్‌వీల్‌లా గిర్రున తిరుగుతున్నాయి. ★

హైదరాబాద్ నోట్‌బుక్

తిరుమల రామచంద్ర

మహా పౌరాణికులు కల్లూరివారు :

ఆడిన మాట కచ్చితము
  అట్టేటుగా మొగమిచ్చకంబు న
న్నాడగనీదు శారద కదా,
  కడుపియ్యెడ చేతబట్టి న
న్నాడకు నీడకంపదు, నిరా
  దర నీరస మూర్ఖగోష్ఠులన్
మేడల క్రింద నన్నిలువనీదు,
  నిజానకు భాగ్యవంతుడన్.

అంటారు మహా పౌరాణికులు శ్రీ కల్లూరి వేంకట సుబ్రహ్మణ్య దీక్షితులు. ఆయన ప్రతి మాటలోను సంతృప్తి, సమధిక విశ్వాసం పొంగి పొర్లుతుంటాయి. పురాణాలు ఏవో కాకమ్మ కథలు కావు. అవి వేదోపబృంహకాలు. వేదానికి ఆరు కల్పాలు — చారిత్రక, నాక్షత్ర, జారణ, వైతానికాదులుగా. వితానమంటే విద్యుచ్ఛక్తి. వేదానికి వ్యాఖ్యానాలే పురాణాలు. గహనమైన వేద రహస్యాలను కదలీపాకంగా ప్రజలకు అందించేవి పురాణాలు. బ్రహ్మపురాణంలో నమక చమకాలు వేదపాదస్తవం పేరుతో ఉన్నాయి. విష్ణు పురాణంలో పురుష సూక్తం విష్ణు స్తవం పేర ఉన్నది. అష్టాదశ పురాణాలలో సర్గ, ప్రతిసర్గ, వంశ, మన్వంతర, వంశాను చరితమనే ఐదు లక్షణాలకు సంబంధించిన విషయాలే కాక వేదాంగాలు, ఉపవేదాలు, షడ్దర్శనాలు, చతుష్షష్టికళలు ఉన్నాయి. భవిష్యపురాణంలో ఇస్త్రీ చేయడం, సూచీవాన కల్పం(లేసు కుట్టుపని). రాజ్యాంగం వివరించబడ్డాయి. చిత్రరచనలో మకరికా పత్రాదులు రహస్యావయవాలపై రచిస్తే ఎక్కువ భృతి ఇవ్వవలసిందనే విచిత్ర విషయాలు ఉన్నాయి. అష్టాదశ పురాణాలలో ఆరు లక్ష్మికి, ఆరు మహాకాళికి, ఆరు సరస్వతికి సంబంధించినట్టేవి. లక్ష్మి అంటే కాంతి—లైటు. మహాకాళి అంటే వేడి—**హీట్**, ఎనర్జీ. సరస్వతి అంటే ధ్వని—సౌండ్. అందువల్లనే అష్టాదశ పురాణాల పేర్లు పఠించిన, నిత్యం ముప్పొద్దులా జపించినా అశ్వమేధ ఫలం లభిస్తుందంటారు పెద్దలు. పురాణజ్ఞుడు మహాగురువనీ అన్నారు.

జియోపజీవీ యో నిత్యం
స మహాగురు రుచ్యతే.

జయ అంటే 18 పురాణాలు. అవి ధర్మార్థకామ మోక్షాలను పరిభాషతో ప్రమేయం లేకుండా వెన్న తరచి తీసినట్టు వివరిస్తాయి. వేదాంత విద్యకు మార్కండేయ పురాణం ఉదాహరణం. లలిత లలితమైన భాష. దేవతా సామరస్యం, వర్ణసామరస్యం, మతసామరస్యం, భావ సామరస్యం పురాణాలవల్ల జరిగినంతగా మరిదేనివల్లా జరుగలేదు. లోకాంతర చర్చ, జీవయాత్ర, ఖగోళ చర్చ— ఇంతెందుకు సకల విషయాలకూ పురాణాలు పెన్నిధులు. కనుకనే వ్యాసోచ్ఛిష్టం జగత్సర్వమని అన్నారు. వాసుడు భగవంతుడే. బ్రహ్మాండోత్పత్తి వినాశాలు, భూతాల గత్యాగతాలు తెలుసుకొన్నవాడే భగవానుడు. అలాటివాడు వ్యాసుడు— అంటారు అర్థశతాబ్దిగా పురాణాలలో పరిశోధన జరుపుతున్న కల్లూరివారు. పశ్చిమగోదావరిజిల్లా పట్టిసం సమీపంలోని తాళ్లపూడి ఈయన జన్మస్థలం. పండితవంశం.

శ్రీ కల్లూరి వేంకటసుబ్రహ్మణ్య దీక్షితులు



తల్లి శ్రీమతి రామలక్ష్మమ్మ విదుషి, యోగిని. ఈయన 1908 లో జన్మించారు. పోలవరంలో ఎనిమిదవ తరగతి వరకు చదివారు. తల్లిగారివద్ద సంస్కృతాంధ్రాలు నేర్చారు. 1922 లో స్వాతంత్ర్యోద్యమ ప్రభావంతో చదువుమాని, పిదప కొవ్వూరిలోని ఆంధ్ర గీర్వాణ విద్యాపీఠం విద్యార్థిగా 1932 లో విద్వాన్ పరీక్షలో సర్వ ప్రథములుగా ఉత్తీర్ణులయ్యారు. 18 ఏట నుంచే మూడేళ్లు స్వగ్రామంలో కరణీకంచేశారు. నాలుగేళ్లు పోలవరంలోను, 1935 నుంచి 1966 వరకు విజయవాడ మునిసిపల్ హైస్కూలులో పండితులుగా, రెండేళ్లు కొత్తగూడెం, భీమవరంలలో సంస్కృతోపాధ్యాయులుగా, 68 నుంచి 74 వరకు కొవ్వూరులోని ఆంధ్ర గీర్వాణ విద్యాపీఠంలో ఆచార్యులుగా ఉన్నారు. మాళవమంత్రి దేవేశ్వర మహాకవి రచితమైన కవి కల్పలత ఆంధ్రీకరణం, అష్టాదశ పురాణాలలో పదకొండు పురాణాల వచనానువాదం, ఆర్యా ద్విశతి, మూక పంచశతి ఆంధ్రీకరణం, నారాయణీయం అనువాదం, కామకోటి పీఠాధిపతి ప్రసంగాల తెలుగుసేత నవనీతం, మంజీరం, గురుకృపాలహరి అనే సంస్కృత స్వతంత్ర కావ్యం ఈయన ముద్రిత రచనలు, పెక్కు శతకాలూ రచించారు, ముద్రించారు. కలియుగ భవిష్యత్తు, ప్రబోధ సుధాకరం, తేటగీత (భగవద్గీత), విశ్వభాషిణి (ప్రపంచ భాషలకు ఏకైక వ్యాకరణం), పురాణ విజ్ఞాన సర్వస్వం, శ్రీనాదీయం, చాటు ప్రబంధము మున్నగునవి అముద్రితాలు చాల ఉన్నాయి. కల్లూరివారు రాష్ట్రీయోపాధ్యాయ పండిత పరిషత్తు నిర్వాహకులుగాను, ఆంధ్రప్రదేశ్ విద్యా పరిషత్కార్యదర్శిగాను ఉపాధ్యాయ పండితుల యోగక్షేమాలకై కృషిచేశారు. కల్లూరివారిది కమ్మని కంఠం. శ్రోతలకు రంజకం. ఆయన స్వభావానికి తార్కాణంగా మొదట్లోనే ఆయన పద్యం ఉదాహరించాను. ప్రస్తుతం కల్లూరివారు అశోక్‌నగర్‌లోని సత్యనారాయణ స్వామి కోవెలలో పురాణ ప్రవచనం చేస్తున్నారు. ఆయన ప్రవచనం పరిశోధనల వెన్నముద్ద. వేదోపబృంహకాలైన పురాణాల విషయాలు అందరికీ తెలియాలి. భాషద్వారా సమైక్యం కలుగాలి. నేను ఆర్షభారతి వ్యవస్థాపకుణ్ని. 50 ఏళ్లుగా పురాణాలలో పరిశ్రమిస్తున్నాను. పురాణాలన్నీ యథాతథంగా అనువాదం కావాలి. అన్నిభాషలలో పురాణాలపై వచ్చిన సర్వవిధ వాఙ్మయాన్ని సేకరించాలి. ఉత్తమ లేఖకులు కావాలి. ముద్రణాలయం కావాలి. బ్రహ్మపురాణం అచ్చవుతున్నది. పురాణాల అనువాదాల చివర ఆధునిక దృష్టితో జరిగిన పరిశోధన సమన్వయాలు ఉంటాయి. ఇవన్నీ జరగాలని కల్లూరివారి ఆవేదన.



హైదరాబాద్ నోట్ బుక్

ఏ తద్దేశ ప్రసూతస్య
సకాశాదగ్ర జన్మనః,
స్వంస్వం చరిత్రం శిక్షేరన్
పృధివ్యాం సర్వమానవాః

ఈ దేశంలో పుట్టిన ఉత్తమ కుల సంజాతుని చరిత్రనుంచి ప్రపంచంలోని సకల ప్రజలు తమ చరిత్రను తీర్చిదిద్దుకోవాలి — అని మనువు చెప్పాడు. ఆ విధంగా మనదేశం సకల ప్రపంచ ప్రజలకూ మార్గదర్శకం కావాలి— అన్నారు ఆయన ఉత్సాహంతో. ఆర్షభారతిని శ్రీ పల్లెంపాటి వేంకటేశ్వర్లు పోషిస్తున్నారు. ఆయన కాకతీయ సిమెంట్ అనే వ్యాపార సంస్థ యజమాని. సత్యనారాయణస్వామి ఆలయం స్థాపకుడు, ధర్మకర్త. ఆయన సంస్కృతి ప్రీతివల్లనే శ్రీ ముదిగొండ వేంకటరామశాస్త్రి గారు వేదాంత ప్రవచనం, శ్రీ కుప్పా వేంకటాచలపతి సోమయాజులు గారు నిత్యవేద పారాయణం, నేను పురాణ ప్రవచనం చేస్తున్నాము — అన్నారు కల్హారివారు. ఆయన ఆశయాల పూర్తికి, శ్రీ వేంకటేశ్వర్ల ఆశయ సిద్ధికి కృషి చురుకుగా జరుగాలి. వారు తమ ఆశయసిద్ధి వరకు సంపూర్ణాయురారోగ్యైశ్వర్యాలతో విరాజిల్లాలి.

ఎన్.జి.వో.ల సమ్మె విరమణ :


జులై 16 వ తేదీ నుంచి సమ్మె సాగించిన ఆంధ్రప్రదేశ్ ఎన్. జి. వో.లు ఆగస్టు 3 వ తేదీ సాయంకాలం సమ్మె విరమించి 4 వ తేదీన యధావిధిగా పనికి హాజరయ్యారు. రెండు రోజుల పాటు ఉన్నతాధికారులకు, ఎన్. జి. వో. నాయకులకూ జరిగిన చర్చల ఫలితంగా ఈ శుభ పరిణామం కలిగింది.

ఉపశ్రుతి :

బజార్లో ఏ నోటుబుక్కు దొరక్కపోయినా, ఏ ఇబ్బందీ లేకుండా వారం వారం దొరికే నోటుబుక్కూ మీ హైదరాబాద్ నోట్‌బుక్కు ఒక్కటే — అని ఛలోక్తి విసిరారు మిత్రులు శ్రీ నిడుదవోలు సుందరేశ్వరరావు. ఏం లాభం ! పిల్లలనోరు మూయించగలమా ! వ్రాసుకోగలమా ! — అన్నారు మరొకరు. ★

Printed and Published by S. Nageswara Rao at the Andhra Patrika Press Mallikarjuna Rao Street, Gandhinagar, Vijayawada-3 Editor: S. Radhakrishna.


ARUN
మహిళా కార్టూనిస్టులు
పత్రికల్లో నా కార్టూన్లు చూడ్డానికి అస్తమానం వెతుకుతున్నానని - మా వారే ఓ 'ఏజన్సీ' తీసుకున్నారు పిన్నీ........
ఈశ్వర్ ఏజన్సీస్ :- ఇచ్చట అన్ని దిన, వార, పక్ష, మాస పత్రికలు అమ్మబడును
POST
కార్టూన్లు అన్నీ తిరిగొచ్చాయని మరీ అంత నిరుత్సాహపడితే ఎలా - మరోసారి గీసి పంపించి చూడు సుచీ..........
మొన్న పండక్కి కార్టూన్లు బాగానే పడ్డాయిగా - ఈ సారికి ఆ డబ్బుల్తో చీర కొనుక్కో - మరోసారి చూద్దాంలే.....
దిండుగలేబు మీద ఏదైనా డిజైన్ ఎంబ్రాయిడ్ చేయమంటే - ఇదేమిటి?
ఓ ఎమ్మెల్యేగారి భార్య - కార్టూనిస్టు కదా నూ! ఏదైనా కార్టూన్ల ఐడియాలు దొరుకుతాయని మన మీటింగ్స్ కి హాజరవుతుంటుంది.....
ఇకనుంచి నువ్వు కార్టూన్లే కాదు - కథలు కూడా మొదలెట్టాలోయ్ - ఖర్చు పెరగబోతుంది కదా........!


ఉన్నతమైన నాణ్యత
ప్రియలోనే వుంది
priya
ఎన్నిక చేసిన దినుసులన్నీ సమపాళ్లతో
మేళవించి అద్భుతమైన రుచులతో
రూపొందించినవే ప్రియ పచ్చళ్ళు.
మీ భోజనానికి సంతృప్తి సరిజోడు-ప్రియ
ఈనాడే మీ ప్రియను మీ ఇంటికి తీసుకువెళ్ళండి.
ఎంతో రుచి... ఎంతో రుచి... ప్రియ
ప్రియ ఫుడ్స్
ప్రైవేట్ లిమిటెడ్
Marketed by:
MARGADARSI MAR
PRIVATE LIMITED